## అంకితము



ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే కర్తవు. నీవే భర్తవు. నీవే ఆదిమూలము. నేను నిమిత్తమాత్రుడను. అన్నమాచార్యులవారిపై ఆపేక్ష కలిగించిందీ నీవే. నా జీవితగమ్యం ఆయన కీర్తనల వివరణ అని నిర్దేశించిందీ నీవే. 70 ఏళ్ళ ముసలిప్రాణి చేత నీ శృంగార కీర్తనలను వివరింపజేస్తున్నదీ నీవే. దీనితోనైనా నాకు విముక్తి ప్రసాదించు ప్రభూ! నీవునాకు అన్నీ ఇచ్చావు నేను “దాత”కు యేమీయగలను. నాది అనేది ఈ కృతి ఒక్కటే. దీనిని నిర్మలమైన మనస్సుతో నీకర్పిస్తున్నాను.

నేను ధన్యుడను తండ్రీ! ఎందుకంటే...

శా॥ **ఆదిన్ శ్రీసతికొప్పుపై, తనువుపై, అంశోత్తరీయంబుపై,**
**పాదాబ్జంబులపై, కపోలతటిపై, పాలిండ్లపై నూత్నమ-**
**ర్యాదన్‌చెందుకరంబు క్రిందగుట మీదై నా కరంబుంట,మే-**
**ల్గాదే! ప్రాణము గీణమున్ సతతమే! గైకొమ్ము దీనిన్ ప్రభూ!**



**(సంపుటి - I)**



# హరి వేంకటపతి అఖిలం మధురం

## ఎన్నుకొన్న అన్నమయ్య సంకీర్తనలకు

## భావదీపిక

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు





# హరి వేంకటపతి అఖిలం మధురం

(సంపుటి - I)

## ఎన్నుకొన్న అన్నమయ్య సంకీర్తనలకు
## భావదీపిక

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు** M.Tech.



**హరి వేంకటపతి అఖిలం మధురం**

(సంపుటి - I)

మొదటి ప్రచురణ

**డిసెంబర్ 2015**

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

వెల : **అమూల్యం**

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,

హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ :

కె.వి.ఆర్.

98495 79345

చం॥ పదకవితాపితామహుడు పాడిన కీర్తనలందు మాధురీ
సదనములెన్ని చూచితిని చక్కని భావములెన్ని గాంచితిన్!!
కుదురుగనోప్రభూ! సిరులు కోరను వో తిరువేంకటేశ్వరా!
పెదవుల నవ్వులే చలువ వెన్నెల జిల్కిన నేను ధన్యుడన్.

మ॥ కవితన్ జెప్పుట నీవె నేర్పితివి యే కావ్యంబు నే జూచితిన్?
భువిపై పుట్టుక నిచ్చి "పెంచితివి" నాపుణ్యంబదేమో విభో!
భవ బంధంబుల రోసిరోసి వెగటై ప్రార్థించి దిక్కంటిరా
భువనోద్ధారక వేంకటేశ! కృపతో బ్రోవంగ నీ భారమే

శా॥ కారే భోగులు!! భాగ్యముల్ కలుగవే గర్వోన్నతుల్ బొందరే
వారే రీ సిరి వెంటబెట్టుకొని పోవంజాలిరే భ్రాంతులై
వోరాజీవ సునేత్ర వేంకటపతీ! వొల్లన్ సిరుల్ సంపదల్
నీ రమ్యంబగు నామ సంస్మరణమున్ నీవిమ్ము నా నాల్కపై

తే.గీ॥ వేంకటేశుని రతికళావిభవమంత
పాడి మురిపించె మధురమౌ "పద కవితల",
అన్నమయ్యకు సాటిలేరయ్య! కవుల
అతని వివరించ నా పుణ్యకతన జుమ్మీ!

మత్తకోకిల :
ఒక్కమాటకు పెక్కు అర్థములున్నవీ మధురమ్ములౌ
చక్కనౌ రసస్ఫూర్తి గల్గిన సాటిలేనివి కీర్తనల్
నిక్కు వేంకటనాథు గొల్చెడి నేల నిండిన భక్తులున్
ఎక్కడున్నా అన్నమయ్యకు యెవ్వడైనను మొక్కురా.



# హరి వేంకటపతి అఖిలం మధురం

**(సంపుటి I)**

ఎన్నుకొన్న అన్నమయ్య శృంగార కీర్తనలకు భావదీపిక

## విషయ సూచిక


| క్ర.సం. | కీర్తన వివరము | సంపుటము/సంఖ్య | పేజి |
|---|---|---|---|
| 1. | అంగననాసలనేలఅలయించేవు | 22/391 | 03 |
| 2. | అంతచాలదానీకు ఇసుకమీదలేలరా | (పె.శృ) 17/467 | 02 |
| 3. | అందరికొకటే చాలు ఆండ్లకు మగలకు | 22/63 | 14 |
| 4. | అక్కడివారినే నీవు అటు చెండుకోరాదా | (పె.శృ) 17/465 | 15 |
| 5. | అతడు నన్ను మన్నించేదంతా నేనెఱుగుదు | 22/237 | 32 |
| 6. | అల్లవారే సరసములాడుకొనేరు | 22/389 | 08 |
| 7. | ఆటదాన నవుట తప్పా అంతేకాదా | 22/65 | 05 |
| 8. | ఆపాటికాపాటి అంతేపోవిభుడ | (పె.శృ) 17/458 | 26 |
| 9. | ఇంతతోటి యేలాటలెందాకాను | 23/453 | 50 |
| 10. | ఇందాకాబొరలితివి యేడలేని విరహాన | 22/157 | 25 |
| 11. | ఇది దానెఱుగడా ఇంపుల నా రమణుడు | 22/99 | 09 |
| 12. | ఇదియేటిదయ్యా యెంతసేసితివి | 23/216 | 41 |
| 13. | ఇదివో సుద్దులు యీ రేపల్లెను | 22/77 | 17 |
| 14. | ఇవిగొన్ని నేర్చితివి యీడానాడా దిరిగాడి | 23/474 | 47 |
| 15. | ఉండనుండ దరితీపులౌగరాయగా | 22/66 | 04 |
| 16. | ఎదుటనుండవే నీవు యే పొద్దును | 22/252 | 27 |
| 17. | ఎన్ని నేరుచుకొంటివి యెంతని సంతోషించే | 22/253 | 28 |
| 18. | ఎటిగించవే నాకు నేల దాచేవు | 22/156 | 23 |
| 19. | ఏమన్నా వాదుకు వచ్చే ఎంతగర్వము | (పె.శృ) 17/466 | 13 |
| 20. | ఏలకో తలపెక్కడనుందో | (పె.శృ) 17/455 | 20 |
| 21. | ఒక్కమనసుననిట్టే వుండగదవే | 22/182 | 38 |
| 22. | కంటిమిదె మిమ్మిద్దరిని కన్నులపండుగలాయ | 22/236 | 37 |
| 23. | కన్నదె విన్నదె కందువసుమ్మి | 22/114 | 29 |

| | | |
|---|---|---|
| 24. కూరిమినెక్కవయ్యా నా కుచదుర్గములు | 23/560 | 46 |
| 25. కొంగువట్టకంత నీవు గొల్లబోయడా | 23/98 | 10 |
| 26. చాలు చాలు నున్నదెల్లా చాలదా | (పె.శృ) 17/459 | 16 |
| 27. చెప్పనీవే సుద్దులు చేరిచెక్కునేనొక్కి | 22/110 | 35 |
| 28. చెప్పినవారి బుద్ధులు సేయవైతిగా | 22/62 | 36 |
| 29. చెలినీవు మొదలనే సిగ్గుల పెండ్లికూతురు | 22/249 | 12 |
| 30. తగవైన పనులివి తరుణులకెల్ల | 22/251 | 33 |
| 31. తగునయ్య నీకిన్నియు దైవపురాయ | 23/456 | 42 |
| 32. తగులు విరిమోహాల దాయగాడా | (పె.శృ) 17/457 | 22 |
| 33. తానే తడవిన తడవేగాకిక | 22/78 | 11 |
| 34. తొలుతనే మంకువారు దొడ్డివారు | 23/44 | 44 |
| 35. నిన్నుబాసియు నీపతి నీవొద్దనున్నాడ | (పె.శృ) 17/456 | 18 |
| 36. నిలుచున్నాడల్లవాడె నివ్వెరగుతో | 23/591 | 40 |
| 37. నీకంటే జలమరి నెలతకు చెప్పరాదు | 23/455 | 48 |
| 38. నీమహిమే నాలో నిండిన వలపు | 22/155 | 39 |
| 39. నీరుకొలది తామర నీతో వలపు | 22/250 | 07 |
| 40. నీవు సేసిన భాగ్యము నేమేమని పొగడమే | 22/184 | 21 |
| 41. నీవాడే సరసము నిన్ను నింతసేసెను | 22/183 | 30 |
| 42. నేను సంతోసించుకొనే నీకుదోడుగా | 22/238 | 31 |
| 43. పసిడి చీరవాడవు పాలుదచ్చితివిగాన | 22/64 | 01 |
| 44. పిలిపించుకోవలెనా పెనగి సారెసారెకు | 22/390 | 06 |
| 45. బలువుకొలదియే పో పంతమెల్లా | 22/113 | 34 |
| 46. మాటలనే చలినాపమనకే | 22/111 | 19 |
| 47. మెత్తనిమనసుదాన మిక్కిలి నేనూ | 23/477 | 44 |
| 48. వినరమ్మ యీసుద్దులు వెలదులాల | 23/454 | 50 |
| 49. వెనకటినేరములు వేయైనా దడవను | 23/168 | 51 |
| 50. వేగిరమేలా వేయనీవోలా | 23/476 | 45 |
| 51. సేసిరా నేను నీవు చెప్పినట్టెల్లా | (పె.శృ) 17/458 | 24 |




# ప్రార్థన

కం॥ శ్రీరమణీ కుచ కుంకుమ
నీ రూపము "నెఱుపు" జేయ నీరజనాభా!
నా రచన "శృతిని మించిన"
కారుణ్యము జూపి నన్ను గరుణించగదే!

ఆ.వె॥ అన్నమయ్య పాట అందదు "మేధకు"
నా స్ఫురణకు తోచి నాకు జిక్కి-
నంతవరకు దీని నందించగలవాడ
"బుధులు" తప్పుగాచి బ్రోవ మనవి

కం॥ హరి వేంకటపతి అఖిలం
బరరే!! "మధురంబు" కాదె! ఆర్యులు పొగడన్
సరియగు"మున్నుడి", "భావము"
గురుడన్నమ కవి పదంబు గొలిచి వచింతున్

ఉ॥ ఎంతని వేడుకోగలను? ఇప్పటికైనను "ముక్తు" జేయరా
సుంత దయైన రాదిటుల శోధనలేల సురేంద్రవందితా?
చెంతకుజేర రమ్మనవు సేదను దీర్చవు, దైనికంబులౌ
చింతలు దీర్చి పెంచెదవు చిత్రపుటాసలు వేంకటేశ్వరా!

సీ॥ ఎవరి కర్మఫలంబులేరీతి నుండునో
యెరిగినదెవ్వండు యీవుదక్క
ఎవరికి పాపమో యెవరికి పుణ్యమో
యెవరెరుంగుదురయ్య నీవుదక్క
ఎవరికి దుఃఖమో యెవరికి సౌఖ్యమో
యెవ్వాడెరుంగును యీవుదక్క
ఎవరికి మరణమో యెవరికి జననమో
యెవ్వడిదెరుగును యీవుదక్క

ఆ.వె॥ ఎంచి జీవకోటి ముంచేవు "భ్రమ"లోన
ఆటనాడుకొనటునాపవయ్య!
శరణుజొచ్చినాము సర్వేశ్వరా! నీకు
వేదనలను బాపు వేంకటేశ!

పదిరోజుల వర్షం యేడిపిస్తే మనిషి యేమిచేయగలిగాడు? అదే సముద్రం కూడా చేయికలిపితే మానవమాత్రుడేమి చేయగలడు? నరుడు యేనాటికీ పరమాత్మునితో పోటీపడలేడు.

అందుకనే ఈ మిడిమిడి జ్ఞానం లేని మనిషి భగవంతుని తనకు తోచిన విధంగా స్తుతించాడు. శ్రీవేంకటేశ్వరుదు మానాన్న, పద్మావతీదేవి మా అమ్మ అనుకోగల మానసిక పరిపక్వతవుంటే ఇది శృంగారకావ్యం, లేనివారికి మలిన ప్రణయం. తమాషా యేమంటే ఆ పరిపక్వత అందరికీ రాదు. అది చదువులవల్లరాదు. సత్సంగత్యంవల్ల కూడా రాదు. భగవత్కృప వుంటేనే వస్తుంది.

కంచెర్లగోపన్న "ననుబ్రోవమని చెప్పవే సీతమ్మతల్లీ!" అంటూ, "చక్కంగ మరుకేళి చొక్కియుండెడి వేళ రామయ్య కాదనడమ్మా" అని మొత్తుకున్నాడు. అదీ శృంగారం అంటే. చివరికి రామయ్య ఆయన మాట విన్నాడా లేదా? శ్రీవేంకటపతి అన్నమయ్య మాట విన్నాడా లేదా? ఒకనాడు నామాటకూడా వింటాడు. కాకపోతే యెన్నడో??? చెప్పలేను.

Please visit my Website in Google Network

**"www.geetadeeksha.com"** అంతేకాదు

**"kinige.com"** వారి E-Book లో, నావి 10 పుస్తకాలు (2400) అన్నమయ్య కీర్తనల విశ్లేషణల మిమ్మల్ని అలరిస్తాయి.

TTD వారికి సదా కృతజ్ఞుడను.

"సర్వేజనా సుఖినోభవంతు"





# ముందుమాట

శ్రీవేంకటేశ్వరుని శృంగార వైభవాన్ని వర్ణించగల సామర్థ్యం, నందకాంశ సంభూతుడైన అన్నమాచార్యులకు మాత్రమే వున్నదని నా నిశ్చితాభిప్రాయం. మన ఆత్మయే పుత్రునిగా రూపుదిద్దుకుంటుందని ఆర్యోక్తి. అన్నమయ్య పుత్రుడైన పెద తిరుమలయ్య రచించిన శృంగారకీర్తనలను పరిశీలిస్తే ఆ విషయం సుస్పష్టమవుతుంది. తండ్రి చెప్పినంత అలవోకగా శృంగార రచనతో వేంకటరమణుని, శ్రీ రమణిని మురిపించిన ఘనుడు పెదతిరుమల. తరతరాలుగా హరిని మధుర భక్తితో అలరించిన ధన్యులు తాళ్ళపాక కవులు. అది నా రచన "హరిపై పద్యమే తాళ్ళపాక పదము"లో విపులంగా యెత్తిచూపాను.

ప్రస్తుతం పాఠకులు పరిశీలిస్తున్న యీ రచన "హరి వేంకటపతి అఖిలం మధురం" అన్నమయ్య చెప్పిన శృంగార సంకీర్తనలలో యెన్నుకొన్నవాటికి విశ్లేషణ. ప్రతి కీర్తనకు "మున్నుడి" అనే అవతారికను కూడా జతకూర్చాను. దీనివల్ల కీర్తన మరింత స్పష్టమవుతుందని నా భావన.

అన్నమయ్య శృంగారకీర్తనలతో సమస్య యేమంటే ఆ కీర్తన చెబుతున్నది అన్నమయ్య భావనా రమణియా, శ్రీరమణియా, వేంకటరమణుడా లేక వారి చెలికత్తెలా అన్న విషయం ఒక్కొక్కప్పుడు స్పష్టంగా తెలియదు. అదంత తేలిక వ్యవహారం కాదు.

ఇంకొక సమస్య యేమంటే 15వ శతాబ్ది నాటి రాయలసీమ మాండలిక పదాలు కొన్ని నేటి కాలంలో "లుప్త"మైనవి. రవ్వాశ్రీహరి గారి వంటి భాషాకోవిదుల కృషివలన నాబోటి వారి పని కొంత సుగమమైనప్పటికీ చాలా పదములకు అర్థం ఊహాజనితమే. కొన్ని పదాలకు అనేక నానార్థములుండుటవలన యేది అన్నమయ్య భావమో సుస్పష్టంగా తెలియదు. అందుకనే చాలామంది ఈ కీర్తనలకు "స్థాలీపులాకన్యాయంగా" వివరణనిచ్చారేగాని నాలాగా సాహసించలేదు.

దీనికి అనేక కారణాలున్నా, నేను చెప్పగలిగే నిజాయితీగల కారణం ఒక్కటే. నా వృత్తిగాని, చదువుగాని, అనుభవంగాని ఈ నా రచనకు కారణం కావు, కాలేవు. ఒక ఉదాహరణతో నేను చెప్పేది మీకే అర్థమౌతుంది. "పట్టెమంచము కోటి గుబ్బలు చన్నులంటా పట్టి పట్టి చూచి మోమప్పళించుకొను" అనే ఒక కీర్తన చరణం, నేటి

నవీనకాలం యువతీ యువకులకెలా అర్థమవుతుంది? దీనికి ప్రతిపదార్థ వివరణనిస్తే "బూతు" అనుకునే దౌర్భాగ్యులకు అట్టి వివరణ ఇవ్వకూడదనే పెద్దలు వివరించి వుండరు. అందుకనే నేటికి అన్నమయ్య శృంగార కీర్తనలు వేల సంఖ్యలో మాయమైపోయినా మనకు చీమ కుట్టినట్టన్నాలేదు.

కొందరు మహానుభావుల కృషివలన మనబోటి వారు కొంత స్వాంతన పొందినప్పటికీ నేటి నవీనమైన పరభాషావ్యామోహం వల్ల ఈ స్వాంతన యెన్నాళ్ళుంటుంది అనేది అనుమానాస్పదమే. నేటి కాలం భక్తి, పారమార్ధిక భక్తిగాక "పరమ ఆర్థిక" భక్తి అయిపోయింది. సరస శృంగారం "బ్లూ" అయిపోయింది. ఇది ఆధునికుల దురదృష్టం.

కాని అన్నమయ్య కాలంలో, జయదేవుని కాలంలో, క్షేత్రయ్యకాలంలో శృంగారం ఒక కళ. బూతు కాదు. శృంగార కవితతోనే వారు మోక్షాన్ని సాధించారు. దానిని కళలాగా, ఆరాధనలాగ చూడలేని వారికి శృంగారం మోక్ష సాధనం కాదు. అది కేవలం దైహిక సుఖం. అన్నమయ్య రాధామాధవ రతిని నిరతితో ఆరాధించాడు. శ్రీవేంకటేశ్వరుని రతిలీల అలమేలుమంగ విరహం, ఆయనకు మోక్ష సాధనాలయ్యాయి.

ఆ తాదాత్మ్యంలో అన్నమయ్య ఒక్కొక్కప్పుడు దేవికి భావనా చెలికత్తెయై ఆమెకెన్నో సలహాలనిచ్చారు కీర్తనలలో. ఒక్కొక్కప్పుడు శ్రీపతికి చెలికత్తెయై ఆయనకూ మగువ మనస్సును వివరించారు. ఒక్కొక్కప్పుడు తానే దేవుని వలపుకత్తెయై మూగ ప్రేమతో ఆరాధించాడు. మరొకప్పుడు రోషం చూపి పోట్లాడాడు. ఇవన్నీ భక్తిలో తాదాత్మ్యం చెందిన జీవుడు పడే ఆవేదనలే. పరమాత్మ, ఆత్మల "కూటమి"కి అవరోధం కలిగించేది "మాయ". ఇది కూడా పరాయిది కాదు. పరమాత్ముని సోదరి. ఆవిడ పనే ఆత్మ పరమాత్మల కూటమిని ఆపటం. అది క్షేత్రయ్య భావనాతరంగం. అన్నమయ్య తనని స్వామి వలపుకత్తెగా భావించుకొని, దేవిని 'ఆత్మ'వలె విడలేని భార్యగాను, స్వామిని ఆత్మేశ్వరునిగాను ప్రతిపాదించి అనేక విరహ కీర్తనలను చెప్పారు. మాయామోహితుడై సంసార తాపత్రయంలో పడినా తాను నిజంగా వలచింది శ్రీపతినే కాబట్టి స్వామి తనకి తాత్కాలిక "కలయిక" నిచ్చినా చాలనే "కీర్తిస్తుంటాడు".



వారి కలయికలో అన్నమయ్య పాటలోను అకలంక ప్రేమే కాని అశ్లీలం లేదు. "బూతు" ఆలోచన రాదు. అయినా...

ఆ.వె॥ బూతు వలన బుట్టి, బూతుకై వేసారి,
బూతు కొఱకె బ్రతికి, బూతు జరిపి
బూతుతోనె "సంతు భూతాల" పుట్టించి,
బూతు "భూత"మనగ, "బూతు" కాదె!!

ఇక్కడ నా అభిప్రాయం పాఠకులకు తెలియపరిస్తే బాగుంటుంది అని భావిస్తున్నాను. శృంగారకళను "బూతు"గా భావించేవారు "హరివేంకటపతి అఖిలం మధురం" చదవకపోవటమే మంచిది. "కాటుక కంటినీరు చనుకట్టుపయింబడ నేలనేడ్చెదో..." అన్న పోతనగారి పద్యం చదివితే, చదువులతల్లి వక్షోజాలు కనుపించే "గ్రంథసాంగులకు" ఈ అమలిన శృంగారంలో "మలినమే" కళ్ళముందుంటుంది. "నేల" "నేడ్చెదో" యేమిటి అనిపిస్తుంది. అటువంటివారు దీనిని చదివి "బాధపడితే" నాదగ్గర ప్రత్యుత్తరం లేదు.

మనబోటి భక్తులను కొనేవారికీ నచ్చని ఇంకొక విషయం, దేవి స్వామిని "ఏరా" అని పిలవటం. శృతిమించిన శృంగారంలో నాయిక తన మగని 'రా' అంటే తప్పులేదని లాక్షణికులేనాడో చెప్పారు.

నిరాకార నిరంజనుడైన జగన్నాథునికి 'ప్రణయతాపం' యేమిటి అంటే అన్నమయ్యను అర్థం చేసికొనే శక్తి మీకు లేదని తెలిసిపోతుంది. అటువంటి వైజ్ఞానికులకు ఇతర మత గ్రంథాలలో భగవంతుని "మహిమల ప్రస్తావన యెలా ఒప్పుగా కనుపిస్తున్నది? ఆ మతాలన్నీ మనిషి తన లోపాలను తాను సరిదిద్దుకోడానికి అవతరించాయి. వాటి దారులు వేర్వేరైనా గమ్యం ఒక్కటే. కానీ హైందవ ధర్మం అనాదిది. భగవంతుని యేరూపంలోనైనా యే విధానంలోనైనా యే భావనతోనైనా ఆరాధించు. ఆ"శక్తి"కి వినమ్రతతో మొక్కు. ఆ"శక్తి" గొప్పదనం కథల ద్వారా స్మరిస్తూ నీ అల్పత్వం గ్రహించి ఆ 'శక్తి'ని ఆరాధించి శరణువేడు, అంటుంది హైందవం.

పోనీ ఈ నామాట విని ఆలోచించండి. "చెన్నై" మహానగరాన్ని కేవలం





సంఖ్య : 66 సంపుటము : 22 పుట: 45 రాగం : కాంబోది

**4 ఉండనుండఁ దరితీపు లొగరాయఁగా**
**పండినవలపులెల్లాఁ బచ్చియాయఁగా ॥పల్లవి॥**

**వాలాయించి మాయింటికే వచ్చేనన్నవాఁడు నేఁడు**
**లేలే ఆకెయింటి కేఁగె లెస్సాయఁగా**
**నాలిసేసి నన్ను నింత నమ్మించి యిట్టె తాను**
**తాలిమిఁ బరాకుసేసీఁ దగవాయఁగా ॥ఉండ॥**

**యీరీతి నేనాడినట్టియేకతపుముచ్చటలు**
**మేరతో నాకెకుఁ జెప్పె మెచ్చాయఁగా**
**పారితెంచి తత్తరానఁ బానుపుమీఁదికి వచ్చి**
**జారువలపులు చల్లీ సంగతాయఁగా ॥ఉండ॥**

**నాకు లోనై యింతలోనే నగుతానే నన్నుఁ గూడి**
**ఆకెను నాతోనే తిట్టీ నరుదాయఁగా**
**పైకొని శ్రీవేంకటాద్రిపతిగాన యీమాయలు**
**జోకతోఁ దనకే చెల్లు సోద్యమాయఁగా ॥ఉండ॥ 66**

**మున్నుడి :**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ శృంగార కీర్తనలో నాయిక శ్రీవేంకటేశ్వరునికి తన వలపు వెగటైపోయిందని వాపోతున్నది. మేము యేకాంతంలో చెప్పుకొనె ముచ్చట్లను "ఆవిడ" (అన్నమయ్య)కు చేరవేసాడు. మళ్ళీ నాకు లొంగి నవ్వుతూ "కూడి" మురిపిస్తాడు. "ఆమె"ను నాముందు "తిట్టినట్లు" నటిస్తాడు. ఉత్తి మాయలమారివాడు. ఈ వేషాలన్నీ ఈయనకే చెల్లాయి అంటున్నది.

**భావ దీపిక :**

ఆయనగారికి నా తరితీపులు (వలపులు) నేటికి వుండివుండి వొగరైపోయాయి. పండిన నావలపులన్నీ యీనాటికి "పచ్చి"గా మారిపోయాయి. వాలాయించి (అవశ్యం) మాయింటికె వస్తానన్నవాడు, లేస్తూనే ఆమె (అన్నమయ్య) యింటికే పోయాడు. బాగానే అయింది నాకు. నాలిసేసి (నవ్వులపాలుచేసి), ఇంత నమ్మించి మోసం చేసిన వానిని, బరితెగించి పరాకు చిత్తగించిన వానితో పోట్లాట పెట్టుకుంటే తప్పా? మేమిద్దరమూ యేకాంతంలో చెప్పుకున్న ముచ్చట్లను మేరతో (వున్నదున్నట్లు) "ఆమె"తో చెబుతాడు. ఇదేమన్నా మెప్పుగావున్నదా? పైగా పారితెంచి (గబగబా వచ్చి) తత్తరపాటున పక్కలో పడుకొని జారునివలె వలపులు కుమ్మరించి, మరీ సంగమిస్తాడు. నాకు లొంగినట్లు నటించి నవ్వుతూనే రమిస్తాడు. అప్పుడు నాతో ఆమెను తిట్టినట్లు ఇచ్చకాలాడతాడు. ఇంత చోద్యం యేమన్నా వున్నదా? నన్నాక్రమించుకొని శ్రీవేంకటేశుడు మాయలు ప్రదర్శించటం తనకే చెల్లింది. ఇది మరీ చోద్యంగా లేదూ?



సంఖ్య : 64 సంపుటము : 22 పుట: 43 రాగం : బౌళి

**1 పసిఁడిచీరవాఁడవు పాలుదచ్చితివిగాన**
**పసిఁడిఁబోలినది చేపట్టెను నీకరము ॥పల్లవి॥**

**తొలుతనే చందురునితోడఁబుట్టుగనక**
**పొలుపుఁజందురు మోముపోలికైనది**
**కళల చింతామణికందువచెల్లెలుగాన**
**తళుకుమానికపుదంతములఁ బోలినది ॥పసి॥**

**మంచి యైరావతముతో మగువ సైదోడుగాన**
**ముంచినకరిగమనముఁ బోలినది**
**పంచలఁ బారిజాతపుభావపుసోదరిగాన**
**యెంచఁగ చిగురుఁబోలె నీకెపాదములు ॥పసి॥**

**తామెరతొట్టెలలోన తగిలి తానుండుఁగాన**
**తామెరకన్నులఁబోలి తనరినది**
**యీమేర నిన్నిటాఁ బోలి ఇన్నిలక్షణములతో**
**నీమేన శ్రీవేంకటేశ నెలవై నిల్చినది ॥పసి॥ 64**

**మున్నుడి :**

అత్యద్భుతమైన ఈ కీర్తనలో అన్నమయ్య స్వామికి అలమేల్మంగ విశిష్టతలను వివరిస్తున్నారు. బంగారపురంగు వస్త్రము ధరించి క్షీరాబ్ధిని చిలికావు కాబట్టి నీకు బంగారు ఛాయగల ఈ కన్యామణి వలచి నిన్ను చేపట్టినది. ఆమెకెన్నో అసాధారణమైన విశేషాలు వున్నాయి. అవెందుకు వచ్చాయో తెలుసా ప్రభూ! మరి నేను చెప్పేది ఆలకించవయ్యా!

**భావ దీపిక :**

ప్రభూ! నీవేమో బంగారు రంగు పట్టుబట్ట ధరిస్తావు. క్షీరసాగరాన్ని మధింపజేశావు. అందుకనే నీకు బంగారు ఛాయగల చిన్నది భార్య అయినది. మొట్టమొదట ఆమె చంద్రునికి తోబుట్టు. కాబట్టి చంద్రబింబం వంటి ముఖము వచ్చింది. ఆమె "చింతామణి" అనే మాణిక్యానికి తోబుట్టువు. అందుకే ఆమె దంతాలు మాణిక్యాలవలె మెరుస్తుంటాయి. ఐరావతము అనే కరిరాజు ఆమె తోబుట్టు. నాలుగుదంతములతో తెల్లని ఆ ఏనుగు నడక హుందాగా వుంటుంది. తోబుట్టువు కనుక ఈమె కూడా "కరిగమన"యే. అదే చోట "పారిజాతము" అనే దేవవృక్షము ఆమెతోబుట్టినది. అందుకే నీ భార్య పాదాలు లేత చిగురాకుల్లా వుంటాయయ్యా! ఇక ఆమె నివాసస్థానం తామెర తొట్టెలు. అందుకనే ఆమె కన్నులు పద్మములవలె వుంటాయి. ఈ విధంగా ఇన్ని విశిష్ట లక్షణాలున్న చిన్నది కాబట్టే నీవు ఈమెను చేపట్టినావు. ఓ శ్రీవేంకటేశా! నీ శరీరంలో హృదయమున తిష్టవేసికొని స్థిరంగా కూర్చున్నదయ్యా! ఈమె.

సంఖ్య : 467 సంపుటము : 17 పుట: 269 రాగం : భైరవి

**2** ఇంత చాలదా నీకు యిసుకమీఁదు లేలరా
చింతతోడ నుండఁగాను చిముడఁజేయ నేలరా ॥పల్లవి॥

కొసరి కొసరి నిన్నుఁ జూచి కోపగించఁ జాలకా
విసువుతోడ గొణఁగి పెదవి విఱుచుకొనఁగఁ జాలదా
పసలురేఁచి నీదుమేను పచ్చిసేయఁ జాలకా
ముసుగు వెట్టుకున్నదాన ముందు చెనక రాకురా ॥ఇంత॥

నాలిసేసి గేలిసేసి నవ్వ నిన్నుఁ జాలకా
వేళ వేళ నిన్నుఁ గినిసి వేసరించఁ జాలకా
నేల వ్రాత వ్రాసి నిన్ను నిందలాడఁ జాలకా
మూల నుండఁగాను నన్ను ముంగిట వేయ నేలరా ॥ఇంత॥

కదిసి మొక్కి నీదు మోవి గంటిసేయఁ జాలకా
వెదకి నిన్నుఁ జెలుల యెదుట వెంగెమాడఁ జాలకా
అదన శ్రీవేంకటేశ ఆయ మంటి నిన్నుఁ గూడి
యెదుట నున్నదాన నన్ను యెమ్మె చూప నేలరా ॥ఇంత॥ **467**

**మున్నుడి :**

పెదతిరుమలాచార్యులవారు తన తండ్రి అన్నమయ్య సంకీర్తనా దీక్ష కొనసాగిస్తూ అనేక శృంగార కీర్తనలను చెప్పారు. ఈ కీర్తనలో నాయిక స్వామితో యేమని విన్నవించుకుంటున్నదో ఆలకించండి. అసలే నేను చింతతో వున్నాను. దేవదేవునిపై హద్దులు మీరిన ప్రేమ దేనికి దారితీస్తుందో! ఎంత బేలతనంతో నాయిక స్వామినడుగుతున్నదో చూడండి? నాయిక పద్మావతీ దేవి. లేదా కవి భావనా సుందరి.

**భావ దీపిక :**

స్వామీ! ఇంతచేశావే! ఇంకా నీకు చాలలేదా? నీకు యిసుకమీదలేలరా? (యింత నిలకడలేదేమిరా?) అసలే నేను విచారంతో వుంటే, ఇంకా చిముడజేయ (బాధించుట) యెందుకురా? నిన్ను ప్రతిసారి కోపగించలేక, కాస్త విసుగుకొని గొణిగాను. పెదవికూడా విరిచాను. పసలురేచి (పిచ్చికోపంతో) నీ శరీరాన్ని, పచ్చిసేయజాలక (ఆరడిపెట్టలేక) ముసుగుతన్ని పడుకొన్నాను. తగుదునమ్మా అని నన్నెందుకు ముట్టుకొని అల్లరిచేస్తావు? నిన్ను నాలిసేసి (పరిహసించి), గేలిసేసి (ఎగతాళి చేసి) నొప్పించలేను. ప్రతిపూటా నీమీద అలిగి ఈసడించలేను. కాలిబొటనవ్రేలితో నేలపైవ్రాస్తూ నిన్ను తిట్టజాలను. ఏదో మూలపడివున్నదానిని నన్ను బయటపడవేయనేలరా? నీదు దరిజేరి మ్రొక్కగలనుగానీ నీ అధరాన్ని గంటుజేయలేను. నిన్ను వెదకి పట్టుకొని, నా చెలుల యెదుట యెకసెక్కమాడలేను. అదను జూచి వో శ్రీవేంకటేశ్వరా! నిన్ను గాఢాలింగనమున కూడితిని. నీ యెట్టెదుటనున్న నన్ను యెమ్మెజూపనేలరా? (గర్వము జూపుటెందులకు?)



సంఖ్య : 391 సంపుటము : 22 పుట: 261 రాగం : కన్నడగౌళ

**3** అంగన నాసలనేల అలయించేవు
అంగవించి కూడరాదా ఆయిత్తమై వున్నది ॥పల్లవి॥

వెనక నవ్వేవుగాని విడె మందుకొనరాదా
తనివోనికోరికల దగులున్నది
చనవు లిచ్చేవుగాని సరసములాడరాదా
పెనగొన్నరతులకుఁ బ్రియమందివున్నది ॥అంగ॥

కప్పుర మిచ్చేవుగాని కౌఁగలించుకొనరాదా
కప్పినవేడుకలతోఁ గాచుకున్నది
కొప్పు దువ్వేవుగాని గొబ్బున మోవియ్యరాదా
దప్పిదేరేముచ్చటలఁ దమకించి వున్నది ॥అంగ॥

మాటలాడుదువుగాని మర్మము లంటఁగరాదా
యీటున నీ చుట్టరిక మెంచుకున్నది
గాఁటపుశ్రీవేంకటేశ రాం(కాం?)త యలమేలుమంగ
మేటిపై నీవు గూడఁగ మెచ్చుకొనివున్నది ॥అంగ॥ **391**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ కీర్తనలో దేవి చెలికత్తెయై స్వామికి సలహానిస్తున్నారు. ఈ దేవి ఆశలనెందుకు వమ్ము చేస్తావయ్యా? అనునయించి అక్కున జేర్చి కూడరాదా? ఆమె సర్వసిద్ధమై నీకోసం యెదురుచూస్తున్నది. నీవేమో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నావు. నీవు చూపే ఈ "ప్రేమ" కృతకంగా వున్నది. మా అలమేల్మంగ నీ కూటమినెంత మెచ్చుకుంటుందో తెలుసా?

**భావ దీపిక :**

స్వామీ! యీ అంగన పెట్టుకొన్న ఆసల నేల అంత అలయించేవు (అలక్ష్యం చేస్తావు?) అంగవించి (దగ్గరై) ఆమెను కూడరాదా? ఆమె ఆయత్తమై (సిద్ధమై) వున్నది. ప్రభూ! ఈమె తనివోని (తృప్తితీరని) కోరికలతో తగులున్నది (తగులుకొనివున్నది). నీవేమో ఆమె విడెము (తాంబూలము) నందుకొనక వెనకుండి చిరునవ్వులు చిందిస్తున్నావు. చనవు (అనురాగం) ఇస్తావు కాని సరసముగా వుండవు. ఈమెపెన వైచిన రతులకై ప్రేమగా వేచివున్నది. దేవా! ఈమె కమ్ముకొన్న వేడుకలతో కాచుకొని వున్నది. నీవేమో యీమెకు కర్పూరమునిస్తావుగాని కౌగిలించవు. ఇదేమి విధానమయ్యా? ఆమె నీలికురులను దువ్వేవుగాని, గొబ్బున (గబుక్కున) పెదవి నందించరాదా? తృప్తిగా, ముచ్చట్లతో పరవశింపజేయరాదా? ఆమెకు మీ మధ్యవున్న చుట్టరికము తెలియదాయెను. నీవేమో మాటలతో పొద్దుపుచ్చేవుగాని కళలనంటవైతివి. ఇంక నేను చెప్పగలిగినదేమున్నది? కఠినుడవైన తిరుమలనాయకా! యీ కాంత నీ దేవేరి అలమేలుమంగ. నీవు నేర్పరివై కూడగా ఆమె నీపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నది.

సంఖ్య : 389 సంపుటము : 22 పుట: 260 రాగం : సాళంగనాట

**8 అల్లవారే సరసములాడుకొనేరు**
**వెల్లవిరియైనట్టి వేడుకకాండ్లె** ॥పల్లవి॥

**గద్దెమీఁద నున్నవారు కాంతయు రమణుఁడును**
**పెద్దరికములకే పెనఁగేరు**
**వొద్దికైననేరుపుల నొకరొకరి నెంచితే**
**ఇద్దరి కిద్దరే సాటి ఇన్నిటాను జాణలే** ॥అల్ల॥

**తెరలో నున్నవారు దేవియు దేవరవలె**
**దొరతనపుఁబంతాలఁ దులఁదూఁగేరు**
**సరి నెంచిచూచితే చక్కఁదనములయందు**
**పిరుతియ్య కొండొరులు పెచ్చువెరిగేరే** ॥అల్ల॥

**ఆలముకవున్నవారు అల్లియుఁ దామరవలె**
**పిలుపుఁబ్రియములతోఁ బెండ్లాడేరు**
**అలమేలుమంగ యీకె ఆతఁడు శ్రీవేంకటేశుఁ-**
**డలరి తానూఁదాను నమరివున్నారే** ॥లల॥ **389**

**మున్నుడి :**

అన్నమయ్య స్వామివారి కల్యాణకానుకగా చెప్పిన కీర్తన ఇది. వధూవరులు పెండ్లిపీటల (గద్దెల)పైననే సరసాలాడుకొంటున్నారట. సరసులైన వారికి వేడుకలు మిన్నంటవా? అల్లియు తామరపూవు పెనవేసికొనినట్లున్న వారిరువురు ప్రియసంభాషణలతో పెండ్లాడినారు అంటున్నారు. అన్నమయ్య మనో నేత్రం దర్శించిన కల్యాణమహోత్సవమిది.

**భావ దీపిక :**

అదిగో వారే పెండ్లిలోనే సరసములాడుకొంటున్న వధూవరులు, శ్రీవేంకటేశ్వరుడు అలమేలుమంగమ్మ. వెల్లివిరిసిన వారి వేడుకలు మిన్నుముట్టాయి. గద్దెపై (సింహాసనంపై) వున్నవారు శ్రీకాంత, శ్రీపతి. పెద్దరికం చూపించటంలో ఇద్దరూ పెనగేరు (పోటీపడ్డారు). ఆ నేర్పులో యెవ్వరధికులో అనియెంచితే ఇద్దరికిద్దరూ జాణలే (నేర్పరులే). అదిగో తెరమరుగున వారు, దేవి దేవరల వలె దొరతనమునకు వన్నెదెచ్చే పంతాలతో యెంత అతిశయించివున్నారో చూడండి. చక్కదనంలో యెవ్వరధికులో సరిగ్గా యెంచి చూస్తే పిరుతియ్యక (వెనక్కి తగ్గక) వొకరికొకరు పెచ్చుమీరేరు. వారు అల్లియు (నీటిలో పుట్టి పెరిగే వొకానొక పుష్పము) తామరపూవువలె అలుముకొన్నవారు (పెనవేసికొనినారు). ఒకరినొకరు ప్రేమగా పలుకరించుకొనుచు పెండ్లాడుచున్నారు. ఈమె అలమేలుమంగ. అతడు శ్రీవేంకటేశ్వరుడు. ఈవిధంగా వారు తానూదాను (వొకరికొకరు) అమరివున్నారు.



సంఖ్య : 65 సంపుటము : 22 పుట: 44 రాగం : గుజ్జరి

**5 ఆఁటదాన నవుట తప్పా అంతేకాదా**
**ఆటపాటలాయ బదు కంతేకాదా** ॥పల్లవి॥

**కొంగువట్టి తియ్యఁగాను గోరుదాఁకి యిందరిలో**
**అంగమెల్లాఁ బులకించె నంతేకాదా**
**వుంగిటిగా మగనాలి కుండరాదా వూరిలోన**
**అంగభంగాలఁబెట్టేవు అంతేకాదా** ॥ఆఁట॥

**మేరమీరి నగఁగాను మీఁదమీఁదఁ జెక్కులెల్లా**
**ఆరితేరి చెమరించె నంతేకాదా**
**వూరకే వోయమ్మ నీకు వుండవయ్య వెఱతుము**
**ఆరనితాప మందించే వంతేకాదా** ॥ఆఁట॥

**ఆకుమడిచి కొమ్మంటా ఆనవెట్టే వందనుండి**
**ఆకడివారు చూచేరు అంతేకాదా**
**చేకొని శ్రీవేంకటేశ చేయిమీరి కూడితివి**
**ఆకెసుద్దులు చెప్పేవు అంతేకాదా** ॥ఆఁట॥ **65**

**మున్నుడి :**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ మధుర కీర్తనలో దేవి స్వామితో యేమంటున్నదోవ వినండి. ఆడదానిగా పుట్టుట నా తప్పా? అంతేనా? నా బ్రతుకంతా ఆటపాటలైపోయింది కదా! తాంబూలం తీసికొనమని ఆజ్ఞాపిస్తావు. అక్కడవున్నవాళ్ళంతా చూస్తూనే వున్నారు. నాతో ఏకాంతంలో కూడా ఆవిడగారి (అన్నమయ్య) సంగతులేనా? అంతేనా? స్త్రీ మానసిక స్థితిని యెంతబాగా చెప్పారో చూడండి.

**భావ దీపిక :**

స్వామీ! ఆడదానినవటం నాతప్పా? అంతేకాదా (అంతేనా)? బ్రతుకంతా ఆటపాట (అల్లరిచిల్లరి) అయిపోయింది. అంతేనా? ఇంతమందిలో నా కొంగు పట్టుకొని దగ్గర తీసికొన్నావు. అప్పుడు నీగోరు తాకిడికి నాతనువెల్లా పులకరించింది. అంతేకదా! పునిస్త్రీని, వుంగిటిగా (కపటముగా) అవమానపరచెదవు. ఇదంతా యెందుకు? వూరకుండరాదా? అంతే కదా? మేరమీరి (హద్దుదాటి) నవ్వుతూ మీదమీద వొరిగితే నా చెక్కిళ్ళు చెమర్చినవి. అంతేకదా! ఓయమ్మ!! నీవు వూరకనే వుండవయ్యా! నాలో తీరని తాపము రగిలిస్తావేమోనని నీవంటే భయము. అంతే కదా! ఓ శ్రీవేంకటేశ్వరా! అండనుండి (నాకు దగ్గరై) తీసుకొమ్మని ఆజ్ఞాపించి తాంబూలం అందించావు. ఇది అక్కడివారంతా చూశారు. అంతేకదా! ప్రభూ! నన్ను చేకొని (దగ్గరతీసి) చేయిమీరి (ప్రేమతో) కూడితివి. అయినా నీవు ఆమె (అన్నమయ్య) సంగతులు చెప్పటం మానవు. అంతే కదా!

సంఖ్య : 390 సంపుటము : 22 పుట: 260 రాగం : రామక్రియ

**6 పిలుపించుకోవలెనా పెనఁగి సారెసారెకు**
**తలవంచుకొననేల తగులాయ ననవే ॥పల్లవి॥**

**వసంతకాలము వచ్చె వలపులు కడుహెచ్చె**
**వెసఁ దుమ్మిదలెల్లాను విచ్చె రెక్కలు**
**కొసరించుకొననేల గోరగిరితే నేరౌను**
**రసికుఁడు తానెఱుఁగు రమ్మనవే యిఁకను ॥పిలు॥**

**పున్నమవెన్నెల గాసెఁ బొందుగాఁ గోవిల గూసె**
**చన్నులతో హారములు సాముచేసెను**
**చిన్నఁబోనేల నవ్వులు చెట్టదువఁ జేటఁడవును**
**విన్నపములు సేయరే విభునికిఁ దెలిపి ॥పిలు॥**

**చిలుకలు రవళించె చిత్తజుఁడు గిలిగించె**
**చెలరేఁగి జవ్వనము చిగిరించెను**
**అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశుఁడు**
**కలసె నన్నుఁ దొల్లె కడమ లేదిఁకను ॥పిలు॥ 390**

**మున్నుడి :**

అన్నమయ్య తాను దేవి చెలికత్తెగా అవతరించి దేవికి యేమిచెబుతున్నారో వినండి. నేటి తెలుగులో ఇలా అంటున్నది. "ప్రతిసారీ జరిగే పోట్లాట కోసం నిన్ను పిలిపించుకోవలెనా? ఇంతయినా నీవు తలవంచుకొనుటెందులకమ్మా?" చివరికి ఆమె (అన్నమయ్య) సగర్వంగా అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశ్వరుడు నన్ను ఇదివరకే కూడినాడు. ఇక నాకేమి కొరత అంటున్నది.

**భావ దీపిక :**

చెలీ! ప్రతిసారి నీతో పెనగులాటకే తాను నిన్ను పిలిపించుకొనవలెనా? ఇందులో నీ తప్పేమి? అంతగా తలవంచుకొననేల? నీకే అతనిపై తగులాయననవే (అనురాగం హెచ్చిందనవమ్మా!). వసంతకాలం వచ్చింది. వలపులు హెచ్చాయి. వెంటనే తుమ్మెదలకు రెక్కలు విచ్చుకొన్నాయి. అతను గోటితో గీరినందుకే కసురుకోవలెనా? అదే నేరమవుతుందా? అతను రసికుడుకావున తనకు అన్నీ తెలియును. సరేలే... రమ్మనవమ్మా!. పున్నమి వెన్నెలకాసింది. పొందుగా కోయిల కూసింది. నీ కుచగిరులలో నీ హారములు కుమ్ములాడుతున్నాయి. చిన్నబోవుటెందుకు? చెట్టు విదిలిస్తే చేటడుపూలు రాలినట్లు నీ నవ్వులురాలినవి. ఇంతెందుకమ్మా? నీ విభునికీ సంగతి దెలిసి విన్నపము జేయరాదా? దేవీ! నీ పెంపుడు చిలుకలు ధ్వని చేస్తున్నాయి. మన్మథుడు చక్కిలిగింతలు పెడుతున్నాడు. యౌవనము చిగురించి చెలరేగింది. ఇంకొక వింత యేమంటే సాక్షాత్తు అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశ్వరుడు నన్ను (అన్నమయ్యను) మునుపటివలెనే కూడినాడు. ఇకనేకొరతా లేదు.



సంఖ్య : 250 సంపుటము : 22 పుట: 167 రాగం : ముఖారి

**7 నీరుకొలఁదితామర నీతో వలపు**
**నేరిచినవారికి నిండునిధానమవు ॥పల్లవి॥**

**హత్తి నీకు నేపొద్దు నండనుండి సేవసేసి**
**చిత్తము రా మెలఁగేదే చెలియ**
**కొత్తకొత్తరతులను కోరి నిన్నుఁ గరఁగించి**
**బత్తిసేసితే నీవూఁ బాయక వుండుదువు ॥నీరు॥**

**కచ్చుపెట్టుకొని వేళగాచుక నీతోడుత**
**యిచ్చకములాడినదే ఇంతి**
**విచ్చనవిడిని నీవేడుకవినయముల**
**మెచ్చఁగూడితే నీవు మేలువాఁడ వౌదువు ॥నీరు॥**

**కలికితనాల నిన్నుఁ గాఁగిలించి నేరుపులు**
**తలఁపించుక నవ్విందే తరుణి**
**అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర**
**లలి నావలె నుండితే లాలించి రక్షింతువు ॥నీరు॥ 250**

**మున్నుడి :**

ఈ కీర్తనలో అన్నమయ్య స్వామికి వలపుకత్తెయై ఆయన అనురాగం యెలాసంపాదించాలో సూచన చేస్తూ యేమంటున్నారో వినండి. అలమేల్మంగపతివైన ఓ శ్రీవేంకటేశ్వరా! నీతో వలపు "నీరుకొలది తామర" వంటిది. నీరు యెంత స్వచ్ఛంగా, పుష్కలంగావుంటే "తామరపూవు" అంత నవనవలాడుతుంది. నీపై భక్తి లేకపోతే నీ వలపూ యెండిపోతుంది, అంటున్నారు.

**భావ దీపిక :**

స్వామీ! నీతో వలపు "నీరుకొలది తామరపూవు" వంటిది. ఎంతప్రేమ అనే నీరువుంటే నీ కరుణ అనే తామర వికసిస్తుంది. ఇది నేర్చిన వారికి, నీవు నిండు నిధానమవు (తరగని పెన్నిధివి). నీకు నిజమైన చెలి యెవ్వరో తెలుసా? ఏవేళనైనా, నీకుదాపై అండనుండి సేవజేస్తూ నీ చిత్తము ననుసరించి మెలగవలెను. తన కోర్కె తెలియజేస్తూ కొత్తకొత్త 'రతులతో' నిన్ను కరిగించాలి. ఆ విధంగా నీపై భక్తి కలిగిన ప్రేమ చూపితే నీవూ మమ్ము వదలవు. కచ్చుపెట్టుకొని (పట్టుదలతో) యేవేళనైనా నీతో నీ ఇష్టానువర్తియై మాట్లాడేదే నీ ప్రియకాంత. చెలరేగిన నీవేడుకను సవినయంగా మెచ్చుకొంటూ నిన్ను కూడిన చెలియకు నీవెల్లప్పుడూ మేలువాడవే (హితైషివే). నిజమైన తరుణి తన కలికితనాల (అందచందాలతో) నిన్ను కౌగలించి నేర్పులు ప్రదర్శిస్తూ నవ్వించాలి. ఇంతెందుకు, అలమేల్మంగపతివైన ఓ శ్రీవేంకటేశ్వరా నావలె స్వచ్ఛమైన, లలి(ప్రేమ)తో వుంటే నీవు తప్పక లాలించి రక్షిస్తావు

సంఖ్య : 249 సంపుటము : 22 పుట: 166 రాగం : బౌళి

**12** చెలి నీవు మొదలనే సిగ్గరి పెండ్లి కూఁతుర-
విల నింతపచ్చిదేరీ నిదివో నీభావము ॥పల్లవి॥

చెక్కులవెంటాఁగారేచెమట దుడుచుకోవే
చక్కఁబెట్టుకొనవే నీ జారినకొప్పు
అక్కు మీఁదఁ బెనగొన్న హారాలు
చిక్కుదియ్యవే యిక్కు వల నీ కోరిక లీడేకె(రె?) నిపుడు ॥చెలి॥

పెదవిమీఁది కెంపులబేంట్లు రాలుచుకోవే
చెదరినముంగురులు చేత దువ్వవే
వదలినపయ్యద చివ్వన బిగించుకొనవే
పదిఁబదిగా నీనోము ఫలియించె నిపుడు ॥చెలి॥

తిలకము గరఁగెను దిద్దుకోవే నొసలను
కలసినగురుతులు గప్పుకొనవే
యెలమి శ్రీవేంకటేశుఁ డేలె నలమేల్ మంగవు
తలఁచినతలఁపులు తలకూడె నిపుడు ॥చెలి॥ **249**

**మున్నుడి :**

సిగ్గరి శోభన పెండ్లికూతురై పడక గదిలోంచి వచ్చిన దేవితో ఆమె చెలికత్తె (అన్నమయ్య) పరాచికాలు చెనకుతూ తోచిన సలహాలనిస్తున్నది. మొదటినుండీ నీవు సిగ్గుల మొగ్గవి. ఇదిగో ఇంత పచ్చియైన నీ భావము నెరుగుట నాకేమీ కష్టం కాదు. జగదేకపతి కోరి యేలుకొన్న అలమేల్మంగవు. నీవు వూమించిన వూహలన్నీ నిజములయినవమ్మా. ఎందుకో చెప్పమంటావా? మరి వినవమ్మా...

**భావ దీపిక :**

చెలీ ! నీవు మొదటినుంచి సిగ్గులు చిందే పెండ్లికూతురివి. ఇదివో ఆదిలోనే నీ భావము ఆయన యెంత పచ్చిదేరెనో (ఆరడి పెట్టాడో) మాకు చెప్పకనే చెబుతున్నది. ముందు నీ చెక్కిళ్లపై జాలువారే చెమటలను తుడుచుకోవమ్మా! జారిన నీ కొప్పును సరిగా చక్కబెట్టుకోవమ్మా! అక్కుమీద (వక్షముపై) పెనవేసికొనిపోయిన 'హారాలను' సరిజేసికొనవమ్మా! ఇక నీ కోరికలన్నీ యీడేరినట్లేనమ్మా! దేవీ! పెదవుల కంటిన ఎఱ్ఱని మరకలు తుడిచి రాల్చుకోవమ్మా! చెదరిన ముంగురులను చేతితో దువ్వుకోవమ్మా! వదులైన పైటను తొందరగా బిగించుకోవమ్మా! పదిఁబది (చక్కగా) నీ నోములు ఫలించినవమ్మా! చెలీ! నీనుదుటిపై కరిగి కారిన తిలకమును దిద్దుకోవమ్మా! నీవు నీ పతిని కలిసిన గుర్తులను కప్పుకొనవమ్మా! అతిశయించిన శ్రీవేంకటేశుడు, అలమేలు మంగను యేలుకొనినాడు. ఊహించిన ఊహలే తలకూడె (సిద్ధించినవి).



సంఖ్య : 9 సంపుటము : 22 పుట: 67 రాగం : గుండక్రియ

**9** ఇది దా నెఱఁగఁడా ఇంపులనారమణుఁడు
హృదయమే యెఱుఁగును యెంచిచెప్పేదేమే ॥పల్లవి॥

దవ్వు విచారింతురా తమ్మువలసినవారు
యెవ్వల నుండినాఁ గూడనెంతురుగాక
దవ్వుల సూర్యునికి ధరణిఁ దామరలకు
యెవ్వరైనాఁ బొందుసేసి యెనఇంచిరా ॥ఇది॥

వెనకముందెంతురా వెక్కసపుపొందువారు
యెనలేనిసాహసము లెంతురుగాక
వినువీథిఁ జంద్రుఁడుండ వెసఁ జంద్రకాంతము-
లెనసి కరఁగుమని యెవ్వరైనాఁ జెప్పిరా ॥ఇది॥

వొకరి నడుగుదురా వుల్లములు గలసితే
వొకటై రతులఁ గూడివుందురుగాక
ప్రకటించి శ్రీవేంకటపతి దానె నన్నుఁ గూడె
సకలము లోలోనె సంతమౌటగాక ॥ఇది॥ **99**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో నాయిక తన చెలితో యేమంటున్నదో వినండి. ఈ సంగతి నాతడెరుగడటే? నా రమణుని హృదయానికి తెలియదటే నా విరహవేదన? ఇంకా నేనేమి చెప్పవలెనే? నన్ను తన హృదయంలో నిలుపుకొన్నానని ప్రకటించిన శ్రీవేంకటపతి తనంత తానే నన్న గూడినాడు. అన్నీలోలోననే నా స్వంతమై పోయినవే, (అన్నట్లు... పున్నమి వెన్నెల చంద్రకాంతికి, చంద్రకాంత శిలలు కరిగిపోతాయని ప్రతీతి.)

**భావ దీపిక :**

ఓ చెలీ! ఇది (నా హృదయ వేదన) తానెరుగడా? చక్కగా నా రమణుడు నా హృదయము నెఱుగును. అయినా నేను యెత్తి చూపి చెప్పవలసిన పనేమిటే? తమకు ప్రియమైనవారు యెంత దూరాన వున్నా కూడుట కాసింతురుగాని, దూరభారాలను యెంచి వీడుదురా? నింగినున్న సూర్యునిజూచి కొలనులోని తామరలు వికసిస్తాయే, వారికెవరైనా పొందుసేసి యెనయించిరా? (కలిపినారా?). చెలీ! వెక్కసపు పొందువారు (ఎట్లైనా కావలెననుకొనేవారు), వెనుక ముందు ఆలోచింతురటే? ఎంత సాహసానికైనా సిద్ధపడరటే? ఎక్కడో ఆకాశంపైన చంద్రుడు కాంతులు విరజిమ్ముతుంటే... ఇక్కడ చంద్రకాంత శిలలు కరిగిపోవుట లేదటే? అట్లా కరిగిపొమ్మని వాటికెవరు చెప్పారే? ఉల్లములు గలిసితే (మనస్సులొకటైతే), వొక్కటై రమింతురుగాని, యింకొకరి అనుమతి నడుగుదురటే? ప్రకటించి (బాహాటముగా తెలిపి) శ్రీవేంకటేశ్వరుడు తానే నన్ను గూడినాడు. సకలము తమలో తామే సంతోష పారవశ్యం పొందాయి కదే!

సంఖ్య : 98 సంపుటము : 22 పుట: 66 రాగం : భైరవి

**10 కొంగువట్ట కంత నీవు గొల్లబోయిఁడా**
**కుంగక నీకు మొక్కేము గొల్లబోయిఁడా ॥పల్లవి॥**

**పొలసుమాటలగొల్లబోయిఁడా నీ-**
**కొలము దాఁచకువోయి గొల్లబోయిఁడా**
**పొలము మేపకు గొల్లబోయిఁడా**
**కొలువుకంబముచాటుగొల్లబోయిఁడా ॥కొంగు॥**

**పొడవాటికాళ (ళ్ల?) గొల్లబోయిఁడా**
**గొడవలు మానవోఇ గొల్లబోయిఁడా**
**పొడలమెకముగొల్లబోయిఁడా**
**గొడుగెత్తియాలఁగాచేగొల్లబోయిఁడా ॥కొంగు॥**

**బుద్దులగొల(లు?)వుగొల్లబోయిఁడా**
**కొద్దిలేనిదాఁటులగొల్లబోయిఁడా**
**మద్దుల శ్రీవేంకటాద్రి మందబోఇఁడా! నీకు**
**గుద్దే బాదాలు నే గొల్లబోఇఁడా ॥కొంగు॥ 98**

**మున్నుడి :**

అన్నమాచార్యులవారు వినిపించిన "దశావతార" కీర్తన ఇది. "గొల్లబోయడు" అంటే గొల్లవాడైన బండి నడపేవాడు అని అరం. అంటే "పార్థసారథి" శ్రీకృష్ణుడు. "పొలము" అంటే అడవి. ఈ కీర్తన వివరణ చదివితే అన్నమాచార్యులవారి కీర్తన నారికేళపాకం అని మీరు అంగీకరించక తప్పదు. నొప్పి పుట్టిన పాదాలను గుద్దిచ్చుకోవడం నేటికీ కొనసాగుతున్న ప్రక్రియే.

**భావ దీపిక :**

ఓ గొల్లబోయడా! నీవు నాకొంగును అంతగా పట్టుకొంటే చూడటానికి బాగుండదు. కుంగక (నిరాశ పడక) నీకు మొక్కేమయ్యా! పొలుసుమాటల (పెళుసుమాటలవాడు, లేక, పొలుసులున్న చేప) గొల్లబోయడు - మత్స్యావతారము. కొలము దాచకు (కులమేదో తెలియని కృష్ణుడు, లేక, జలప్రాణియో, నేలప్రాణియో తెలియని తాబేలు) గొల్లబోయడు - కూర్మావతారం. పొలము మేపకు (ఆలమందను మేపేకృష్ణుడు, లేక, అడవిలో మేసే అడవి పంది) గొల్లబోయడు - వరాహావతారం. కొలువు కంభముచాటు (స్తంభంలో దాగిన) నృసింహుడు. పొడవాటి కాళ్ళున్న గొల్లబోయడు (కృష్ణుడు, లేక, త్రివిక్రముడైనవాడు)-వామనావతారం. గొడవలు మానవో గొల్లబోయడా (గిల్లికజ్జాల కృష్ణుడు, లేక, రాజలోకసంహారి)-పరశురామావతారం. పొడలమెకము (జింకలా మాయమయ్యే కృష్ణుడు, లేక, మాయలేడివెంట బడ్డ) గొల్లబోయడు - శ్రీరాముడు. గొడుగెత్తి యాల గాచే (గోవర్ధనగిరినెత్తిన) గొల్లబోయడు - శ్రీకృష్ణావతారం. బుద్దులు గొలుపు గొల్లబోయడు (గీతాచార్యుడు కృష్ణుడు, లేక, బుద్ధ భగవానుడు) - బుద్ధావతారం. కొద్దిలెని దాటుల గొల్లబోయడు (ప్రతిసారి పోట్లాడే కృష్ణుడు, లేక శత్రు సంహారి) - కల్కి అవతారము. వేంకటాద్రి గొల్ల మందలతో పూజించబడ్డ శ్రీ వేంకటేశ్వరా! నీకు పాదములు గుద్ది (పిసికి) సేవించేము గొల్లబోయడా?



సంఖ్య : 78 సంపుటము : 22 పుట: 53 రాగం : పాడి

**11 తానే తడవిన తడవేఁగా కిఁక**
**రానీవే తతీ రఁ(రం?) తిఁకనేలా ॥పల్లవి॥**

**నవ్వనిపతితో నవ్వఁగఁబోతే**
**యెవ్వరికైనా యింపౌనా**
**పువ్వులవాసన పూఁపల మొగ్గల**
**రవ్వగ వెదకిన రచనలఁ గలదా ॥తానే॥**

**పలుకనిపతితో పలుకఁగఁబోతే**
**చలమున మతికిని చవులౌనా**
**లలి నామనికాలపుకోవిలగమి**
**నలుగడ లెపుడైనాఁ బలికీనా ॥తానే॥**

**మోహపుపతితో మొరఁగు చూపితే**
**ఆహా వుచితము లవి యవునా**
**యీహల శ్రీవేంకటేశుఁడు గూడెను**
**వూహజక్కవల కుదయమెకాదా ॥తానే॥ 78**

**మున్నుడి :**

అన్నమయ్య (చెలికత్తె)తో దేవి అసహనంగా యేమని అంటున్నదో వినండి. అతగానిని వస్తే రానీవే. తానెంత ఆలస్యం చేస్తాడో చేయనీవే. సమయము సందర్భము లేని రతి యింకా యెందుకే మోహముగల పతితో వంచన చూపితే వుచితముగానుండునటే? ఇదిట్లా వుండగానే స్వామి వచ్చి దేవినెట్లా మైమరపించాడో వినండి.

**భావ దీపిక :**

తానే (స్వామియే) స్వయంగా వచ్చి తడవిన (జాగుచేశానన్నా) జాగుచేయనీవే. వస్తే రానీవే. తతిరంతి (వేళాపాళా లేని రతి) నాకెందుకే? ఆయన నవ్వనే నవ్వడు. ఆయనతో నవ్వులాట యేమి యింపుగా వుంటుందే? చక్కని సువాసన కావాలంటే మంచి పూలనాఘ్రాణించాలి. శ్రమపడి మొగ్గలలో వెదకితే చమత్కారంగా వుంటుందటే? మాటా పలుకులేని పతితో మాట్లాడించబోతే ఆయన చూపే చలము (పంతము) మనసులో పెట్టుకుంటే బాగుంటుందటే. లలి (విలాసముగా) వసంతకాలం వచ్చేసింది. కోయిలలు నలుదిక్కులా కూస్తున్నాయి. ఇప్పటికై అతగాడు వులకడు, పలకడు. మోహావేశమున్న పతితో మొరగు (వంచన) చూపినచో ఆహా! వుచితముగా వుంటుందటె. ఈహల (ఇటుచూచిన) ఇట్టే శ్రీవేంకటేశ్వరుడు నన్ను కూడినాడు. ఊహించగా జక్కువల (చక్రవాకముల) వంటి కుచగిరులకు వుదయమైనట్లే కదా!

సంఖ్య : 459 సంపుటము : 17 పుట: 264 రాగం : భైరవి

**16 చాలుఁ జాలు నున్నదెల్లాఁ జాలదా యిది**
**జాలెల్లా నిందునే పాసెఁ జాలదా యిది** ॥పల్లవి॥

**పరగ నే నవ్వితేఁ గోపగించుకొనకా యిట్టే**
**సరిగా నీవు నవ్వితి చాలదా యిది**
**ధరనేఁ గొంగువట్టితేఁ దప్పించుకొనకా**
**సరవి నూరకుండితి చాలదా యిది** ॥చాలు॥

**కన్నులనేఁ బిలిచితే కమ్మర జంకించకా**
**సన్నలకే వచ్చితివి చాలదా యిది**
**నిన్నుఁ దప్పక చూచితే నిలిచి వాదుకు రాక**
**జన్నెవలపు చల్లితి చాలదా యిది** ॥చాలు॥

**తమితో నిన్నుఁ గూడఁగ దప్పులఁ బొరలకా**
**సమరతిఁ జొక్కితివి చాలదా యిది**
**అమరె శ్రీవేంకటేశ యనుమాన మెంచకా**
**జమళిఁ గూచుంటి విట్టె చాలదా యిది** ॥చాలు॥ **459**

**మున్నుడి :**

పెదతిరుమలయ్య వినిపిస్తున్న ఈ శృంగార కీర్తనలో దేవి యేమని స్వామిని దెప్పి పొడుస్తున్నదో ఆలకించండి. చాలుచాలును స్వామీ! మనమధ్య ఈ గిల్లికజ్జాలెందుకు? ఇప్పుడున్నది చాలదా? నామీద నీకు జాలి అంతా పాసిపోయింది. ఇది చాలదా? పోనీ నీవే ఆలోచించు. నీవు కోపగించుకొనేటంత తప్పు నేనేం చేశాను? నిన్ను ఏమాత్రం అనుమానించక నీతో జంటగా కూర్చునియున్నాను. అది చాలదా?

**భావ దీపిక :**

స్వామీ! చాలునయ్యా! చాలును. ఇప్పుడు మనమధ్య వున్నదంతా చాలదా? ఇందునే (ఈక్షణమే) నాకు నీపై జాలెల్లా (ఆశపూర్తిగా) పాసె (గడచిపోయింది). ఇది చాలదా? ఒకవేళ నీ పనులకు నేను నవ్వితే, నీవు కోపించక నవ్వరాదా? అది నాకు చాలదా స్వామీ! నీవు బలవంతాన నాకొంగు పట్టుకొంటే తప్పించుకొని పారిపోక వూరకనే సరసనుండిపోయాను. నీకు అది చాలదా? నీవు నన్ను కన్నులతోనే దరిచేరపిలిచినా, రానందుకు మరల నన్ను జంకించినా (భయపెట్టినా) చీకట్లు అలముకోగానే వచ్చితిని కదా! అది చాలదా? నిన్ను తదేకంగా చూస్తే నాతో వాదులాటకు రాక నియమంతో వలపులు నాపై చల్లితివి. నాకు అది చాలదా? తృప్తిగా నిన్ను కూడితే నాపై తప్పులెంచక సమరతిలో పరవశించితివి. అది నాకు చాలదా? నాతో అమరిన శ్రీవేంకటేశ్వరా! నీపై ఏమాత్రం అనుమానం లేక నాతో జమళి (జంటగా) కూచుంటే నాకు అది చాలదా?



సంఖ్య : 466 సంపుటము : 17 పుట: 268 రాగం : కాంబోది

**13 ఏమన్నా వాదుకు వచ్చే వెంత గర్వము**
**ఆముకొని మలసేవు అది యేరా నీవు** ॥పల్లవి॥

**పోరచి నీవెందుకైనాఁ బోతేఁ బోదువు గాక**
**యేరా కాలు దొక్కేవు యెంత గర్వము**
**పేరుకొని తిట్టితే నా పెదవులు గదలితే**
**ఆరసి తప్పక చూచే వది యేరా నీవు** ॥ఏమన్నా॥

**చిట్టకపుచేఁతలెల్లాఁ జేసితేఁ జేతువు గాక**
**యిట్టే నాపై విరిగేవు యెంత గర్వము**
**పట్టి నిన్నుఁ దోసితి నాపైఁ బడఁగఁ జే యెత్తితి**
**అట్టే వొత్తుక వచ్చే వది యేరా నీవూ** ॥ఏమన్నా॥

**బలిమిఁ గౌఁగిట నన్నుఁ బట్టితేఁ బట్టుదువుగాక**
**యెలమి సెలవి నవ్వేఁ వెంత గర్వము**
**నిలిచి శ్రీవేంకటేశ నిన్ను నిటు గూడితి నేను**
**అలిసితేఁ బంతమాడే వది యేరా నీవూ** ॥ఏమన్నా॥ **466**

**మున్నుడి :**

విసిగిపోయిన నాయిక స్వామితో యేమంటున్నదో వినిపిస్తున్నారు పెదతిరుమలయ్య. నేనేమన్నా వాదులాటకు వస్తావు. ఎంత గర్వంరా నీకు. నన్ను పైకొని విజృంభిస్తావు. అది యేలరా? బలంకొద్ది కౌగలించితే కౌగలించేవు కాని తొంగి చూస్తున్న ఆ చిరునవ్వెందుకు చిందిస్తావు? ఇది గర్వంకాక మరేమిటి? ఓ వేంకటేశ్వరా! నేను నిన్ను ఇట్లు కూడి అలిసిపోయాను నిజమే. కాని పంతమాడితే నీవు నాకెట్లా వుంటుందో ఆలోచించు.

**భావ దీపిక :**

స్వామీ! నీతో నేనేమన్నా వాదానికి వస్తావు. నీకు యెంత గర్వమురా!! నీవు నన్ను ఆముకొని (పైకొని) మలసేవు (విజృంభించేవు). అదియేమిరా? పోరచి (నిర్లక్ష్యంతో) నీవెక్కడికి పోతే నాకేం? నాకాలు దొక్కేవు. ఎంత గర్వంరా నీకు? నీ పేరుపెట్టి తిట్టినట్లు నా పెదవులు కదిలాయని గమనించి నన్ను తప్పక చూచేవు (తదేకంగా చూస్తావు). అదేమిరా? నీవు చిట్టకపు చేతలు (కపటపు పనులు) చేస్తే చేసేవుగాక! నాపై విరిగేవు (బెదరించేవు). అదేమిరా? నీవు నాపై పడబోతే నాచేత్తో పట్టి నిన్ను తోసివేసిన మాట నిజమే. చేయెత్తిన మాటకూడా నిజమే. అందుకని అమాంతం నన్ను వొత్తుక వచ్చేవు (ఆక్రమిస్తావు) అదేమిరా? నీ బలంకొద్దీ నన్ను కౌగిట్లో బిగిస్తే బిగించేవు గాక! విచ్చీ విచ్చని పెదవులతో ఆ కొంటెనవ్వులెందుకు చిందిస్తావురా? నీకెంతగర్వము? అది చూచి వో శ్రీవేంకటేశ్వరా! నిన్ను నిలదీసి ఇట్టే నేను కూడితే... అబలను, అలసిపోనా? అట్టినాతో మరలమరల పంతముతో చెలరేగెదవు. అదేమిరా?

**గమనిక :** శృంగారంలో నాయిక 'రా' కొట్టిన తప్పులేదట.

సంఖ్య : 63 సంపుటము : 22 పుట: 43 రాగం : సామంతం

**14 అందరి కొక్కటే చాలు ఆండ్లకు మొగలకు**
**ముందటెత్తు వేరె నీతో మోవనాడవలెనా ॥పల్లవి॥**

**వలపుల యీఁదియీఁది వాసులకే లోఁగిలోఁగి**
**అలుకలే తవ్వితవ్వి యట్టె నవ్వి**
**చెలఁగేటివిరహివి చింత మాన్ప నెఱఁగవా**
**చెలి నింతే నీకు నేను చెప్పి చూపవలెనా ॥అంద॥**

**బలిమై చేయి చాఁచిచాఁచి పంతాన మెయి దోఁచితోఁచి**
**పలుకాఁకఁ గందికంది భామలఁ బొంది**
**కులుకుజాణఁడవు నాకోర్కి దీర్చనెఱఁగవా**
**ఇల నే జవ్వని నింతే ఇంతరట్టు వలెనా ॥అంద॥**

**పలుకులే చల్లిచల్లి పారిపారి మళ్లి మళ్లి**
**వలరాచపనులకే వయ్యాళి వెళ్లి**
**తలఁచి శ్రీవేంకటేశ తగ నన్నుఁ గూడితివి**
**వెలయు నీదేవి నింతే వేఁడుకొనవలెనా ॥అంద॥ 63**

**మున్నుడి :**

'మోవనాడటం' అంటే నొప్పించేట్లు మాట్లాడటం. అన్నమయ్య యేమంటున్నారో వినండి. ఆడా, మొగా అందరికీ ఒక్కటే చాలు. అదే వలపు. నీ ముందట కుయుక్తులు చేసి నిన్ను నొప్పించగలనా స్వామీ! అని వేడుకొంటున్నది దేవి అలమేల్మంగ. ఎన్నో రాచకార్యాలమీద వయ్యాళి (విహారానికి) వెళ్ళి ఎందరితోనో ఏవేవో మాట్లాడతావు. నేను నీ దేవిని ఇంతే. నాకూ నీకూ ఈ గొడవ తప్పదు?

**భావ దీపిక :**

స్వామీ! ఆండ్లకు (స్త్రీలకు) మగలకు (పురుషులకు) అందరికీ ఒక్కటే జోడీ చాలును. నీవలపుకత్తెలెందరో లెక్కింపలేను. అట్లని నీతో మోవనాడవలెనా (నొప్పించగలనా?) నీమీది వలపులలో తేలి, యీదులాడి, అంతలోనే వాసులు (అధికులెవరని) లోగి (క్రుంగదీసి) అలుకలే తవ్వి (పైకి ప్రకటించి), అంతలోనే నవ్వి, విరహములను చెలరేగునట్లు చేయగలవాడవు చింత మాన్పుట నెరుగవా? నేను నీ ప్రియసఖినని ప్రకటించి నిరూపించుకోవలెనా? ప్రభూ! బలమైన నీ చేయి నాకోసం చాఁచి నీపంతం నెగ్గించుకొని, నా మెయి (శరీరం) వశపరచుకొని ఎన్నియో వలపు జ్వాలల్లో కందిపోయి, అనేక మంది భామలను పొంది, వారితో కులుకునట్టి జాణడవు (నేర్పరివి). అట్టి నీవు నా కోర్కెదీర్చనేరవా? నేను యౌవనరూపసిని. ఇంతే. ఇంత రభస చేయనేల? నాతో పలుకులే చల్లి (మాటలతో మరపించి) మళ్ళీ యెక్కడికో పారిపోయి, యేవేవో రాచకార్యాలని వయ్యాళికి (విహారాలకు) వెళ్ళి నన్ను గొప్ప విరహానికి గురిచేస్తావు. అటుపిమ్మట ఓ వేంకటేశ్వరా! నాపై కృపతో నన్ను గూడితివి. ఇంతాజేసి నేను నీ దేవేరినై వెలసిన దానను. నన్ను నీవు వేడుకోవలెనా?



సంఖ్య : 465 సంపుటము : 17 పుట: 268 రాగం : ఆహిరి

**15 అక్కడివారినే నీవు అటు చెండుకోరాదా**
**మక్కవతో నీ వేల మాకు మొక్కేవయ్యా ॥పల్లవి॥**

**రానిచేఁత లివి చూచి చన్నులెత్తఁ గారాదా**
**తేనెమోవి యెంగిలయితేఁ దిట్టుకోరాదా**
**ఆనిన మచ్చా లుండఁగ నటుమోము గారాదా**
**మానవుగా నీ వేల మాకు మొక్కేవయ్యా ॥అక్కడి॥**

**మొగి వింతవాసనకు ముక్కు మూసుకోరాదా**
**వొగరుమాటలు వింటె నొడ్డుకో రాదా**
**అగడయి బాస దప్పితే నటు లేచిపోరాదా**
**మగిడి మగిడి యాల మారు మొక్కేవయ్యా ॥అక్కడి॥**

**తారుకాణ లయితేను తల వంచుకోరాదా**
**మేర దప్పినపనికి మెచ్చరాదా**
**యేరా శ్రీవేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి**
**నారుకొని యిఁక నేల నాకు మొక్కేవయ్యా ॥అక్కడి॥ 465**

**మున్నుడి :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో నాయిక స్వామివారి 'ఆప్తు'ల గురించి వ్యాఖ్యానిస్తూ "యేరా! పైకి అక్కడున్న నీవారిని ఖండిస్తూ మాట్లాడుతున్నావుగాని నీ సంగతి నాకు తెలియదా? మామీద లేనిపోని మక్కువ చూపిస్తూ భయభక్తులను పైపైన చూపిస్తున్నావు గాని యిదంతా యెందుకయ్యా? మేము నీవంచనలన్నింటిని నిరూపించాం. ఇకనైన నీ తలవంచుకొనరాదా? హద్దుమీరినందుకు నన్ను మెచ్చరాదా?" అంటున్నది.

**భావ దీపిక :**

స్వామీ! నీవు అక్కడివారిని (అక్కడున్న నీ ఆప్తులనందరిని) యేల అటు (ఆవిధంగా పైపైన) చెండెదవు (ఖండించెదవు?) మక్కువతో (నిజమైన ప్రేమ వున్నట్లు యేలమొక్కెదవు? నాకు శృంగారం రాదు. పోనీ, నా రానిచేతలకు కన్నెఱ్ఱ చేస్తే చేయవయ్యా? నీ అధరము నెంగిలి చేశానని తిట్టుకుంటే తిట్టుకో. ఆనినమచ్చాలుండగా (నిరూపితములైన గుట్టులన్ని వుండగా) నీ ముఖము నవతలకు తిప్పుకొనరాదా? నీ చేతలనేవీ నీవు మానవు. ఇంకా నీవేల మాకు మొక్కెదవు. నా చెంత నీకు వింత వాసన వస్తుంటే నీ ముక్కు మూసుకొనరాదా. పోనీ, నా మాటలు నీకు వెగటుగా వుంటే అడ్డుకొనరాదా? అగడయి (కోపంతో) బాస తప్పితే నానుండి లేచిపోరాదా? మగిడి మగిడి (మరల మరల) యేల ప్రతిగా మొక్కెదవు? నీ చేతలన్నీ తారుకాణాలైతే (నిరూపితములైతే) తలవంచుకొనరాదా? మేర తప్పిన (హద్దు మీరిన) నా శృంగారానికి మెచ్చుకొనరాదా? ఓరీ శ్రీవేంకటేశ్వరా! యిట్టే నన్ను గూడితివి కదా! స్వామీ! నారుకొని (వలపులు మొలకెత్తినవి). ఇంకా నీవు నాకేల మొక్కెదవయ్యా?

సంఖ్య : 455 సంపుటము : 17 పుట: 262 రాగం : శంకరాభరణం

**20** ఏలకో తలఁ పెక్కడ నుందో
నాలినే పోయ నడుమ మాటా యేలకో ॥పల్లవి॥

మొక్కులే మొక్కీ మొన్నటనుంటి
యిక్కడికి రాఁడు యిది యేమే తాను యాలకో
యెక్కె నా చల మిందయినఁ గొంత
పక్కన నే నవ్వఁ బాడిగాదూ యాలకో ॥ఏలకో॥

చెప్పరే మాట చెలులు మీరు
చిప్పిలిఁ దమ్మిచిత్తములోనా యాలకో
తప్పినో నాతోఁ దా నన్న బాసా
తిప్పరాదు కడుఁదీపాయ వలపూ ॥ఏలకో॥

దగ్గరి వచ్చెఁ దా నింతలోనా
సిగ్గులు వీడె సెలవినవ్వి యాలకొ
వెగ్గళించి శ్రీవేంకటవిభుఁడు
నిగ్గుదేరఁ గూడ నిట్టూర్పు నించీ యాలకో ॥ఏలకో॥ **455**

**మున్నుడి :**

పెదతిరుమలాచార్యులు చేసిన యీ శృంగార సంకీర్తనలో దేవి తన విభుని చేతలు అర్థముగాక "చింతాక్రాంత" అయింది. ఆ వివరమునాలకించండి. "నాలినేపోయ" అంటే నవ్వులపాలైపోయాను అని అర్థం. ఎందుకో అతగాడి తలపు యెక్కడోవున్నది. అనవసరంగా నేను నవ్వులపాలైపోయాను. మధ్యలో యింకా మాటకూడా పడుట యెందుకో? అని ఆలోచిస్తున్నది. స్వామి యెందుకంత నిగ్గుదేరి కూడినా నిట్టూరుస్తున్నాడెందుకో అని ఆ సుందరాంగి సందియము. ఈ కీర్తన తన చెలితో దేవి చెబుతున్నట్లు భావించవచ్చు.

**భావ దీపిక :**

చెలీ! ఏలకో (యెందుకో) నా ఆలోచనలన్నీ యెక్కడ వున్నవో తెలియుటలేదు. అతగాడితో నేను, నాలినేపోయ (నవ్వులపాలైపోయాను). నడుమ (మధ్యలో) ఇంకా మాటలేలకో (మాటలెందుకో). మొన్నటినుండి ఆయన మొక్కులే మొక్కీ (తెగప్రాధేయపడుతున్నాడు). మరి తాను ఇంకా ఇక్కడికి రాడు. అదెందుకో ? నాకు కూడా చలము (పంతం) కొంతైనా వుండదా? నేను కొంచెం అటువైపు తిరిగి నవ్వుకొంటే పాడిగాదా (న్యాయం కాదా) యాలకో (యెందుకే)? నా చెలులైన మీరన్నా యీమాట చెప్పండే. చిప్పిలు తమ్మి చిత్తములో యాలకో (ఉప్పొంగిన తమకము మనస్సులోనే దాచుటేలనో?) ఒకవేళ నాతో తానాడిన బాసలు తప్పినాడా యేమి? నాకు తిప్పరాదు (మరల్చుకొనుట సాధ్యముకాదు). అతని వలపు కదు తీపాయ (యెంతో మధురమైనది). ఇంతలోనే తాను నాదరిజేరినాడు. అతను చిరునవ్వు నవ్వగానే సిగ్గులన్నీ వీడె (వదలినవి) యాలకో. వెగ్గళించి (మితిమీరిన) శ్రీవేంకటేశుడు, నిగ్గుదేరి నన్నుకూడి, నిట్టూర్పులతో ముంచెత్తినాడు యెందరికో మరి?



సంఖ్య : 77 సంపుటము : 22 పుట: 52 రాగం : సాళంగం

**17** ఇదివో సుద్దులు యీరేపల్లెను
కదిసి యిందరివీఁ గైకొనవయ్యా ॥పల్లవి॥

పలచనిరెప్పలఁ బగటులు నెరపుచు
సొలసి నిన్నొకతె చూచెనటా
తళుకులగోళ్ల దండె మీఁటి యదె
పలికి నిన్నొకతె పాడెనటా ॥ఇది॥

చనవులు నెరపుచు సన్న సేయుచును
నసుపున నొక్కతె నవ్వెనటా
చెనకి యొకతె యదె చిగురుగేదఁగుల
వెనకనుండి నిను వేసెనటా ॥ఇది॥

అదన నీవు నన్నలమిపట్టఁగా
కొదలి యొకతె గని గొణఁగెనటా
యెదురనె శ్రీవేంకటేశ యొకతె నీ-
చెదరినయలకలు చెరిగెనటా ॥ఇది॥ **77**

**మున్నుడి :**

అన్నమయ్య వినిపిస్తున్న శ్రీకృష్ణుని రాసకేళినాస్వాదించండి. ఎందరు గోపికలున్నా వొక్కొక్కరికి తానొక్కక్కడై అలరించాడు. ఎందరో కవులు యెన్నో విధాలుగా వర్ణించిన ఆ శ్రీకృష్ణలీల అన్నమయ్య కీర్తనలో విందాము. ఇదివో నీయీరేపల్లె కథలతో, యెందరిని అలరించావో చెబుతాను గైకొనవయ్యా! నేడు శ్రీవేంకటేశుడవై మాయెదురనే వున్నావు. ఒకతె (అలమేలుమంగమ్మ) చెదరిన నీ ముంగురులను చిందరవందర చేసిందట అని అంటున్నారు.

**భావ దీపిక :**

స్వామీ! ఇదిగో నీరేపల్లె కథలను వినవయ్యా! ఇందరికీ కదిసి (చేరువయై) నీవెట్లు అలరించావో నీవే గైకొనవయ్యా (స్వీకరించవయ్యా!) ఒకతె తన పలుచని కనురెప్పలెత్తి పగటులు నెరపుచు (మురిపెంగా చూస్తూ) నిన్ను పరవశంతో చూస్తున్నదట. ఇంకొకతె తళతళ మెరుస్తున్న తన గోళ్ళతో దండె (తంబూర) మీటి నీపై పాటకట్టి పాడినదట. ఒకతె నీతో యెంతో చనువు ప్రదర్శిస్తూ నీకు అనేక సైగలు చేసి నీపై ననుపుతో (అనురాగంతో) నవ్వినదట. మరియొకతె నీకు తగులునట్లు లేత కేదగిచిగుళ్ళను నీవెనకనుండి నీపై విసరి వేసినదట. కానీ వాళ్ళందరిని లెక్కసేయక నీవు నన్ను (అన్నమయ్య భావనాసుందరిని) అలమిపట్టగా (కౌగలించి బిగించగా) ఇంకొకతె గమనించి ఈయనింతేనని గొణుక్కున్నదట. ఓ శ్రీవేంకటేశ్వరా! ఒకతె (నీదేవేరి) నీ చెదరిన ముంగురులను సవరిస్తూ, చెరిగెనట (చిందరవందర) చేసిందట.

సంఖ్య : 456 సంపుటము : 17 పుట: 263 రాగం : వరాళి

**18** నిన్నుఁ బాసియు నీపతి నీవొద్ద నున్నాఁడ నంటా
పన్ని నీరూపు దలఁచి భావరతి సేయును ॥పల్లవి॥

పట్టెమంచముకోటిగుబ్బలు చన్నులంటా
పట్టి పట్టి చూచి మోమప్పళించుకొను
అట్టె చిన్నిమలగు అదియే నీ మేనంటా
బెట్టి కౌఁగిళించుకొని బిగియించు సారెకు ॥నిన్ను॥

మడిచి యిచ్చినయాకు మగువ నీమోవి యంటా
పడఁతిచే నందుక చప్పరించును
ముడిచినమేలుకట్టు మొల్లలదండలు నీ
కడకంటిచూపులంటా ఘాతంబై పైఁజూచును ॥నిన్ను॥

కప్పినదుప్పటికొంగు కాంత నీ పయ్యద యంటా
తప్పి తారి బలిమిని తన్నుఁ దానే తీసును
చెప్పరాని మోహముతో శ్రీవేంకటేశుఁడు గూడె
యిప్పు డిట్టె నీవు రాగా యిదె నిజమాయను ॥నిన్ను॥ **456**

**మున్నుడి :**

పెదతిరుమలయ్య వినిపిస్తున్న శృంగారకీర్తనను ఆస్వాదించండి. దేవి చెలికత్తె చనువుగా యేమంటున్నదో వినండి. "దేవీ! నీపతి నిన్ను విడచియున్నను నీవద్దనే వున్నాడని నేనంటాను. ఆయనకు మాత్రం నీ విరహం బాధాకరం కాదా? కాని ఆయన నీ రూపాన్ని తలచుకొని భావరతి పొందుతూ విరహాన్ని వోర్చుకొనుచున్నాడమ్మా!" అని స్వామిని సమర్ధిస్తున్నారు. మరి అక్కడ స్వామి యెంత పరితపిస్తున్నాడో మీరూ వినండి.

**భావ దీపిక :**

దేవీ! నిన్ను బాసియు (దూరమై కూడా) నీపతి నీవద్దనే వున్నాడని నేనంటాను. కాకపోతే ఆయన పన్ని (నిశ్చయముతో) నీ రూపమునే తాను స్మరించుచు భావరతిని పొందుచున్నాడమ్మా! దేవీ! ఆయన తన పట్టెమంచపు కోళ్ళపైనుండు గుబ్బలనే నీ కుచగిరులని పట్టిపట్టి చూచి, మోమప్పళించుకొనుచున్నాడు (ముఖముతో స్పృశించుచున్నాడు. తన వద్ద వున్న చిన్న మలగు (దిండు)ను నీ తనువనుకొని బిగియార కౌగలించుచున్నాడు. ఓ మగువా! ద్వారపాలిక తాంబూలమును మడిచి ఈయగా అదే నీలేత అధరమనుకొని ఆతృతతో చప్పరించుచున్నాడు. ఆయన తాను వూరేగువాహనమున కలంకరించిన మొల్ల పూలదండను నీకడకంటి చూపలనుకొని అదిరిపడి యేమీ తెలియనట్లు పైకి చూచుచున్నాడు. ఓ కాంతా! నీ మగడు తాను కప్పుకొనిన దుప్పటి అంచును నీ పయ్యెద అని భ్రమించి బలంగా తనకుతానే తీసివేస్తాడు. చెప్పలేనంత మోహ పీడితుడైన శ్రీవేంకటేశ్వరుడు నిన్ను కూడుటకు నిశ్చయించుకొనగా అదే నిజమై నీవు ఆయన యెదుట నిలిచితివి



సంఖ్య : 111 సంపుటము : 22 పుట: 75 రాగం : సామంతం

**19** మాఁటలనే చలివాప మనకేలే
వాఁటమయ్యీఁ జేఁతలెల్ల వద్దు మనకేలే ॥పల్లవి॥

నిందఁబడ్డవాఁడుగాన నిన్నుఁజూచి మొక్కఁగాను
మందలించి రట్టుసేయ మనకేలే
ఇందునందు నుండెఁగాన యిచ్చకము సేయఁగాను
అందరిలో నణఁకించ నంత మనకేలే ॥మాఁట॥

నేరమి గలిగెఁగాన నీయింటికే రాఁగా వే-
మారు వెంగెములాడ మనకేలే
జీరలు మైనిండెఁగాన చెరఁగునఁ గప్పుకోఁగా
తోరముగా నవ్వు నవ్వి దూరమనకేలే ॥మాఁట॥

గక్కన సిగ్గువడ్డాఁడుగాన తలవంచితేను
మక్కువఁ బైకొనకుండ మనకేలే
వొక్కటై శ్రీవేంకటేశుఁ దొడఁబడ నిన్నుఁ గూడె
యెక్కడిసుద్దులు నిఁక నెంచ మనకేలే ॥మాఁట॥ **111**

**మున్నుడి :**

ఈ కీర్తనలో అన్నమయ్య దేవికి ఆంతరంగిక చెలికత్తెయై నీపతి శృంగారలీలలు కథలు కథలుగా వినిపిస్తూనే వుంటాయి. వాటిని లెక్కజేయుట మనకెందుకమ్మా? అని ప్రబోధిస్తున్నారు. నీ స్వామి తాను చేసిన పనికి తానే సిగ్గుపడుతున్నాడు. అట్టివానితో ఇంకా చిన్నబుచ్చటం మనకెందుకమ్మా? ఆయన చేతలు వాటమైనవే కాదనను. కాని ఆయనను మంచి మాటలతో బుజ్జగించటం వంటివి వద్దు. మనకెందుకమ్మా? చివరికి యెలాగో నిను వొప్పించి వొకటవుతాడు. ఇంకా ఇదంతా యెందుకమ్మా?

**భావ దీపిక :**

దేవీ! నీమగని అమాయకత్వం చూచి, యెట్లున్నా కటిగిపోతావు. ఇప్పుడీ మాటల వోదార్పులు మనకు యెందుకమ్మా? ఆయన చేతలెల్లా అయనకు వాటముగానే (అనుకూలంగానే) వుంటాయి. మనకెందుకమ్మా? ఆయన తప్పుజేసి నిందపడినవాడు కావున, నీకు మొక్కుతున్నాడు. మనకెందుకమ్మా? ఇప్పుడు ఆయన నేదోమందలించి రట్టు (రభస) చేసి లాభమేమిటి. ఇక్కడా అక్కడా వుంటాడు కాబట్టి యేవో ఇచ్చకాలు (ఎగతాళి చేయుట) మనకెందుకమ్మా. ఆయన నేరము జేశాడు కాబట్టే చల్లగా నీఇంటికొచ్చాడు. ఆయనతో వేయి మారులు "వ్యంగ్యంగా" దెప్పి లాభమేముంది? అది మనకెందుకమ్మా. చూడు ఆయన తన మేనిపై పూర్తిగా బట్టయెందుకు కప్పుకొన్నాడనుకొన్నావు? ఆయన ఒళ్ళంతా గాట్లే. మరి అలా చేసిన ప్రేయసి యెవరోగాని ఆయనను తోరముగా (వింతగా) యెగతాళిజేయుట మనకెందుకు లేవే? ఆయన పశ్చాత్తాపంతో అంతగా సిగ్గుపడుతున్నాడు కాబట్టే తల వంచుకొనినాడు. ప్రేమగా ఆక్రమించకుండా మౌనం మనకెందుకమ్మా? ఒడబడి శ్రీవేంకటేశుడు తానే నిన్ను జేరి కూడినాడు. ఆయన పాతకథలన్నీ తవ్వి తప్పులెంచుట మనకు యెందుకమ్మా?

సంఖ్య : 458 సంపుటము : 17 పుట: 264 రాగం : పాడి

**24 సేసిరా నేను నీవు చెప్పిన ట్టెల్లా**
**ఆసల నా విరహాగ్ని ఆరనీరా యించుకా ॥పల్లవి॥**

**యిట్టే నీమాటలకు యెదురాడేదాననా**
**పట్టి నన్ను దియ్యకురా బలిమిఁ నీవు**
**గుట్టున నే వచ్చినది కూడేకొరకే కాదా**
**తెట్టెవై కలఁగె మతి తేరనీరా యించుకా ॥సేసిరా॥**

**కాదురా నీ వంటఁగానేఁ గాదనేటిదాననా**
**సోదించకు నా పయ్యద జూటరి నీవు**
**అదిగొని నే వలచు టందుకొరకే కాదా**
**పాదుకొన్న నా కోపము పాయనీరా యించుకా ॥సేసిరా॥**

**వొక్కటై నన్నుఁ గూడఁగ నొల్ల ననేదాననా**
**కిక్కిరిసె గుబ్బలు బిగించకు నీవు**
**గక్కున శ్రీవేంకటేశ కౌగిటఁ గలసితివి**
**అక్కున నా చెమటలు ఆరనీరా యించుకా ॥సేసిరా॥ 458**

**మున్నుడి :**

పెదతిరుమలయ్య చెప్పిన శృంగార సంకీర్తన ఇది. నేను ఇదివరలో అనేకమార్లు చెప్పినట్లు అన్నమయ్య కాలంనాటి తెలుగు మాండలిక పదముల నర్థం చేసికొంటే, ఈ శృంగార కీర్తనల మాధుర్యం అర్థమవుతుంది. "సేసిరా నేను నీవు చెప్పినట్టెల్లా" అనే మాటను "నేను నీవు చెప్పినట్లే చేసితినిరా" అంటున్నాం నేటి కాలంలో. "కిక్కిరిసె గుబ్బలు బిగించకు నీవు" అనే మాట కీర్తనలో వినటానికి బాగానే వుంటుంది కాని, వివరిస్తే కొంచెం యెబ్బెట్టుగానే వుంటుంది. అయినా సాధ్యమైనంత "లలితంగా" వివరించడానికి ప్రయత్నించాను. ఇది దేవి చెప్పిన కీర్తన.

**భావ దీపిక :**

స్వామీ! నేను నీవు చెప్పినట్లేసేసిరా (చేసినానురా!) నీపై ఆశచేత విరహాగ్నిలో మాడిపోతూ వున్నాను. దానిని ఇంచుకంత (కొంచెమైనా) ఆరనీయరా! నేను నీ మాటకు యెదురు చెప్పేదానినా? నీవు నన్ను బలిమితో పట్టితియ్యకురా (పట్టుకోకురా). నేనింత గుట్టుగా వచ్చింది నిన్ను కూడుటకే కదా! నా మనస్సు తెట్టెలై కలగె (తుఫానులా కల్లోలమైనది). కాస్తంత తేరుకోనీయరా!! నీవంటగానే (నీవుతాకినంతనే) "కాదు" అనే దానను కాదురా నేను. నీవు జూటరివి (తుంటరివి). నాపయ్యెదను శోధింతువేమిరా? మొదటినుంచి నేను నిన్ను వలచినదీ "అందుకొఱకే" కదా! పాదుకొన్న (నెలకొనిన) నా కోపమును కాంచెమైనా పాయనీరా (పోనియ్యరా!). ఏకాంతంలో నన్ను గూడితే, వ్యతిరేకించేదానినా? కిక్కిరించి (లాలించి) నీవు నా కుచగిరి బిగియించవద్దురా! ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను సత్వరమే బిగికౌగిటిలో గలిసితివి. అక్కునజేర్చినా, కాస్త నా స్వేదమునుపశమింపనీరా!



సంఖ్య : 184 సంపుటము : 22 పుట: 123 రాగం : రామక్రియ

**21 నీవుసేసినభాగ్యము నే మేమని పొగడేమే**
**యేవేళ నిన్నుఁ బాయఁడు యెంతబత్తో ఇతఁడు ॥పల్లవి॥**

**సేయఁగలసింగారాలు సేసుక నీవుండఁగాను**
**సోయగపుఁగన్నులనుఁ జూచీ నాతఁడు**
**పాయపుమదములు నీపై తొలఁకఁగాను**
**ఆయములెరిఁగి నిన్ను నదె మెచ్చీ నితఁడు ॥నీవు॥**

**కొమ్మలునీవు నిట్టె కొలువులో నుండఁగాను**
**చిమ్మిరేఁగి కడు సంతోసించీ నితఁడు**
**సమ్మతించి నీవు సారె సరసములాడఁగాను**
**ఇమ్ముల నిన్నిటికిఁ దా నిచ్చగించీ నితఁడు ॥నీవు॥**

**చాలుకొని మోవితేనె చవులు నీవు చూపఁగా**
**మేలుమేలనుచు నిన్ను మెచ్చీ నితఁడు**
**యేలినలమేలుమంగ ఇట్టె నీవు సేవించఁగా**
**వేళావేళతో శ్రీవేంకటేశుఁడితఁడు ॥నీవు॥ 184**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ మధురకీర్తనలో అలమేల్మంగ భాగ్యాన్ని పొగడుతూ యేమంటున్నారో వినండి. దేవీ! నీవేమి భాగ్యము చేశావమ్మా!! యెంతని పొగడనమ్మా! నీవంటే స్వామికి యెంత అనురాగభరితమైన భక్తి!! క్షణం నిన్ను విడిచి వుండలేడితడు అంటున్నారు. నీవు అన్నివేళలా సేవించే నీపతి శ్రీవేంకటేశుడమ్మా ఇతడు అంటున్నారు.

**భావ దీపిక :**

దేవీ! నీవు చేసికొనిన భాగ్యమునేమని పొగడను? ఏవేళనైనా నీపతి నిన్ను పాయడు (విడువడు). పైగా నీవంటే యితగానికెంత భక్తియో!! నీవతనికొరకు తగిన విధంగా సింగారించుకొని వుండగా నాతడు నిన్ను తనసొగసైన కనులతో చూచినాడు. యౌవనమదముప్పతిల్లగా నీ మర్మములనెరిగిన యతడు నిన్ను యెంతో మెచ్చినాడమ్మా! దేవీ! నీవూ నీ కొమ్మలు (చెలికత్తెలు) స్వామి కొలువు చూచుటకు వెళ్ళినప్పుడు అతడు చిమ్మిరేగి (చెలరేగి) యెంత సంతోషించాడో తెలుసా? నీవుకూడా మిక్కిలి సౌమ్యురాలివై అతనితో పలుమార్లు సరసములాడగా, ఆతడుకూడా ప్రీతితో అన్నిటికీ ప్రతిస్పందించాడు. నీకది చాలదా? చాలుకొని (క్రమముగా వరుసపెట్టి) అతనికి మధురాధరమునందించగా, బాగుంది బాగుందని యెంతగా మెచ్చుకొన్నాడమ్మా అతడు!!! ఏలిన వో అలమేలుమంగా! నీవతనినిట్లు సేవించగా వేళావేళతో (సర్వకాలసర్వావస్థలయందు) నీపతి శ్రీవేంకటేశుడు నీవాడేనమ్మా!

సంఖ్య : 457 సంపుటము : 17 పుట: 263 రాగం : ఆహిరి

**22 తగులువిరి మోహాలదాయగాఁడా**
**చిగురుఁజెక్కిటిమీఁది చే యాల నీకును ‖పల్లవి‖**

**చూచితినో చూడనో సొలసి ని న్నొకమాటు**
**యేచి నన్నుఁ గొంగువట్టే విదేరా నీవు**
**ఆచాయ నీపేరిటి దంటినో అననో**
**వాచవిమాటలకే వలచేవు నాకును ‖తగులు‖**

**సెలవివెన్నెలనవ్వు చిందితినో చిందనో**
**పలుమారు సరసాలే పచరించేవు**
**నిలిచితినో నిలువనో నీయెదుట నిటువచ్చి**
**కలవి లేనివి గొన్ని కాఁకలు చల్లేవు ‖తగులు‖**

**మూవంకల దొరవంటా మొక్కితినో మొక్కనో నీ**
**దేవులవు గమ్మంటా దీవించేవు**
**ఆవేళ శ్రీవేంకటేశ అలమేలుమంగ నంటే**
**వావిగూడె నని నన్ను వన్నెగాఁ గూడితివి ‖తగులు‖ 457**

**మున్నుడి :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో దేవి స్వామితో నిక్కచ్చిగా మాట్లాడుతున్నాది. దాయగాడంటే శత్రువు అని అర్థం. విరిసిన మోహాలతో 'తగులు' కలిగించే శత్రువట స్వామి. చిగురులను బోలిన చెక్కిటిమీద చేయి యెందుకయ్యా నీకు? అని అడుగుతున్నదామె. ఆ వేళ వో శ్రీవేంకటేశ్వరా! మనిద్దరికీ మేనరికం వున్నదని నేననగానే చటుక్కున నన్ను కూడితివి అంటున్నది దేవి అలమేలుమంగ.

**భావ దీపిక :**

ఓ దాయగాడా! (కయ్యాలమారివాడా!) నీపై విరిమోహాలు (విరిసిన వ్యామోహం) తగులుకొనినదయ్యా! ఇంకా నీకు నీ చిగురు చెక్కిలిపై చేయి యెందుకయ్యా? స్వామీ! నిన్నొక్కమారు కన్నెత్తి చూచానో లేదో, యేచి (విజృంభించి) నా కొంగు పట్టుకొంటావు. ఇదేమిరా? ఆ చాయ (నీడజేరి) నీపేరు యిది అన్నానో లేదో, వాచవి (ముఖప్రీతి) మాటలకే నన్ను వలచితినన్నావు. ఇదేమి వలపయ్యా? నిజమే, నా నవ్వులు లేవెన్నెలవలెనుంటే, వాటిని చిందించానో లేదో పలుమార్లు నాతో సరసాలు ఆడెదవాయేమి? నీయెదుట నిలుచున్నానో లేదో, ఇటు నాయెదుట వచ్చి వున్నవీ లేనివీ చెప్పి నాలో విరహతాపము రేపుతావా? నీవు ముమ్వంకదొర (త్రిలోకాధిపతి) అని నేను నీకు మ్రొక్కితినో లేదో, ఆవేళ నన్ను నీ దేవులు (దేవేరి) గమ్మంటా (అవమని) దీవించేవు. ఓ శ్రీవేంకటేశ్వరా! నిజమే, నేను నీ అలమేలుమంగనే. నీవూ ఆమాటే చెప్పి మనమధ్య మేనరికం వున్నదని వన్నెతో నన్ను గూడితివి. నేను ధన్యనైతినయ్యా!



సంఖ్య : 156 సంపుటము : 22 పుట: 104 రాగం : నాదరామక్రియ

**23 ఎఱిఁగించవే నాకునేల దాఁచేవు**
**గుఱుతులు గానవచ్చీఁ గొంకనేఁటికే ‖పల్లవి‖**

**కామినిరో నీమోమునఁ గళలుదేరీ నేఁడు**
**నీమగఁడు వచ్చెనా నీవద్దికి**
**ఆముకొని చెంగలించి యట్టె మాటలాడేవు**
**యేమైనా నీకుఁ జనవులిచ్చెనటవే ‖ఎఱిఁ‖**

**సంతోసించుకొందానవు చవులుచూపి యతఁడు**
**మంతనాన నిన్నప్పుడె మన్నిఁచెనా**
**వింతలుగా సెలవుల వేడుకతో నవ్వేవు**
**యంతలో నీకోరికలు యీడేరిచెనటవే ‖ఎఱిఁ‖**

**వేవేలుచిన్నలతోడ వెల్లవిరై మెఱసేవు**
**శ్రీవేంకటేశుఁడు నిన్నుఁజేరి కూడెనా**
**యీవేళ నలమేల్మంగ విన్నిటాఁ జొక్కే వీతఁడే**
**చేవమీరినరతులఁ జిమ్మిరేఁచెనటవే ‖ఎఱిఁ‖ 156**

**మున్నుడి :**

దేవి చెలికత్తెవలె అన్నమయ్య చనువుగా ప్రశ్నిస్తున్నారు. నాతో యెందుకు దాచెదవమ్మా? నాకు యెన్నో గుర్తులు కానవచ్చుచున్నవిలే. ఎందుకమ్మా సంకోచిస్తావు? నీముఖమున కళలు తాండవిస్తున్నవమ్మా! అంత సంతోషంగా వున్నావు ఆయన నిన్ను మన్నించాడా యేమి? ఆయన శ్రీవేంకటేశ్వరుడైతే నీవాతని దేవేరి అలమేలుమంగవు. నీకేమితక్కువమ్మా?

**భావ దీపిక :**

దేవీ! నాకు యెఱిగించవే. ఏలదాచేవు? నీమేనిపై గుఱుతులన్నీ కానవచ్చుచున్నవి కదా! కొంకేటికే (సంకోచమెందుకమ్మా?). ఓ కామినీ! నేడు నీ మోమున కళలన్నీ తాండవించుచున్నవమ్మా! నేడు నీవద్దకు నీమగడు వచ్చినాడా యేమి? ఆముకొని చెంగలించి (పైకొని వివశుని జేసి) ఇట్టే ఆతనితో మాటలాడేవు. నీకు ఆయన అంత చనవులిచ్చాడా యేమమ్మా? ఏమమ్మా అంత సంతోషంగా వున్నావు? మనోహరమైన అనురాగముజూపి, అతగాడు మంతనాన (యేకాంతమున) నిన్ను అప్పుడే మన్నించినాడాయేమి? చక్కటి నీపెదవులు అరవిచ్చికొనగా మధురముగా నవ్వేవు. ఇంతలోనే నీ కోరికలన్నీ యీడేరినవా యేమి? దేవీ! నీవు వేవేల చిన్నెలతో (అనేకమైన వింత అందాలతో) అతిశయించి మెరయుచున్నావు. శ్రీవేంకటేశుడు నిన్నుజేరి కూడెనాయేమి? ఓ దేవీ! అలమేలుమంగా! నీవిన్ని విధముల పరవశించితివి, అతిశయించిన సురతమున అతడు నిన్ను అలరించినాడా యేమి?

సంఖ్య : 253 సంపుటము : 22 పుట: 169 రాగం : శంకరాభరణం

28 ఎన్ని నేరుచుకొంటివి యెంతని సంతోసించే-
నన్నిటా నిందుకే నేను అలనైతి నీకు ॥పల్లవి॥

ఆయములు గరఁగఁగ నంటి మాటలాడేవు
చేయిమీఁదుగానే చెనకేవు
పాయపుమదము రేఁగ పచ్చిగానే పెనఁగేవు
చాయలసన్నల మోవిచవులు చూపేవు ॥ఎన్ని॥

ఆసలెల్లఁ బుట్టించి యట్టె తప్పక చూచేవు
లాసి కుచములు ముట్టి లాలించేవు
వాసనలు మేనఁ బూసి వాడికలు సేసేవు
పోసరించఁ జెక్కునొక్కి పొందు నెరపేవు ॥ఎన్ని॥

కళలు పైపై రేఁగఁ గాఁగిలించి కూడేవు
కులికి నోరిలోఁ దమ్మ కుమ్మరించేవు
నెలవై శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
కలసి నన్నిట్లానే కడుమన్నించేవు ॥ఎన్ని॥ **253**

**మున్నుడి :**

అన్నమాచార్యులవారు చెప్పిన ఈ శృంగార సంకీర్తనలో దేవి తన విభుని యెలా దెప్పుతున్నదో ఆలకించండి. “స్వామీ! యెన్ని నేర్పుకొన్నావయ్యా? ఎంత సంతోషించానయ్యా? అందుకేలే నీకు అలుసైపోయాను.” కానీ “ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నీ దేవేరినైన అలమేలు మంగను. నాతో కలిసి నన్నిట్లాగానే యెంతో మన్నించితివి”. అని చివరకు మురిసిపోయింది.

**భావ దీపిక :**

దేవా! యెంతనేర్పరివి!! నీ నేర్పుకు యెంత సంతోషం కలుగుతున్నది!! మరి అందుకే నేను నీకు అన్నిట్లోను నీకు అలుసైపోయాను. స్వామీ! నీవు నా మర్మములంటి తీయని మధురోక్తులతో కరగింతువు. మీదచేయివేసి నన్ను స్పృశింతువు. యౌవన గర్వము చెలరేగగా బెదురులేక పెనవేసికొనేవు. చాయల సన్నల (గుర్తులు తెలిసేట్లు) అధరామృతం గైకొని చవులూరించేవు. నాకు అనేక ఆశలు కల్పించునట్లు తదేకముగా చూచెదవు. లాసి (లాస్యముతో) కుచములదాకి లాలించెదవు. వాసనలు (సుగంధ పరిమళములను) మేనిపై బూసి నన్ను నీకు అనుకూలురాలుగా సేసేవు. పోసరించి (గర్వించి) నా చెక్కిళ్ళను నొక్కి కూటమికి ఆయత్తము చేసెదవు. ప్రభూ! నీ శృంగారలీల నేమని వర్ణించను? కామకళలన్నీ చెలరేగునట్లు కౌగలించెదవు. గోముగా నీనోటిలోని తమ్మును నా నోటిలో కుమ్మరించేవు (జొనిపెదవు). సుస్థిరుడవై శ్రీవేంకటేశ్వరా! నేను నీ అలమేలు మంగను. నాతో కలిసి నీవు నన్నిట్లు మన్నించితివి.



సంఖ్య : 157 సంపుటము : 22 పుట: 105 రాగం : శ్రీరాగం

25 ఇందాఁకాఁ బొరలితివి యెడలేనివిరహాన
కందువ నీపాలఁ జిక్కె కాంతుఁడు నేఁడిదివో ॥పల్లవి॥

చెలువుఁడు వీఁడె వచ్చెఁ జిత్తగించవే నీవు
కలికికన్నులఁ జూచి కరఁగించవే
పలుకుఁదేనెలు మోవిఁ బైకొన మాటాడవే
పిలుచుకవచ్చితిమి ప్రియములుచెప్పవే ॥ఇందాఁ॥

ఆతఁడు విడెమిచ్చీని అందుకొనవె ఇప్పుడు
చేతులెత్తి మనసారా సేసవెట్టవే
యీతల సరుసనుండి ఇట్టె సరసమాడవే
నీతో నొనగూర్చితిమి నిండాఁ గాఁగిలించవే ॥ఇందాఁ॥

శ్రీవేంకటేశుఁ డేలెఁ జిరునవ్వు నవ్వవే
మోవితీపు చూపి కేలు మొగిడించవే
యీవేళ నలమేల్మంగ యెనసితి వితనితో
నేవనేసీ నీరతులఁ జేకొని మెప్పించవే ॥ఇందాఁ॥ **157**

**మున్నుడి :**

అన్నమయ్య పెండ్లికుమార్తె అయిన అలమేలుమంగ నెచ్చెలివలె యీ కీర్తన చెబుతున్నారు. ఇప్పటిదాకా యెక్కడలేని విరహాన ఆపసోపాలు పడ్డావు కదమ్మా? ఇదిగో నేడీ శ్రీకాంతుడు నీపాలజిక్కినాడు. ఈయన త్రిభువనాధీశుడైన శ్రీవేంకటేశ్వరుడమ్మా! ఆలోచిస్తావెందుకు. అధరామృతము నందించి నీచేయి నందించవమ్మా! అంటున్నారు.

**భావ దీపిక :**

దేవీ! ఇప్పటిదాకా నీవు యెక్కడలేని విరహాన పొరలితివి (పొర్లిగింతలు పెట్టావు). ఇదిగో నేడు నీ కాంతుడు నీకు ఏకాంతములో జిక్కినాడమా! వీడే నీ జతకాడై వచ్చినాడు. నీవు స్వామిని చిత్తగించవమ్మా! అందమైన నీ సోగ కన్నులతో చూచి యీయనను అలరించవమ్మా! నీ పెదవుల నుండి వచ్చే తేనె నీ పలుకులలోనే వున్నది. కనుక తీపిగా మాట్లాడవమ్మా! శ్రమపడి స్వామిని పిలుచుకు వచ్చాం. ప్రియమైన ముచ్చట్లు చెప్పవమ్మా! ఇప్పుడాయన నీకు విడెమిచ్చీ (ఆహ్వాన తాంబూలమునిచ్చాడు. మనసారా ఆయనకు సేసవెట్టవే (శాస్త్రోక్తంగా అక్షింతలు పోసి పెండ్లాడవమ్మా!) ఆతని వద్దజేరి సరసములాడవమ్మా! ఎట్లో మీకు పొందు కల్పించాము. బిగియార కౌగలించవమ్మా! ఈ శ్రీవేంకటేశ్వరుడు నిన్ను యేలుకొనినాడు, చిరునవ్వులు చిందించవమ్మా! నీ అధరామృతమునందించి, కేలు మొగిడించవే (చేతితో చెట్టాపట్టాలేయవమ్మా!) ఈ దేవదేవునితో ఈవేళ సమకూడావు. ఇక యీయనకు సురతముతో సేవజేసికొని మెప్పించు. నీవూ జగజ్జననివి కదా!

సంఖ్య : 454 సంపుటము : 17 పుట: 262 రాగం : నాదరామక్రియ

**26 ఆపాటి కాపాటి అంతేపో విభుఁడ**
**చేపట్టి కొసరఁగఁ జెల్లు నా మాకు** ॥పల్లవి॥

**వలచినకొలఁ దింతే వనితలచనవు**
**చలము సాదించఁబోతే చవివుట్టీనా**
**పిలిచినకొలఁదీనే బెరసి నేఁ బలికితి**
**చెలఁగి యింత కెక్కుడు చెల్లునా మాకు** ॥ఆపాటి॥

**ననిచినకొలఁ దింతే నగవూఁ దగవూ**
**పెనఁగి పైపడఁబోతే బ్రియ మయ్యీనా**
**మనసిచ్చినకొలఁదే మాటలు నే నాడితి**
**చెనకఁగ దొరతోడఁ జెల్లునా మాకు** ॥ఆపాటి॥

**దగ్గరి కూడినయంతే తమకపుకొఁగిలి**
**వెగ్గళము సేయఁబోతే వేసట గాదా**
**నిగ్గుల శ్రీవేంకటేశ నీవే నన్నుఁ గూడఁగాను**
**సిగ్గుదీరెఁ గాక యింత చెల్లునా మాకు** ॥ఆపాటి॥ **454**

**మున్నుడి :**

పెదతిరుమలయ్య వినిపిస్తున్న ఈ శృంగార కీర్తనలో దేవి తన విభునితో యేమని అంటున్నదో వినండి. ఈ ఒడ్డుకు ఆ ఒడ్డు యెంత దూరమో, ఆ ఒడ్డుకు ఈ ఒడ్డూ అంతే దూరం కదా! స్వామీ! నీవు నన్ను చేపట్టినావు. ఇంకా సంకోచిస్తే బాగుంటుందా? ఉదాహరణకు, వనితలు యెంతప్రేమిస్తారో అంతే మూర్ఖంగా పట్టుదల చూపిస్తే బాగుంటుందా? ఓ తిరుమలేశా! మేము వనితలము నీవు కూడిన పిదప ఇంకా సిగ్గులు చిందిస్తే బాగుంటుందా... అంటున్నది.

**భావ దీపిక :**

నాథా! ఆపాటి కాపాటి (ఆమాత్రందానికి ఆమాత్రమే అవుతుంది) అంతేపోవయ్యా! నీవు నన్ను చేపట్టితివి. ఇప్పుడు కొసరగ (సంకోచించగా) చెల్లునా (బాగుంటుందా?) వనితల చనవు వారు వలచినంత మేరకే వుంటుంది. వారితో పట్టుదలకుపోయి సాధించబోతే చవిబుట్టేనా (బాగుంటుందా?) నీవు నన్ను పిలిచావు కాబట్టే బెరసి (చేరువయై) నీతో నేను మాట్లాడాను. ఇంతకంటే యెక్కువ చొరవ చూపితే మాకు బాగుంటుందా? స్వామీ! ననచిన కొలది (ఇష్టపడినంతవరకే) నవ్వులైనా తగవులైనా. దౌర్జన్యంగా పైనబడితే సంతోషంగా వుంటుందా? బాగుంటుందా? నేను నీకు యెంత మనసిచ్చితినో అంతే నీతో మాట్లాడగలను. నీవు దొరవు. దొరతో సరసాలాడితే చెల్లునా మాకు (బాగుంటుందా?). ప్రియా! పరవశింపజేసే కౌగిలి యేపాటిదో తెలియునా, నీవు చేరువయై యెంత కూడెదవో అంతే. వెగ్గలము సేయబోతే (తిరస్కారభావం చూపిస్తే) వేసటకాదా (విసుగుపుట్టదా?) ఓ శ్రీవేంకటేశ్వరా! నిగ్గుదేరి నన్ను కూడితివి. ఇప్పుదు మేము మాకు సిగ్గు అంటే బాగుంటుందా?



సంఖ్య : 252 సంపుటము : 22 పుట: 167 రాగం : శుద్ధదేశి

**27 ఎదుట నుండవే నీవు యేపొద్దును**
**అదివో మేలువాఁడైనాఁ డతఁడు నీకిపుడు** ॥పల్లవి॥

**తేనెలుగారేటినీతేటలమాటలు వింటె**
**వీనులపండుగలౌను విభునికివి**
**కాను(క)గా నీవు చక్కనిమోము చూపితేను**
**వూనినమదనకళ లుప్పొంగ నాతనికి** ॥ఎదు॥

**నీలపుసరాలవంటినీచూపులు సొఁకితేను**
**చాలా సంతోషమౌ నీసరసునికి**
**చాలుకొన సెలవుల సన్నపునవ్వు నవ్వితే**
**తాలిమితో వేడుకలు దట్టమౌనాతనికి** ॥ఎదు॥

**మెఱుఁగుగుబ్బల నీవు మేను సోఁకఁజేసితేను**
**కఱఁగు జిత్తము శ్రీవేంకటేశ్వరుకు**
**గుఱియై యలమేల్‌మంగ కూడితి విన్నిటా నీకు**
**నెరి నీపై కోరికలే నెగడు నాతనికి** ॥ఎదు॥ **252**

**మున్నుడి :**

అన్నమయ్య అలమేలుమంగ చెలికత్తెయై కొన్ని సలహాలను దేవికి ఇస్తున్నారు. ఏవేళనైనా వదలకు. నీవు అతగాని యెదుటనే వుండవమ్మా! ఎందుకంటే ఆర్తత్రాణ పరాయణుడైన, నీ స్వామి నీకిప్పుడు అనుకూలుడై వున్నాడమ్మా! నీవు మెఱుగు గుబ్బలతో మేనుసోఁక జేసితే శ్రీవేంకటేశ్వరునకు చిత్తము కఱఁగును అని నచ్చ చెబుతున్నారు. ఔరా!!

**భావ దీపిక :**

దేవీ! యేపొద్దును (ఏవేళనైనా) నీవు అతగాని యెదుటనే వుండవే. అదివో మేలువాడై (నీకు హితుడై) వున్నాడు, సంకోచించకు. నీవిభునికి తేనెలొలుకు నీ స్వచ్ఛమైన మాటలు వింటే ఆయనకు వీనుల విందౌనమ్మా! అతనికి అపూర్వమైన కానుక చక్కని నీముఖ దర్శనమే. దానివలన అతగానిలో మదన కళలుప్పొంగి నిన్ను మురిపిస్తాడు. దేవీ! నీలపుసరాలు (ఇంద్రనీలముల హారాల) వంటి నల్లని నీకనుచూపులతగానికి సోకితే నీ సరసునికి యెంతో సంతోషము కలుగుతుందమ్మా! విచ్చీవిచ్చని నీ పెదవులతో నీవు చిరునవ్వులు చిందిస్తే అతగానికి ధైర్యముతో వేడుకలు దట్టమవుతాయి. నిన్ను సంతోషాలలో ముంచెత్తుతాడు. దేవీ! నూతన కాంతులతో విలసిల్లే చనుగవ నాతనికి అలవోకగా తాకించితే శ్రీవేంకటేశ్వరుని చిత్తము కఱఁగిపోదా తల్లీ! నీవు స్వామికి జోడీ వలె కూడిన అలమేలుమంగవు. అన్నిటా ఆతనికి తగినదానవు. నీపై నాతనికి నెఱి కోరికలు (అందమైన వాంఛలు) నెగడినవి (అతిశయించినవమ్మా!!).

సంఖ్య : 237 సంపుటము : 22 పుట: 158 రాగం : పాడి

**32** అతఁడు నన్ను మన్నించేదంతా నే నెఱుఁగుదు
కతలేమిచెప్పేరే కాంతలాల ॥పల్లవి॥

వలచినకొలఁదినే వాడికలు గలుగును
పిలుపులోఁ గానవచ్చు ప్రేమమెల్లాను
తలఁపు గలిగితేనే తగులాయముఁ గలుగు
తెలిపి యేమిచెప్పేరే తెఱవలాల ॥అతఁ॥

మొగము చూచితేనే మోహమెల్లా గనుపట్టు
నగితేనే వెల్లవిరౌ ననుపెల్లాను
సొగిసి యిచ్చగించితే చుట్టరికము గలుగు
తగ నాకేమిచెప్పేరే తరుణులాల ॥అతఁ॥

మేలములు దఱచైతే మేలెల్లా రూడికి నెక్కు
పోలికలనే తోఁచు పొందులెల్లాను
యేలె శ్రీవేంకటేశుఁడు యే నలమేలుమంగను
లాలించి యేమిచెప్పేరే లలనలాలా ॥అతఁ॥ **237**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో దేవి తన చెలులతో ప్రేమతత్త్వాన్ని వివరిస్తున్నది. చాలా హృద్యమమైన కీర్తన ఇది. ఓ కాంతలారా! నా ప్రియుడు నన్నెంత మన్నిస్తాడో నేనెఱుగుదును. మీరు నాకు ఆయన గురించి లేనిపోని కథలను చెప్పవలసిన అవసరం లేదు. చెప్పవలసినది అంతా చెప్పి ముక్తాయింపుగా వో లలనలారా! ఆయన నాపతి శ్రీవేంకటేశ్వరుడు. నేను ఆయన దేవేరి అలమేలు మంగను యేమిచెబుతున్నారే ఆయన నన్ను తప్పక లాలిస్తాడు, అన్నది.

**భావ దీపిక :**

ఓ కాంతలారా! ఆయన నా ప్రాణనాథుడు. ఆయన నన్ను మన్నిస్తాడన్న సంగతి నేనెఱుగుదును. నాకు లేనిపోని "కథలు చెప్పకండి". నేనొకటి చెబుతాను వినండి. ఎంతవలపు కలిగితే, అంతా వాడికలు (అలవాటు) అవుతుంది. అవతల వ్యక్తి పిలుపులోనే ప్రేమ తొణికిసలాడుతుంది. ప్రియుని తలపువచ్చినంతనే తగులాయము (కామసంబంధము) కలుగుతుంది. ఓ తెఱవలారా! (వనితలారా!) ఇంకా నాకేమి వివరించి చెప్పేరే? అంతెందుకు, ప్రియుని ముఖమును చూచినంతనే యెంతో మోహము కలుగుతుంది. అతగాని నవ్వులోనే ననుపంతా (అనురాగమంతా) వెల్లివిరిసేను. సొగిసి (ఇంపుగా) ఇష్టమేర్పడితేనే చుట్టరికము కలుగుతుంది. ఓ తరుణులారా! ఇంకా మీరు నాకు చెప్పేదేమిటే? మేలములు (సరసములు) తరచుగా ఆడుకొంటుంటే ఎంతోమేలు స్థిరపడుతుంది. ప్రియుని పొందులన్నీ పోల్చలేనివిగా వుంటాయి. ఆయన శ్రీవేంకటేశ్వరుడు నేను అలమేలుమంగను. యేలె (యెందుకే) వో లలనలారా! నన్ను ఇంతలాలించి ఇంకా యేమిచెబుతారే?



సంఖ్య : 114 సంపుటము : 22 పుట: 77 రాగం : నాదరామక్రియ

**29** కన్నదే విన్నదే కందువసుమ్మీ
వున్నతి నీసతిసుమ్మీ వొడఁబా టిద్దరికి ॥పల్లవి॥

యేకడ నీవుండినాను యెంతపనిగలిగినా
ఆకెమాటే నామాట అట్టే రమ్మీ
పోకలెన్నైనాఁ గలవు పొందు లెన్నైనాఁ గలవు
సాకిరి యీచెలిసుమ్మీ సరుస నిద్దరికి ॥కన్న॥

అలుకెంత గలిగినా అడ్డములే యాడినా
చెలిమొక్కే నామొక్కు చేకొనుమీ
తలఁపెట్టయినాఁగాని తగులెంతయినాఁగాని
తొలుత యీపెసుమ్మీ దూతిక యిద్దరికి ॥కన్న॥

యెంతదవ్వుపోయినా యేమని పొడచూపినా
యింతిసన్నే నాసన్న యెఱుఁగుకొమ్మీ
యింతేల శ్రీవేంకటేశ యిందాఁకాఁ గూడితివి
సంతతము నీకెసుమ్మీ సాదన మిద్దరికి ॥కన్న॥ **114**

**మున్నుడి :**

'కందువ' అనే మాటకు అనేక అర్థములున్నవి. ఇక్కడ అన్నమయ్య 'సత్యదూరములు' అనే భావనలో వుపయోగించారని నా వూహ. ప్రభూ! నీసతి యెంతో ఔన్నత్యంకల వనిత సుమా! నీవు ఆమె గురించి కన్నవీ విన్నవీ సత్యదూరములే సుమా! అని స్వామికి నచ్చచెబుతున్నారు. ఆఖరి చరణంలో "సంతతము నీకె సుమ్మీ సాదనమిద్దరికి" అనే చరణంలో 'నీకె' అంటే 'స్వామి' కాదు. 'సంతతమున్ ఈకె సుమ్మీ' అని విడదీస్తే గాని అర్థంకాదు. కీర్తన చెబుతున్నది స్వామి చెలికత్తె.

**భావ దీపిక :**

స్వామీ! ఒక్కొక్కప్పుడు మనం కన్నవీ, విన్నవీ కూడా కందువ (సత్యదూరములు). నీసతి యెంతో ఔన్నత్యం కల వనిత. ఇద్దరికీ వొడబాట చేయుటయె నాపని. నేను నిన్ను (స్వామిని) యెక్కడవున్నా, యెంత పనిలో నీవున్నా ఆమెమాటే నామాట. అట్టే జాగు చేయక రమ్మీ (రావయ్యా!) పోకలు (డాబు మాటలు) యెన్నో విన్నాను. పొందు జరిపే మాటలూ విన్నాను. మీ సరసనే వున్న యీచెలి (అన్నమయ్య) మీ ఇద్దరికీ సాకిరి (సాక్ష్యం) కాబట్టి సంతోషంగా వుండండి. స్వామీ! శ్రీదేవి యెంత అలుక చూపించినా, యెన్ని అడ్డంకులు జెప్పినా తప్పులేదు. ఆమె మాటే నామాట. నేను నీకు మొక్కుతున్నా ఆమె మొక్కినట్లే భావించి స్వీకరించు. నాకు నీపై యెట్టి ఆశలున్నా, నీపై యెంత వ్యామోహంవున్నా మీకు మొదటి దూతిక (రాయబారి) మీ ఇద్దరికీ యీపె (అన్నమయ్య) యే సుమా! ప్రభూ! నీవు యెంతదూరమేగినా, యేవిధంగా కనుపించినా, నీదేవిసన్నే (సైగ) నా సన్న అని గ్రహించు. ఇన్ని మాటలెందుకయ్యా? ఓ శ్రీవేంకటేశ్వరా! ఇప్పటిదాకా మాదేవిని గూడితివి కదా! ఎల్లప్పుడూ మీ ఇద్దరికీ సాధనము యీకె (అన్నమయ్య)యే సుమా!

సంఖ్య : 183 సంపుటము : 22 పుట: 122 రాగం : బౌళి

**30** నీవాడేసరసము నిన్ను నింతసేసెను
యీవేళ నలమేల్‌మంగ కియ్యవయ్య పంతము ॥పల్లవి॥

పొలఁతి నీకంపినపూవులచెండు దీసుక
చెలికత్తెనే వేసేవు చెలరేఁగి
కలికి దవ్వులనుండి కంటినంటా నిమ్మపంట
కొలువులోననే నీకొప్పుదాఁక వేసెను ॥నీవా॥

వీడెము నీకంపితేను వేగమే కైకొని యాపె-
వూడిగపుసతినోర నొగి నించఁగా
ఆడనే వుండి నీదేవు లందుకుఁ దనపుక్కిటి-
వీడెము నీకొంగున వెస మూట గట్టెను ॥నీవా॥

కాతరాన నీవంపినకానికపంచదార
దూతికకుఁ జవిచూపి తొరలించఁగా
యీతల శ్రీవేంకటేశ ఇల్లాలు మోవితేనె
వాతెర నంటించి నిన్ను వలపించుకొనెను ॥నీవా॥ **183**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగారకీర్తనలో ఆయన స్వామివారి చెలికత్తెయై నిర్మోహమాటంగా స్వామి విశృంఖలత్వాన్ని తప్పుబడుతున్నారు. ఆ కథనం వినండి. స్వామీ! నీవు యితర వనితలతో ఆడేకొంటె సరసాలే నీకు ఇంత చేశాయి. ఈవేళ అలమేలుమంగవద్ద నీతప్పు అంగీకరించవయ్యా! పరుల అధరామృతము నీకెందుకు? నీ ఇల్లాలి (మోవితేనె వాతెర నంటించి నిన్ను వలపించుకొనెను” అంటున్నారు. అంటే...

**భావ దీపిక :**

స్వామీ! నీవాడే సరసాలు నిన్ను నింతసేసెను. ఈవేళ నీదేవేరి అలమేలుమంగకు “ఇయ్యవయ్యా పంతము” (తప్పునంగీకరించవయ్యా!) ఆ పొలతి (నీదేవేరి) నీకు పంపిన పూలచెండును తీసికొని నీవు చెలరేగి (విజృంభించి) చెలికత్తెనే వేసేవు (వొక చెలికత్తె మెడలో వేశావు.) మరి నీదేవి తక్కువదా? నేను అంతదూరం నుంచి అంతా చూస్తూనే వున్నానులే అని ఒక నిమ్మపండును నీకు తాకునట్లు నీపై వేస్తే అది నీకొప్పుకు తగిలింది. ఇంకొక చెలికత్తెతో నీకు తాంబూలమును పంపిస్తే నీవేమిచేశావు? నీ ఊడిగంపు సతి (దాసి) నోటిలో దానిని కుక్కినావు. కానీ అక్కడే దాగి దానిని చూసిన నీదేవేరి దానికి ప్రతిగా తన నోటనున్నట్టి తాంబూలాన్ని, వెస (వెంటనే) నీకొంగులో మూటకట్టింది. మరి అదే పంతమంటే. దేవా! నీవు యెవ్వరో, కాతరాన (ఉత్సాహంగా) పంపిన పంచదారను నీదూతిక (వార్తాహరురాలు)కు రుచిచూపించి తొరలించగా (మార్పించగా) నీదేవి కంటపడింది. దానికి ప్రతిగా ఓశ్రీవేంకటేశ్వరా నీ ఇల్లాలు తన అధరామృతమును నీ వాతెర (పెదవులను కప్పుతెర)కు అంటించి నీచేత వలపించుకొన్నది.



సంఖ్య : 238 సంపుటము : 22 పుట: 159 రాగం : శుద్ధవసంతం

**31** నేనూ సంతోసించుకొనే నీకుఁ దోడుగా నేఁడు
ఆనుక నీదేవినైతి నానతీవయ్యా ॥పల్లవి॥

కళలు నీమొగమునఁ గడు నిండెను
సెలవులఁ జిరునవ్వు చిమ్మిరేఁగీని
చెలపలచెమటలు చెక్కుల నవె
అలరిన నీవేడుక లానతీవయ్యా ॥నేనూ॥

అరవిరిబాగులు నీయందుఁ జూపట్టె
శిరసులోపల వింతవిరు లున్నవి
గిరిగొన్నమోవిమీఁదఁ గెంపులు నవె
అరుదైననీవేడుక లానతీవయ్యా ॥నేనూ॥

కనుఁగొనచూపులు కడుఁదేటాయ
నినుపులై వింతతావి నిండె నీమేన
యెనసి యలమేల్‌మంగనేలిన శ్రీవేంకటేశ
అనిశము నీవేడుక లానతియ్యవయ్యా ॥నేనూ॥ **238**

**మున్నుడి :**

“ఆనతీవయ్యా” అంటే అనుజ్ఞనీయవయ్యా అని అర్థం. అన్నమయ్య వినిపిస్తున్న యీ శృంగార సంకీర్తనలో దేవి తనపతి అనుమతిని వేడుకొంటున్నది. స్వామీ! నీకుతోడుగా నేడు నేనూ సంతసించుచున్నాను. అటుపిమ్మట నీదేవినైతిని. ఇక నీఇష్టం నేనేంచేస్తే నీకు ఆనందమో అనుజ్ఞనీయవయ్యా అంటూ అభ్యర్థిస్తున్నది. ఆవైనం చిత్తగిద్దాము.

**భావ దీపిక :**

ప్రభూ! నేడు నేనూ యెంతో సంతోషిస్తున్నాను. నీకు తోడుగా నీదేవేరినయ్యాను. ఇప్పుడు నేను యేమిచేస్తే నీకు ఇష్టమో ఆనతీవయ్యా (సెలవిమ్ము). స్వామీ! నీమొగమున కళలన్నీ మెండుగా నిండినవి. నీపెదవులపై చిరునవ్వు చిమ్మిరేచెను (విజృంభిస్తున్నది). చెలములలోవూరే నీటివలె చెమటలు నీ చెక్కిలిపై నిండినవి, అదిగో. ఇవన్నీ నీకు వేడుకలే. నాకు అనుజ్ఞనీయవయ్యా! దేవా! నీయందు “అరవిరిబాగులు” (అరవిచ్చినట్టి సొగసులు) కనబడుచున్నవి. నీతలపై వింతపుష్పములు కనుపిస్తున్నాయి. నీమోవిపై గిరికొన్న కెంపులు (ఆవరించిన యెఱ్ఱని దంతక్షతములు) అదిగో కనుపిస్తూనేవున్నాయి. ఇవన్నీ నీకు అరుదైన వేడుకలు. వాటినెత్తి చూపుటకు నాకు అనుమతీయవయ్యా! నీ కనుచూపులు తేటగా అయినవి. నీ ఒంటిపై వింత పరిమళాలు నెగడుచున్నవి. మరి నీవు శృంగార రాయుడవని నాకు తెలియదా? అతిశయించి యీ అలమేలుమంగనేలిన శ్రీవేంకటేశ్వరా! అనిశము వేడుకలు (నిత్యకళ్యాణములకు) ఆనతీయవయ్యా!

సంఖ్య : 62 సంపుటము : 22 పుట: 42 రాగం : మెచగౌళ

**36** చెప్పినవారిబుద్దులు సేయవైతిగా
కప్పురపుమోవెల్లఁ గదువాడెఁ జుమ్మీ ॥పల్లవి॥

దువ్వటపుచంద్రగావి తొప్పదోఁగెఁ జెమటల
నవ్వకుమన్న మానవు నాయకునితో
పువ్వులు గోయకుమంటే పురుషునియెదుటను
చివ్వన మరునమ్ములు చేయినాటకుండునా ॥చెప్పి॥

గాఁటపునిట్టూర్పులు కసిరితేఁ బతితోడ
మాటలాడకుమన్నాను మానవైతిగా
మేఁటితురుమెల్లా జారె మిక్కిలిరమణునితో
వాటపుసరసములు వద్దంటిఁగా ॥చెప్పి॥

పూసినకుంకుమపూఁత పులకలఁ బేట్లైత్తె
ఆసలఁ బ్రాణేశ్వరు నంటుకోఁగాను
మేసులఁ బరవశము మీఁదమీఁద నబ్బె నదె
బాసల శ్రీవేంకటేశుఁ బైకొనితే నంటిఁగా ॥చెప్పి॥ **62**

**మున్నుడి :**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ శృంగారకీర్తనలో దేవి చెలియ దేవితో దెప్పిపొడుపుగా యేమంటున్నదో వినండి. దేవీ! నీకెవరన్నా హితవు చెప్పితే వారు చెప్పినట్లు చేయవైతివి. పోనీ నిన్ను చూద్దామా అంటే కర్పూరపుతావి గలిగిన నీమోవి మిక్కిలి వదలిపోయింది సుమా! ఎంతో భావనవుంటేగాని యీ కీర్తన అర్థంకాదు. భావదీపిక పూర్తిగా చదివితేగాని నేను చెప్పింది నిజమని నమ్మరు.

**భావ దీపిక :**

దేవీ! నీకు హితవు చెప్పినవారి బుద్ధులు వినవైతివి. వారు చెప్పినట్లు సేయవైతివి. కర్పూరపరిమళభరితమైన నీమోవి (అధరం) వడలిపోయింది సుమా! దువ్వటపు (విలువైన) చంద్రునిరంగు పయ్యెద చెమటతో చిత్తడి అయినది. నీ నాయకునితో నవ్వవద్దన్న నామాటను లెక్కసేయవు. నీ పురుషుని యెదుట వయ్యారముగ పువ్వులు కోయకుమంటే వినవు. మరి అతగానికి, చివ్వమనునట్లు మదనుని బాణములు బలముగా నాటుకోకుండా వుంటాయా? గాఢమైన నిట్టూర్పులు కసిరితే (హెచ్చితే) నీపతితో మాటలాడవద్దన్నా మానవు. అందమైన నీ కొప్పు జారిపోయినప్పుడు, ఆ సరసుడైన నీ రమణునితో మిక్కిలి వాటమైన సరసములు వద్దంటే వినవు. నేను చెప్పితిని కదా! దేవీ! నీవు శరీరంపై అలదిన కుంకుమపూత నీపులకరింతలవల్ల పెల్లైత్తె (పెచ్చులుగా రాలిపోతున్నది). మరి అంత ఆశతో నీప్రాణేశ్వరుని అంటుకోగానే ఇంకేమవుతుందమ్మా? బాసలు చేయుటలో దిట్ట అయిన శ్రీవేంకటేశ్వరునితో పైకొంటే (ఆక్రమిస్తే) మేసుల పరవశము మీదమీదనబ్బె (పరవశత్వం అనుభవంలోకి వచ్చి వెంటవెంటనే కలుగుతుంది) అన్నాను కదా!



సంఖ్య : 251 సంపుటము : 22 పుట: 168 రాగం : నాదరామక్రియ

**33** తగవైనపను లివి తరుణులకెల్లాను
వెగటుగాకుండా నీకు విన్నవించే నిపుడు ॥పల్లవి॥

కొచ్చికొచ్చి చూడవచ్చు కోపగించుకొనరాదు
పచ్చిగాఁ జెనకవచ్చు పదరరాదు
మచ్చిక సొలయవచ్చు మాఁటలు మీఱఁగరాదు
యిచ్చకమెఱిఁగినట్టియిల్లాండ్లకును ॥తగ॥

మనసు సోదించవచ్చు మంకులు నెరపరాదు
పెనఁగులాడఁగవచ్చు బిగియరాదు
కొనగోర నూఁదవచ్చు కుచ్చితము సేయరాదు
యెనసివుండినయట్టి యిల్లాండ్లకును ॥లల॥

బొమ్మల జంకించవచ్చు పొంచి యెగ్గుపట్టరాదు
కుమ్మరించవచ్చు సిగ్గు గునియరాదు
నెమ్మి నలమేల్మంగను నేను శ్రీవేంకటేశుఁడ
యెమ్మెఁ గూడవచ్చు నావంటిల్లాండ్లకును ॥తగ॥ **251**

**మున్నుడి :**

తగవైనపనులంటే తగిన పనులని అర్థం. అన్నమయ్య వినిపిస్తున్న ఈ సరసకీర్తనలో దేవి స్వామితో తనబోటి తరుణులకు యేది తగినపనియో, యేది తగని పనియో వివరిస్తున్నారు. అదికూడా స్వామికి వెగటు కాకుండా వివరిస్తాను వినమంటున్నారు. ఓ శ్రీవేంకటేశుడా! నావంటి ఇల్లాండ్రకు కూడా నీవంటి పురుషోత్తముడు తోడైతే "ఎమ్మెగూడవచ్చు"నట... అంటే?

**భావ దీపిక :**

స్వామీ! ఇవి తరుణులందరికి తగవైన (తగినవైన) పనులు. నీకు వెగటు కాకుండా మిక్కిలి లలితంగా ఇప్పుడు వివరించెదను. తన ప్రియుని ఒకవనిత కొచ్చికొచ్చి (గుచ్చిగుచ్చి) చూడవచ్చును కాని, కోపగించుకొనరాదు. నిర్మొహమాటంగా తాకవచ్చును కాని పదరరాదు (తొందరపడరాదు). చనువుతో సొలయ (పరవశించ)వచ్చును. కాని మాటలు మీరి వాగకూడదు. ఇచ్చకము (పతికి ప్రియమైనదేదో) యెరిగిన ఇల్లాండ్రు ఇలాగే వుంటారు. తనపతి మనస్సు నెఱుగుటకు ప్రయత్నించవచ్చును కాని మొండితనం పనికిరాదు. పతితో పెనగులాడవచ్చును (పోట్లాడవచ్చును) కాని బిగుసుకోరాదు. కొనగోటితో నూదవచ్చు (నొక్కవచ్చును) కానీ నీచముగా గిచ్చరాదు. అణకువతో అతిశయించిన ఇల్లాండ్రకు ఇవే హితము. తన భర్తను కనుబొమలు ముడివేసి బెదరించవచ్చును. కాని పొంచి కనిపెట్టి పతిని తప్పుబట్టరాదు. సిగ్గులు కుమ్మరించవచ్చును కాని గునియరాదు (సణగరాదు). ఓ శ్రీవేంకటేశ్వరా! నేను అలమేలుమంగను. నీవంటి ప్రియుని నావంటి ఇల్లాండ్లు ఎమ్మెన్ (గర్వంతో) కూడవచ్చును.

సంఖ్య : 113 సంపుటము : 22 పుట: 76 రాగం : శుద్ధవసంతం

**34** బలువుకొలఁదియే పో పంతమెల్లాను
వెలిఁ దారుకాణలతో విన్నవించఁగలనా ॥పల్లవి॥

చెక్కే నొక్కితివిగాని చేతిగోర నూఁదితేను
ఇక్కడ నౌఁగాదనేవారెవ్వరు నిన్ను
ముక్కుమీఁది వేలితోడ ములిగేటిదానఁగాక
పెక్కుమాటలాడి నీతోఁ బెనఁగఁగఁగలనా ॥బలు॥

మంచిమాటాడితిగాని మానముపైఁ దిట్టితేను
యెంచి తగవుచెప్పేవారెవ్వరు నీకు
వంచినశిరసుతోడ వగచేటిదానఁగాక
పంచల నీగుట్టులెల్లఁ బచ్చి సేయఁగలనా ॥బలు॥

కాలుదొక్కితివిగాని కడచేఁత సేసితేను
పోలదని యెవ్వరైనా బుద్ధిచెప్పేరా
మేలిమిశ్రీవేంకటేశ మెచ్చఁగూడఁగలఁగాక
వేళవేళఁ గూడఁగానే వేగిరించఁగలనా ॥బలు॥ 113

**మున్నుడి :**

ఈశృంగారకీర్తనలో స్వామి ప్రియురాలై "అబలయైనమాకు పంతంయెలా చెల్లుతుంది? బలముకొద్ది మాత్రమే కదా! పంతముచెల్లేది. తలవంచుకొని నా యేడుపేదో నేను యేడుస్తానేగాని బజారులో నీగుట్టురట్టుజేసి పచ్చిసేయగలనా?" ఇంకా వొక మెట్టు యెక్కి అన్నమయ్య "ఓ శ్రీవేంకటేశ్వరా! మెచ్చగూడ గలగాక, వేళవేళ గూడగానే వేగిరించగలనా?" అనికూడా అన్నదా అన్నులమిన్న.

**భావ దీపిక :**

స్వామీ! పంతమెల్లాను బలువుకొలదియే పో వెలి (నిరూపించుటకు) తారుకాణలు (ఉదాహరణలను) విన్నవించగలనా (చెప్పమంటావా?). నీవు నా చెక్కిలి నొక్కితివిగాని, నీగోరు గీసుకొని గాట్లైతే నిన్ను "ఔగాదనేదెవ్వరు" (తప్పుబట్టేవారెవరు?) ముక్కుమీది వేలితో (ఆశ్చర్యపోయి) ములిగేటిదానినే కాని నోటికొచ్చినట్లు మాటలని నీతో పోట్లాడగలనా?. నీతో నేను అణుకువతో మంచిగా మాట్లాడేదానినేగాని, మర్యాదలేకుండా మాట్లాడితే నీకు ఇది తప్పుఅని తగవు చెప్పేవారెవరు (మంచిచెడు) చెప్పగలవారెవ్వరు? నీవు నన్ను తిట్టినా,నాలో నేను కుమిలిపోతానేకాని, పంచల (బాహాటంగా) నీ గుట్టు బయటపెట్టి నిన్ను పచ్చిసేయగలనా (అవమానించగలనా?). నీవు నన్ను "కాలుదొక్కావు" (పెండ్లాడినావు). కానీ కడచేతసేసితేను (చిన్నచూపు చూస్తే) పోలదని (తగదని) యెవ్వరైనా నీకు బుద్ధిచెప్పగలరా? అసాధ్యం. మేలిమివంటి శ్రీవేంకటేశ్వరా! నీవు మెచ్చుకొనేట్లు నీతో రమించగలనుగాని ప్రతిసారీ కూడమని నిన్ను తొందరపెట్టగలనా? నేను "అబలను" కదా!



సంఖ్య : 110 సంపుటము : 22 పుట: 74 రాగం : పాడి

**35** చెప్పనీవే సుద్దులు చేరి చెక్కు నే నొక్కితే
వుప్పుగప్పురమువలె నొప్పనగావలెను ॥పల్లవి॥

మాననీవే తా నన్ను; మానినా నల్లంతనుండి
సొనఁబట్టేచూపులై నాఁ జల్లకుండేనా
నాననీవే వలపులు; నాకుఁ దనకుఁ గోమటి-
మేరరికమైనట్టు మెచ్చుగావలెను ॥చెప్పు॥

వుండనీవే ఆడనీడ; వుండినా నే నిక్కి చూచి
నిండువెన్నులనవ్వులు నించకుండేనా
పండనీవే కోరికలు పంతాలు తనకు నాకు;
దండ నేళ్లవెంట చాళ్లై తగులఁగవలెను ॥చెప్పు॥

చేయనీవే సన్నలు చేరి నేనేఁ గాఁగిలించి
బాయిటనే తన్నుఁ గొంగుపట్టకుండేనా
యీయెడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
కాయలే పండ్లయినట్టు కతలు గావలెను ॥చెప్పు॥ 110

**మున్నుడి :**

ఈ కీర్తనలో అన్నమయ్య వాడిన సామెతలు బహు చక్కగా వున్నాయి. దేవి తన చెలికత్తె (అన్నమయ్య)తో యేమంటున్నదో వినండి. స్వామిని నాకు కథలు చెప్పవద్దు అనలేను. నావద్దచేరి చెక్కులు నొక్కితే నొక్కనీవే. ఉప్పుకప్పురములవలె అవుతుందా? ఆమాత్రం నిజం తెలుసుకోలేనా? శ్రీవేంకటేశ్వరుడు తనంతట తానే నన్ను గూడెను. కాయలు పండ్లు అయ్యాయంటే, అవి కథలు అనుకుంటానంటే యెట్లా?

**భావ దీపిక :**

చెలియా! నాస్వామి కథలు చెప్పటంలో సిద్ధహస్తుడు. అతగాడు యెన్ని కథలను చెబుతాడో చెప్పనీవే. ఆయన నన్ను చేరి చెక్కిలినొక్కితే ఉప్పుకప్పురం అవుతుందా? నావద్దకు చేరకుండా మాననీవే. మానినా తాను అల్లంతదూరంనుంచైనా పదునుబట్టే చూపులు నాపై చల్లకుండా మానుతాడా? వలపులలో నానితే నాననీవే. తనకూ నాకూ కోమటిమేనరికం (సంబంధం కలుపుకోక తప్పని బలవంతం) సంతోషంగా కట్టబడింది కదా! ఆయన కిష్టమైనవాళ్ళవద్ద, ఆడనీడా (అక్కడా, ఇక్కడా కూడా) వుండనీయవే. ఒకవేళవున్నా నేను నిక్కి చూచినప్పుడు (తొంగిచూస్తే) నిండు పున్నమి వెన్నెల వంటి చిరునవ్వు చిందించకుండావుంటాడా? తన కోరికలు, పంతాలు పండిపోతే పండనీయవే. నాకూ అతనికి అది పరిపాటే. దండనె ఏళ్ళవెంట చాళ్ళవలె (నాగలివెంట నాగలి చాలు అనుసరించిపోక తప్పుతుందా?) అలాగే అతనికీ నన్ననుసరించక తప్పదు. ఆయన దానికెవతికో సన్నలు (సైగలు) చేస్తే చేయనీవే. నేనే చేరి, నా గాఢాలింగనంలో అతగానిని బిగిస్తాను. బాహాటంగా నేనే ఆయనను నాకొంగుకు కట్టివేసికొంటాను. ఇవన్నీ నావూహలే. ఇంతలోనే నాపతి శ్రీవేంకటేశ్వరుడు నన్ను కూడినాడు. కాయలు పండ్లు కాకుంటాయా? నాప్రేమకథ అజరామరం.

సంఖ్య : 591 సంపుటము : 23 పుట: 375 రాగం : ముఖారి

**40 నిలుచున్నాఁ డల్లవాఁడె నివ్వెరగుతో**
**తలఁపెల్లఁ జేకొని దగ్గరవే తరుణి** ॥పల్లవి॥

**తప్పకచూచుచు నట్టె తలఁచు ని న్నాతుమలో**
**పుప్పొడిగా జుంజుకొనఁ బులకించును**
**పుప్పతిల్లువిరహాన వూరకే గోర గీరు**
**దప్పిదేరనిమ్మని దగ్గరవే తరుణి** ॥నిలు॥

**అడుగిడుఁ గాఁకలార అరగంటఁ గెంపు నించు**
**అడవిలోనే తిరుగు నాసోదాన**
**కడువలపులు రేఁచు కందువమాయలు సేసి**
**తడవి నీపతి వాఁడే దగ్గరవే తరుణి** ॥నిలు॥

**సిగ్గులు విడువఁజూచు చిమ్ముల నెనయఁజొచ్చి**
**నిగ్గుదేర నిన్నుఁ గని నెయ్యముతోడ**
**అగ్గమై శ్రీవేంకటేశుఁ డంతలోనె నిన్నుఁగూడె**
**తగ్గక దినము నిట్టె దగ్గరవే తరుణి** ॥నిలు॥ **591**

**మున్నుడి :**

ఇది శృంగారకీర్తన రూపంలో అన్నమాచార్యులవారు వినిపించిన దశావతారకీర్తన. ఎంతో నేర్పుతో సమన్వయం చేసికొంటే కాని ఇది శృంగార కీర్తనలో అంతర్లీనంగావున్న దశావతార వర్ణన అని అర్థంకాదు. ఉదాహరణకి "దప్పిదేర నిమ్మనిదగ్గరవై తరుణి" అనే చరణం పరిశీలించండి. దీనిపైపైన అర్థం తనివితీరేటట్లు చేయమని అతగాని దగ్గరవవమ్మా భామినీ! అని మాత్రమే. కాని లోతుగా ఆలోచిస్తే "సంతృప్తి చెందవయ్యా నృసింహా, అన్ని విధాలా ప్రతికూల పరచి హిరణ్యకశిపుని చంపి నీభక్తుని కాపాడావని యెంతోతృప్తిగా నీతరుణి నీకు దగ్గర అయినదని" అంతర్లీనమైన అర్థం.

**భావ దీపిక :**

దేవీ! అల్లదిగో వాడే నివ్వెరగుతో (సంభ్రమంతో) నీయెదుట నిలిచాడు. బాగా ఆలోచించి అతనికి దగ్గరై ఆనందించవమ్మా తరుణీ!. తరుణీ! తప్పకచూచుచు (భీతిల్లిన చూపులు చూస్తూ) నిన్ను అతడు తలుచుకొంటాడు. **(చేప చూపులు, మత్స్యావతారం).** పుప్పొడిలా జుంజుకొను (అంటుకుపోతే) పులకిస్తాడు. **(గట్టిగా పట్టుకొని వదలనిది కూర్మావతారం).** ఉప్పతిల్లు విరహానవూరకే గోళ్ళతో గీరుతుంది ఆ వనిత. **(గీరుతూ నేలను తవ్వేది సూకరము, వరాహావతారము),** దప్పిదేర నిమ్మని దగ్గరవే (తనివితీరేటట్లు దగ్గర అవవే). **(సంతృప్తితో ప్రహ్లాదుని దగ్గర తీసికొనిన నృసింహుడు).** తరుణీ! అడుగిడు కాఁకలార (తాపము తీర్చుటకు రావమ్మా!) **(లోకములబాధ తొలగగా అడుగుపెట్టు, వామనావతారము).** అరగంట కెంపునించు (ఓరచూపులు నిప్పులు కురిపిస్తున్నాయమ్మా!) **(కంజదళాక్షుడైన వాడు పరశురాముడు).** అడవిలోనే తిరుగు నాసోదాన (నీపై ఆశతో దారితప్పి తిరుగుతాడమ్మా!) **(ఆశతో సీతకోసం అడవులు తిరిగిన శ్రీరామచంద్రుడు).** కందువ మాయలుసేసి కడు వలపురేఁచు. (ఎన్నో మాయలుచేసి వనితలను వలపిస్తాడు **(గోపీలోలుడైన శ్రీకృష్ణుడు).** తడవి (విచారిస్తే నీపతి అతడేనమ్మా! దగ్గర చేరవమ్మా!). **తరుణీ!** నిన్ను చూడగానే సిగ్గులుకూడా వదలివేస్తాడు. **(త్రిపురాసురుల వనితలమానము దోచిన బుద్ధావతారము).** చిమ్ములనెనయజొచ్చి (చెలరేగిపోయి) **(కల్కి అవతారం).** నిగ్గుదేర (కాంతివంతమైన) నిన్నుజూచి ప్రేమతో అగ్గమై (నీ అధీనమైన) శ్రీవేంకటేశ్వరుడు ఇతడు. అంతలోనే నిన్ను గూడినాడమా! తల్లీ! నీవు కూడా యేమాత్రం తగ్గక అతనికి దగ్గరకావమ్మా!



సంఖ్య : 236 సంపుటము : 22 పుట: 158 రాగం : లలిత

**37 కంటి మిదె మిమ్మిద్దరిఁ గన్నులపండుగలాయ**
**జంటనున్న చెలులము సారెఁ బొగడేమే** ॥పల్లవి॥

**చెంతనుండి నాయకుఁడు చెప్పినట్టు సేసితేను**
**ఇంతులు సేసినభాగ్య మేమిచెప్పేదే**
**వింతలేక యేపొద్దు వెస మాటలాడితేను**
**సంతోసాలకు మరి సరిగలదటవే** ॥కంటి॥

**మమకరించి మగనిమన్నన గలిగితేను**
**రమణులు సేసినదే రాజ్యమాయనే**
**సమరతి మనసులు సరిఁ దులఁదూఁగితేను**
**కొమరెపాయములకు గురుతెట్టు వెట్టేమే** ॥కంటి॥

**పతియైనతఁడు తమపక్క వాయకుండితేను**
**సతులు సేసిననోము సమకూడెనే**
**ఆతఁడు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు**
**తతిఁ గూడితిరి మీతలఁపు లీడేరెనే** ॥కంటి॥ **236**

**మున్నుడి :**

అన్నమయ్య దేవి చెలికత్తెయై దేవి భాగ్యాన్ని పొగడుతూ యేమంటున్నారో వినండి. ఇదిగో మా కన్నులపండుగవలె మిమ్మిద్దరినీ కంటిమి. మేము నీ జంటనున్న చెలులము. పలుమార్లు మిమ్ము పొగడుదుమమ్మా! భర్త అయినవాడు తమపక్కమీద కలిసివుండాలికాని యెన్నడూ విడిచివుండరాదు. ఆ భాగ్యము కూడా సతులు చేసికొనిన మంచి నోముల ఫలమేనని గ్రహించవమ్మా. ఏదియేమైనా మీ తలపు లీడేరినవిలే అంటున్నారు.

**భావ దీపిక :**

దేవీ! చెలులమైనమేము, ఇదే కంటిమి. కలిసియున్న మీఇరువురూ మాకన్నుల పండుగ వలెనున్నారు. అదిచూచి మేము మిమ్ము ప్రతిసారి పొగిడేమమ్మా! తమ నాయకుడు తమ చెంతనే వుండి చెప్పినట్లు చేస్తే ఆ ఇంతులు చేసిన భాగ్యమేమని చెప్పేదమ్మా? ఏవేళనైనా విడ్డూరమేమాత్రం లేక ప్రీతితో మాట్లాడితే ఆ తరుణి సంతోషాలకు హద్దు వుంటుందా? మరి ఇక దానికి సాటి వుంటుందా? మమకరించి (మమకారము జూపి) తన మగని మన్నన పొందగలిగితే అట్టి రమణులది ఇష్టారాజ్యమే కదా! మనస్ఫూర్తిగా పతితో సమరతి తులతూగితే ఆ కౌమారప్రాయమునకు గుఱుతు (వంక) యెట్లుపెట్టగలమే? సతులు నోచిన నోములు యెప్పుడు ఫలించాయంటారో చెప్పనా? ఆమె పతియైన వాడు ఆమె పానుపు నెన్నడూ వదలరాదు. అప్పుడు దేవీ! నీవు అలమేలుమంగవు, అతడు శ్రీవేంకటేశ్వరుడు. మీరిరువురూ తమకముతో గూడినారు. మీతలపులీడేరినవమ్మా!

సంఖ్య : 182 సంపుటము : 22 పుట: 122 రాగం : లలిత

**38** ఒక్కమనసున నిట్టె వుండఁగదవే
చెక్కిటఁ జేయివెట్టక సింగారించుకొనవే ॥పల్లవి॥

విన్నపాలు విన్నవాఁడు వేగ నింటికి వచ్చీనే
కన్నుల నవ్వినవాఁడు కరుణించీనే
సన్నలుసేసినవాఁడు సరసములాడీనే
యెన్నఁగరానిసగినాలు యెందాఁక జూచేవే ॥ఒక్క॥

కానుకందుకొన్నవాఁడు కడు నిన్ను మన్నించీనే
పూనికెతిఁగినవాఁడు బుజ్జగించీనే
తానే ఇయ్యకొన్నవాఁడు తగిలి కాఁగిలించీనే
తానకమై సగినా లెందాఁకాఁ జూచేవే ॥ఒక్క॥

విందులియ్యకొన్నవాఁడు వేడుక నీకుఁ జేసీనే
చెంది వాకిట నున్నవాఁడు చేరి నవ్వీనే
అందపుశ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
ఇందుల నిన్నేలె సగినా లెందాఁకాఁ జూచేవే ॥ఒక్క॥ **182**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ కీర్తనలో దేవి ఆంతరంగిక చెలికత్తెయై ప్రియసమాగమనానికి శుభశకునం చూద్దామనుకొంటున్న ఆమెను మందలిస్తున్నారు. మీ శ్రీవారితో మనసుకలసిన మగువయై సుఖించవే. చెక్కిట చేయిజేర్చి, సింగారించుకొనవే అని బోధిస్తున్నారు. ఆయన అందాల శ్రీవేంకటేశుడు, నీవు ఆయన దేవేరి అలమేలు మంగవు. ఆయనే నీకు చేరువవుతుంటే... శకునాలు యెందాకా చూస్తావమ్మా? అని అంటున్నారు.

**భావ దీపిక :**

దేవీ! నీ విభునితో ఒక్కమనసున (కలిసిన మనస్సుతో) వుండగదవే (ఉండవమ్మా!) నీ చెక్కిట చేయి జేర్చక చక్కగా సింగారించుకొనవమ్మా! నీవిన్నపాలు వినినవాడు త్వరగా ఇంటికి రాడా? కన్నులతోనే నవ్వినవాడు కరుణించడా? ఇంతకాలం నీకు సైగలు చేసినవాడు నీతోతప్పక సరసములాడేనమ్మా! లెక్కపెట్టలేనన్ని శుభశకునాలు యెందాకా చూస్తావమ్మా. నీవు పంపిన కానికలు (బహుమతులు) అందుకొనినవాడు, నిన్ను మన్నించడా? నీపూనిక (తపన) యెరిగినవాడు, నిన్ను బుజ్జగించడా? తానే ఇయ్యకొన్నవాడు (సమ్మతించినవాడు) నీకు చేరువయై కౌగలించడా. తానకమై (సరిపోయిన) శకునాలు వున్నవి కదా! ఇంకా యెందాకా చూస్తావే? దేవీ! నీవిందుకు అంగీకరించినవాడు నీకు వేడుక జేయక వుంటాడా? అదిగో, నీవాకిట వేచియున్నాడు నీతో చేరి నవ్వకుండా వుంటాడా? ఆయన అందమైన శ్రీవేంకటేశ్వరుడు. నీవు దేవేరి అలమేలుమంగవు. ఇక్కడే నిన్ను యేలుకుంటాడు. అయ్యో! ఇంకా సగినాలు (శకునాలు) యెంచెదవేల తల్లీ!



సంఖ్య : 155 సంపుటము : 22 పుట: 104 రాగం : శ్రీరాగం

**39** నీమహిమో నాలోన నిండినవలపుజాడో
యేమిసేతు నన్నెప్పుడు నెడయకువయ్యా ॥పల్లవి॥

యెనసి నీతో నేను యెంతవడి మాటాడినా
తనియదు నామనసు తమి యెట్టిదో
వినయముతో రెప్పలువేయక చూచినాను
నినుపులై మమతలు నిచ్చ కొత్తలు ॥నీమ॥

చలపట్టి నీతోను సారెసారెఁ బెనఁగిన -
నలయదు నామేను ఆస యెట్టిదో
కొలువులో నీవద్దఁ గూచుండి యెంతనవ్విన
తలఁపులో కోరికలు తరగనిధాన్యాలు ॥నీమ॥

కడఁగి యందాఁకా నిన్నుఁ గాఁగిలించుకుండినాను
విడువవు చేతులు వేడుకెట్టిదో
అడరి శ్రీవేంకటేశ యలమేల్ మంగను నేను
తొడరి యేలితివి రతులు తరితీపులు ॥నీమ॥ **155**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన యీ శృంగారకీర్తనలో దేవి స్వామిని యెట్లా వేడుకొంటున్నదో ఆలకించండి. “స్వామీ! నేనేమి చేయాలో అర్థంకావటం లేదు. ఇది నీ మహిమో లేక నాలోన నిండిపోయిన నీవలపు సంకేతమో తెలియదు. ఏదియేమైనా నన్నెప్పుడూ యెడబాయకుమయ్యా”! అని అభ్యర్థిస్తున్నది. “ఎంత వేడుకయో చెప్పలేను కాని ఎంతసేపు నిన్ను కౌగలించినా నాచేతులను, నిన్ను వదలండే అంటే నన్నుకూడా అవి లెక్కచేయటంలేదు స్వామీ!” అనివాపోతున్నది దేవి. అన్నమయ్య కీర్తన “అఖిలం మధురం”

**భావ దీపిక :**

స్వామీ! నాలోని యీమార్పులు నీ మహిమవలన జరుగుతున్నాయో, లేక నాలో నీపై నిండిన వలపు యొక్క జాడయో (విధానమో) నాకు తెలియుటలేదు. నేనేమి చేతును. ప్రభూ! నన్నెప్పుడు విడనాడకుమయ్యా! ప్రభూ నేను అతిశయించి నీతో యెంతసేపు మాటలాడినా నామనసు తనియదు (తృప్తిచెందదు). నాకు గల తమి (వలపు) యెట్టిదో కదా! నీ మాటలు వింటూ నేను కనురెప్పలనార్పుట మరచిపోతాను. అట్లే చూస్తాను. నీపై నిండిన నా వలపులు నిత్యనూతనములు. దేవా! చలపట్టి (పంతముతో) నేను నీతో పెనగినా, ప్రతిసారి నా శరీరం అలసిపోదు. నాఆశ యెంతబలమైనదో కదా! నీకొలువుకూటమిలో నేను నీ పక్కనే కూర్చొని యెంత నవ్వినా నా తలపులో నీపై కోర్కెలు తరగని ధాన్యరాసివంటివి. ప్రియా! కడగి (యత్నించి) నిన్ను నేను యెంతదాకా కౌగలించినా నాచేతులు విడివడవు. మరి నావేడుక యెట్టిదో కదా! అతిశయించిన ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నీ అలమేలుమంగను, తొడరి (అనుసరించి) నన్ను నీవు యేలితివి. నీ తరితీపులు (వలపులు) యెట్టివో కదా!

సంఖ్య : 475 సంపుటము : 23 పుట: 315 రాగం : కాంబోది

**44 తొలుతనే మంకువారు దొడ్డివారు**
**చలములు సాదించితే జడుతురా చెలులు** ॥పల్లవి॥

**సిగ్గువడి యుండఁగాను చెలి యలిగెనంటాను**
**యెగ్గులువట్టి తిట్టేవు యేమయ్యా**
**తగ్గక నీచేసినచేఁతలూఁగాక అందుమీఁద**
**వెగ్గళించితేఁ జెలులు వెఱతురా యిపుడు** ॥తొలు॥

**పవ్వళించి వుండఁగాను పడఁతి మాటాడదంటా**
**ఇవ్వల రవ్వసేసే వేమయ్యా**
**కువ్వలై నీమేనిమీఁద గురుతులూ నుండఁగాను**
**జవ్వనాన జంకించితే సైఁతురా ఇందుకు** ॥తొలు॥

**పట్టి కాఁగిలించుకోఁగా బలిమిసేసీనంటా**
**ఇట్టునట్టుఁ బెనఁగేవు యేమయ్య**
**గుట్టున శ్రీవేంకటేశ కూడితివి మగువను**
**వెట్టికిఁ గొసరితేను విడుత(తు?)రా పంతము** ॥తొలు॥**475**

**మున్నుడి :**

"దొడ్డివారు" అంటే గొల్లవారు అని అర్థం. అనాదిగా గొల్లవారు కాళిదాసు పూర్వాశ్రమంలో వలె మొండివారు. మంకుతనం వారికి వెన్నతోపెట్టిన విద్య. అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో కృష్ణుని వలచిన గోపిక యేమంటున్నదో వినండి. స్వామీ! మొదటినుంచి దొడ్డివారమైన మేము మొండివారము. ఆ చెలులతో పట్టుదల సాధించాలనుకొంటే భయపడతారటయ్యా? ఇది ఇంతటితో ఆగదు.

**భావ దీపిక :**

స్వామీ! తొలుతనే (అనాదిగా) మా దొడ్డివారు (గొల్లవారు) బహు మంకువారు (మొండివారు). అందులోను మేము చెలులము. మాతో చలములు సాధించితే (పంతాలు చూపిస్తే జడుతురా (బయపడతామా?). ఏమయ్యా! సిగ్గుపడుతున్న చెలిని చూచి నీవు అలిగినదని భావించి ఆమె యెగ్గులు (తప్పులు) పట్టి తిడుతున్నావు. ఏమాత్రం తగ్గక నీవు చేసిన పనులే కాక దానిమీద, వెగ్గళించితే (తిరస్కరించితే) నీవు ఇప్పుడు గొల్లతెలైనా చెలులు భయపడతారటయ్యా?. ఏమయ్యా! అలిసిపోయిన పడతి పవ్వళించి వుంటే, నీతో మాట్లాడటంలేదని ఈవిధంగా రవ్వసేసేవు (రభస చేస్తున్నావు). కువ్వలైన (అసంఖ్యాకమైన) గుర్తులు నీవొంటిమీద కనబడుతుంటే, జవ్వనాన (యౌవనమదముతో) నీవు జంకించితే (బెదిరించితే) ఇందుకు చెలులు సైతురా (సహిస్తారా?). ఏమయ్యా! నిన్ను పట్టుకొని ఒక చెలి కౌగలించుకుంటే, నిన్ను బలవంతం చేస్తున్నదని అటూ ఇటూ పెనగులాడుతున్నావే? నీవు ఆమెను రహస్యంగా కూడలేదా? వేంకటేశ్వరా! నీవు మగువను వెట్టికి కొసరితే (పూరకనే ఇంకా ఇంకా కావాలంటే) మా దొడ్డివారు పంతము విడుస్తారనుకొన్నావా?



సంఖ్య : 21 సంపుటము : 23 పుట: 175 రాగం : గుండక్రియ

**41 ఇది యేఁటిదయ్యా యెంతసేసితివి నీవు**
**చెదరనిదయతో విచ్చేయవయ్య యింటికి** ॥పల్లవి॥

**చెలులతో యేమని చెప్పింపితివి**
**యెలమి నానవాలు యేమిచ్చితివి**
**కులికి యేమని యాసకొలిపితివి**
**చెలిని మన్నింతువు విచ్చేయవయ్య యింటికి** ॥ఇది॥

**చెప్పరానిసన్న లేమి సేసితివి**
**తప్పకేల కొనగోరఁ దాఁకించితివి**
**చొప్పుగా నేమని నీమోవి చూపితివి**
**చిప్పిలఁ గూడుదువు విచ్చేయవయ్య యింటికి** ॥ఇది॥

**నావద్దనుండాపె నెట్టు నవ్వించితివి**
**యేవిధానఁ దొల్లేమని యేలుకొంటివి**
**శ్రీవేంకటేశ మాయింతిఁ జేరి కూడితి**
**సేవగొందువు మాచే విచ్చేయవయ్య యింటికి** ॥ఇది॥**216**

**మున్నుడి :**

ఈ శృంగార కీర్తనలో అన్నమయ్య స్వామికి ప్రియురాలై మా ఇంటికి విచ్చేయవయ్యా! అని అభ్యర్థిస్తున్నారు. నేటి భాషలో చెప్పాలంటే "ఇదేమిటయ్యా? నీవు యెంతపని చేశావు? నాపైన చెదరని దయతో మా ఇంటికి రావయ్యా!" అని అన్నది. ఇంతసేపు నావద్దనే వున్నావు కదా! ఇంతలోనే ఆమెను (దేవిని) యెట్లా నవ్వించావు? నాకంటే ముందే ఆమెను యేవిధాన యేలుకొన్నావు? అని, పోనీలే మాసేవ గొందువుగాని మా ఇంటికి రావయ్యా! అంటున్నారు.

**భావ దీపిక :**

స్వామీ! ఇదేమిటయ్యా! నీవు యెంత సేసితివి? ఇకనైనా చెదరని (అవిచ్ఛిన్నమైన) దయతో మా ఇంటికి విచ్చేయవయ్యా!. నీవు నా చెలులతో యేమని ఆనవాలు యిచ్చితివి? కులికి (మిక్కిలి సంతోషముతో) యేమని ఆశపెట్టావు? మా చెలిని మన్నింతువుగాని, రావయ్యా!. నీకు గుర్తులేదా, ఇదివరలో మా చెలికి యెన్నిసైగలు చేసినావు!! నీకొనగోరు తాకించి ఆమెను యెంత నొప్పించితివి!!! ఏమని నీవు చొప్పుగా (తగినట్లు) నీ అధరమును చూపితివి? ఇకనేమి? అతిశయించి కూడెదవు ఇచ్చటకు త్వరగా విచ్చేయవయ్యా!. నావద్దనే వుండికూడా ఆమె (దేవి) నెట్లు నవ్వించితివయ్యా. తొల్లే (ఇదివరకే) ఆమెను యేవిధముగా యేలుకొంటివయ్యా. ఓ శ్రీవేంకటేశ్వరా! మా ఇంటివద్దకు చేరి కూడితివి. ఇకనైన నాసేవ స్వీకరింతువుగాని, మా ఇంటికి విచ్చేయవయ్యా!

సంఖ్య : 456 సంపుటము : 23 పుట: 305 రాగం : సామంతం

**42** తగునయ్య నీకిన్నియు దైవపురాయ
మొగమునఁ గళనిండె మోహనరాయా ॥పల్లవి॥

మీఱుచు మాటలాడి మెలుఁత చెక్కులవెంట
జాఱించితిగా చెమట జాణరాయ
ఆఱడిమాఁటలాడి అట్టె పట్టి నీవు
చూఱగొంటివిగా సిగ్గు సుగుణ(డ)రాయ ॥తగు॥

మంతనాన నవ్వుతానే మర్మములు గరఁగించి
వింతలు సేసితివిగా విటరాయ
అంతలోనే పైకొని అధరపుఁదేనె లిచ్చి
చెంతఁ జొక్కించితివిగా చెలువరాయ ॥తగు॥

పులకలు పెడరేఁచి పొందులెల్లాఁ జేసి యీకెఁ
జెలరేఁగించితివిగా సింగారరాయ
బలురతుల నోలార్చి పలుమారు మన్నించి
చిలికితివిగా మేలు శ్రీవేంకటరాయా ॥తగు॥ 456

**మున్నుడి :**

ఈ కీర్తనలో శృంగారరాయుడైన శ్రీనివాసుని అన్నమయ్య యెన్ని పేర్లతో పిలుస్తున్నారో వినండి. దైవపురాయ, మోహనరాయ, జాణరాయ, సుగుణరాయ, విటరాయ, చెలువరాయ, సింగారరాయ అని శ్రీవేంకటరాయుని సంబోధిస్తూ కీర్తిస్తున్నారు. "బలురతుల నోలార్చి పలుమారు మన్నించి చిలికితివిగా మేలు శ్రీవేంకటరాయా!" అనగల "దమ్ము" పదకవితా పితామహుడికి కాక ఇంకెవరికుంటుంది చెప్పండి. ఇంతకీ "రాయా"! అంటే యేమిటో తెలుసా? "రాజా"! అని అర్థం.

**భావ దీపిక :**

స్వామీ! దేవతలందరికీ అధినాయకుడవైన నీకే ఇన్నియు (ఈ బిరుదులన్నీ) తగునయ్యా! నీవు "దైవపురాయ" అని పిలువదగిన, మోహనరాయుడవు. ఎందుకంటే, నీమొగమున కళలన్నీ నిండినవి కదా! అతిశయముగా మాటలాడి, మెలుతల (వనితల) చెక్కిళ్ళవెంట చెమటలను జారించగల నిన్ను "జాణరాయా!" అని పిలువక తప్పదు. రండగొండి మాటలతో బలవంతాన సిగ్గులు చూరగొనే నిన్ను "సుగుడరాయా" (సరసుల్లో శ్రేష్ఠుడు) అనక తప్పదు కదా!. మాతో మంతనాన (యేకాంతమున) నవ్వులొలికిస్తూనే మా "మర్మము"లను ద్రవింపజేయు నిన్ను మేము ఇంతచేసితివి గదయ్యా "విటులమహారాజా" అంటే నీకు తగిన బిరుదే కదా! చూస్తుండగానే ఆక్రమించి వనితల అధరామృతం జుర్రుకొని పరవశింపజేసే నిన్ను మేము "చెలువరాయా" (అందగాడా!) అంటే తగును కదా!. ఈకె (ఈదేవికి) పులకరింతలు అతిశయించగా పొందులు జేసి చెలరేగించిన నిన్ను "సింగారరాయా" (శృంగారసీమ యేలిక) అనక యేమనను ప్రభూ?. పెక్కు రతుల నోలలాడించి పలుమార్లు మన్నించి ఆమెకు యెంతో మేలు జేసిన నీవు అలమేలుమంగపతియైన "శ్రీవేంకటరాయా' అనక యేమనగలను తండ్రీ!



సంఖ్య : 477 సంపుటము : 23 పుట: 319 రాగం : నాదరామక్రియ

**43** మెత్తనిమనసుదాన మిక్కిలి నేనూ
హత్తి నీవాడినట్టెల్లా నాడేనయ్యా ॥పల్లవి॥

యిప్పటినీనవ్వు లివి యెన్నిటికైనావచ్చు
వుప్పటించనోప నూరకుండవయ్యా
దప్పిదేరె నిన్నుఁజూచి దయవుట్టీ నంతలోనె
చెప్పేటిప్రియాలు నాకే నెలవాయనయ్యా ॥మెత్త॥

రొక్కపునీమాటలు రొంపిలోనికంబాలు
యెక్కడికెక్కడ మరి యెందాఁకానయ్యా
మొక్కేటినీవేసాలకు మొగమోట గనమాయ
మక్కువనీచేఁతలు సమ్మతైనట్టే అయ్యా ॥మెత్త॥

కందువనీరతు లివి కట్టినమంచిచద్దులు
చెంది నిన్నుఁ గూడితి తనిసితినయ్యా
అందపు శ్రీవేంకటేశ ఆసవుట్టీఁ గమ్మటిని
చందపునీమోవిలోనే చలి(వి)గొంటినయ్యా ॥మెత్త॥ 477

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార సంకీర్తనలో దేవి శ్రీవేంకటేశుని వేడుకొంటున్నది. అత్యద్భుతమైన ఉదాహరణలతో ఈ కీర్తన దేవి సున్నితమైన మనస్సుకు అద్దం పడుతున్నది. ఆమె యేమంటున్నదో వినండి. స్వామీ! నేను మిక్కిలి మెత్తని మనస్సు వున్నదానను. పొందికగా నీవు చెప్పినట్లుగా ఆడేదానను నేను. అందగాడివైన తిరుమలేశా! ఆశ పుట్టుటవలన నేను చక్కటి అధరామృతము నాసించి చవిగొంటినయ్యా! అని నచ్చచెబుతున్నది.

**భావ దీపిక :**

స్వామీ! నేను అతిమెత్తని మనస్సున్నదానను. హత్తి (పొందికగా) నీవు ఆడినట్లే (చెప్పినట్లే) నేను చేసితినయ్యా! ప్రభూ నీవు వూరకుండరాదా? ఇప్పటి నీ నవ్వులు, యెప్పటికైనా నీకు పనికి వస్తాయి. పైగా వుప్పటించనోపను (ఓర్వలేక వాగేదానను) అంతేనా? నిన్ను జూచి దప్పి దీరినది (తృప్తి కలిగింది). అంతలోనే నీకు నాపై దయ పుట్టి నీవు నాకు చెప్పే శుష్కప్రియాలు నీకే సెలవాయనయ్యా! (ఉపయోగపడాలయ్యా!). నీ రొక్కపు మాటలు (ఆచితూచి ఆడిన మాటలు) బురద మెత్తిన స్తంభములు (జారిపడిపోవటం తథ్యం). నీవెక్కడా మేమెక్కడా? మరి మన సయోధ్య యెందాకానయ్యా? మాటమాటకు మొక్కే నీ వేషాలు చూస్తుంటే నీకు మొగమాటం కూడా లేదనిపిస్తున్నది. అయినా నీ చేతలు మక్కువపెంచి సమ్మతైనట్లే వుంటాయయ్యా!. దేవా! నీ కందువరతులు (ఏకాంతపు కూటములు) మూటకట్టి వెంటతీసికొనివెళ్ళే చద్దిమూటలు. నీదాననై నిన్నుగూడి తృప్తిచెందితినయ్యా! అందమైన శ్రీవేంకటేశ్వరా! కమ్మటి నీమధురాధరముపై ఆశపుట్టి చవిగొంటినయ్యా!

సంఖ్య : 455 సంపుటము : 23 పుట: 304 రాగం : పాడి

**48** నీకంటేఁ జలమరి నెలఁతకుఁ జెప్పరాదు
దాకొని నీవు నవ్వితే తానే కాఁగిలించీని ॥పల్లవి॥

పయ్యదమీఁద నీవు పన్నీరు చల్లఁగాను
వొయ్యనే లోలోనే తిట్టె వువిద నిన్ను
కయ్యమడిచీ నిందుకుఁగా కాఁకలఁ బొరలనేల
వుయ్యాలపైకి రారాదా వొక్కటిసేసేను ॥నీకం॥

పువ్వుల చెండునఁగొని పూఁచి నీవు వేయఁగాను
జవ్వని బొమ్మల నిన్ను జంకించెను
అవ్వల నిందుకుఁగాను అసురసురననేల
పవ్వళించరాదా వద్ద పంతాలు దిద్దేను ॥నీకం॥

శ్రీవేంకటేశ నీవు చెలిగుబ్బ లంటఁగాను
కావరించి యాకె మోవి గంటిసేసేను
చేవదేర నిందుకుఁగా సిగ్గగలువడఁగనేల
భావించి కప్రమీరాదా బత్తి నేఁజూపేను ॥నీకం॥ **455**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో ఆయన స్వామికి ప్రియసఖివలె, దేవి ప్రణయ కోపము పోవాలంటే యేమిచేయాలో సూచిస్తున్నారు వినండి. స్వామీ! ఆమె నీకంటే పంతముగల చిన్నది. ఆమెకేమి చెప్పగలం? దగ్గరచేరి నీవు వొకసారి నవ్వితే తానే నిన్ను కౌగలించుకొంటుంది. అని మరెన్నో కిటుకులు ప్రబోధిస్తున్నారు. స్వామికి తెలియదని కాదు. మనబోటి వారికి తెలియవని.

**భావ దీపిక :**

స్వామీ! నీకంటే చలమరి నెలతకు (మొండి ఆడుదానికి) చెప్పరాదయ్యా! దాకొని (ఆమెదగ్గరచేరి) నీవు నవ్వితే చాలు. తానే నిన్ను కౌగలించుకొంటుందయ్యా!. నీవు ఆమె పయ్యెదపై పన్నీరు చల్లి తడిపివేస్తే ఒల్లనే (ఒద్దంటూ) ఆ వువిద (పడతి) తన లోలోన తిట్టుకొన్నది. కొద్దిగా పోట్లాడింది. సరే! ఇందుకుగాను కాకలబొరలనేల (కోపం తెచ్చుకోవటం దేనికయ్యా). ఆమె వూగుతున్న ఊయల మంచంపై చేరుకోరాదా? ఒక్కటి కారాదా?. నీవు ఒక పూలచెండును తీసికొని ఆమెపై వేస్తే ఆ జవ్వని తన కనుబొమలను కదలించి నిన్ను జంకించింది (బెదిరించింది). అటుపిమ్మట ఆ మాత్రందానికి నీవు అసురుసురననేల (ఉస్సూరుమని డీలాపడిపోనేల?) ఆమెవద్దనే పవ్వళించరాదా? పంతాలు దిద్దుబాటు అయితీరుతాయి స్వామీ! ఇంకా యేమి చెప్పనయ్యా! ఓ శ్రీవేంకటేశ్వరా! నీవామె చనుగవనంటితే, కసికొద్దీ నీ అధరం రుధిరం చేసింది. ఇంతమాత్రానికే సిగ్గులు పడగనేలనయ్యా? ఇదే తరుణమని కర్పూరతాంబూలమియ్యరాదా? నీమీద భక్తినే చూపిస్తుందయ్యా! ఆమె యెవరు, నీదేవేరి.



సంఖ్య : 476 సంపుటము : 23 పుట: 315 రాగం : శంకరాభరణం

**45** వేగిరమేలా వేయనీవోలా
ఆగతులెల్లాను అయ్యీఁగావి ॥పల్లవి॥

వలవనిజోలి వలపువిరాలి
యెలమిని జరపే వేమిటికి
తెలిసితి నేనూ దిష్టముగాను
చెలిమి నిజమయితేఁ జెప్పేఁగాని ॥వేగి॥

గరివడ్డపెసరు కందువకొసరు
యెతిఁగినపనులే యేమిటికి
గుతియాయ నాకు గుదిగొన్నకాకు
తతి వచ్చినప్పుడే తలపించేఁగాని ॥వేగి॥

కొండలనునుపు గొనకొన్ననుపు
యెండలు నీడలు యేమిటికి
అండనె శ్రీవేంకటాధిప నన్నేలితివి
పండుమోవి తేనె పరపేఁగాని ॥వేగి॥ **476**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తన నాకు ఒకపట్టాన మింగుడు పడలేదు. మిక్కిలి శ్రమపడ్డాక నాకు ఈవిధంగా తోచింది. తప్పులు దొర్లితే క్షంతవ్యుడను. దేవి స్వామితో దెప్పిపొడుపుగా ఇలా అంటున్నది. స్వామీ! తొందరపడతావెందుకు? ఎన్ని నిందలు వేయాలో వెయ్యవయ్యా! నీవు చేసే ఆ విధానాలన్నీ యెట్టిటి మరకలు మాదిరిగా స్పష్టమవుతూనే వున్నాయి. అయినప్పటికి నేను చెప్పేది కాస్త చెవినిబెట్టు. నీ అరుణాధరముల మధురిమ విరివిగానయ్యేట్లు అనుగ్రహించు, నన్నేలేవేంకటవిభుడివి కదా!

**భావ దీపిక :**

స్వామీ! వేగిరమేలా? (తొందరెందుకు?) నీవు ఓల (నెపము) వేయదలచుకొంటే వెయ్యవయ్యా!. ఆగతులెల్లా (సంగతులన్నీ) కావి అయ్యీ (ఎఱ్ఱగా స్పష్టమేలే!). నేనొకమాట చెబుతాను వినవయ్యా! వలవని జోలి (ప్రేమ కరువైన సంబంధం) వలపువిరాళి (వలపుతో కూడిన వినయం) పొసగుతాయా? అతిశయించి రెంటినీ నాతో జరుపుటెందులకు? నేను దిష్టముగా (తేటతెల్లంగా) తెలిసితినయ్యా! నాతో నీ చెలిమి నిజమైనదైతే నాతో చెప్పకుండా దాస్తావా? గరివడ్డపెసరు (నేలపాలైన పెసలు), కందువకొసరు (కపటియైనవాడు వేసిన కొసరు) యెక్కడైనా విన్న సంగతులటయ్యా? యేమిటి వుపయోగం? నాకు గుదిగొన్న కాకు (మెండైన చీకాకు) గుతియాయె (తగులుకొన్నది). తతి వచ్చినప్పుడే తలపించీ గాని (నీకుఅవసరమొస్తేనే గుర్తుకు వస్తాను, అంతేనా?). అంతెందుకు స్వామీ! దూరపుకొండలు నున్నగా కనుపించినా నునుపా? అతిశయించిన అనురాగము స్థిరముగా వుండాలికాని ఎండా నీడల్లాగా మారిపోతూ వుంటే లాభమేమి? నాకు దాపైన శ్రీవేంకటేశ్వరా! నీవు నన్నేలితివి. నీ ఎట్టిటి మధురాధరము తేనె పరపేగాని (తేనెలూరక మానునా?)

సంఖ్య : 560 సంపుటము : 23 పుట: 374 రాగం : సాళంగనాట

**46 కూరిమి నెక్కవయ్య నాకుచదుర్గాలు**
**యేరీతినైనా వారి నేమనఁగఁగలవు ॥పల్లవి॥**

**యేతల చూచినా సతులెందరైనా నుండఁగాను**
**నాతోనే సారెసారె నవ్వు నవ్వేవు**
**కాతరించి వారెల్లా నొక్కటై దొమ్మిసేసితేను**
**యేతులుమెరసి నీవు యేమనఁగఁగలవు ॥కూరి॥**

**కుచ్చినట్టు యిందరూ నీకొలువుసేయఁగాను**
**మచ్చికసేసి నాతోనే మాటలాడేవు**
**పచ్చిగా నందరు నిన్ను బలిమిఁ బైకొంటేను**
**మెచ్చి నీవింతటిలోన యేమనఁగఁగలవు ॥కూరి॥**

**ఆసపడినసవతులు అంటి సేవలుసేయఁగా**
**లేసులకు నన్నుఁ గాఁగిలించి కూడేవు**
**వాసితో శ్రీవేంకటేశ వారు సేసలు వెట్టిరి**
**యీసరికే వచ్చి రిఁక నేమనఁగఁగలవు ॥కూరి॥ 560**

**మున్నుడి :**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ శృంగార సంకీర్తనలో ఆయన ఒక ప్రేయసియై స్వామితో యెత్తిపొడుపుగా యేమంటున్నారో వినండి. అందరికీ నీవేకావాలి. ఎక్కడచూచినా నీ వలపుకత్తెలే. వాళ్ళంతా కుత్సితం పెరిగి నీకొలువులో వుండగానే నీవు నన్ను మచ్చిక చేసికొని నాతో మాట్లాడితే వాళ్ళు నిన్ను బలాత్కరించబోతున్నారు. వాళ్ళనేమని నిందించను? శ్రీదేవి భూదేవి నీసేవలు చేస్తున్నా నీవు నన్ను కౌగలిస్తే అది నా తప్పా? చివరికి నీవు తలంబ్రాలు పోసింది మాత్రం ఆ ఇద్దరికే. మరి నేనేమనగలనయ్యా? – అంటున్నారు.

**భావ దీపిక :**

స్వామీ! కూరిమితో (వలపుతో) నా“కుచదుర్గాలు” (కోట బురుజులవంటి చనుగవలు) యెక్కవయ్యా! నీ ప్రియురాండ్రను యేవిధంగానైనా యేమనగలవు?. నీదికూడా కొంత తప్పు లేకపోలేదు. అటూ ఇటూ యెక్కడ చూచినా సతులు (నీ వలపుకత్తెలు) యెందరున్నా, నీవు నాతోనే ప్రతిసారి నవ్వుతుంటావు. వారెల్లా కాతరించి (భయంకరంగా) దొమ్మిచేయుటకు ఒక్కటైతే, యేతులమెరసి (యెన్ని గొప్పలు చెప్పినా) నీవు వారినేమనగలవు?. ఇందరూ (నీవలపుకత్తెలంతా) కుచ్చినట్లు (కుత్సితంతో) నీ కొలువులో వుండగానె, నీవు నాతో మచ్చికసేసి మాటలాడేవు. అప్పుడు వాళ్ళంతా పచ్చిగా నిన్ను బలవంతం చేస్తే, నిన్ను ఆక్రమిస్తే నీవెంతైనా రెచ్చిపోయిన వారినేమనగలవు? సరే! నాబోటివారి గొడవ యెప్పుడూ వుండేదే. ఆసపడిన సవతులు (నీమీదే తమ ఆశలను పెట్టుకొన్న శ్రీదేవి, భూదేవి) అంటి (చేరువయై) నీకు సేవలు చేస్తుంటే, నన్ను నీవు లేసులకు (సులువుగా) కౌగలించి కూడితివి. ఓ శ్రీవేంకటేశ్వరా! ప్రసిద్ధులైనవారు నీపై తలంబ్రాలు పోసేశారు. నీదేవేరులయ్యారు. ఇక ఇప్పుడు నీవు వారి స్వంతం. ఇకనేనేమనగలను?



సంఖ్య : 474 సంపుటము : 23 పుట: 317 రాగం : వరాళి

**47 ఇవి గొన్ని నేర్చితివి యీడానాడాఁ దిరిగాడి**
**తవిలి యొక్కటొక్కటే తలఁపునఁ బారునా ॥పల్లవి॥**

**వంతులేల వెట్టేవు వాసులేల రేఁచేవు**
**పొంతనుండి నీకదేమి పొద్దువోదా**
**బంతికేల పిలిచేవు బాసలేల సేసేవు**
**కాంతల గన్నప్పుడే కదునెమ్మె వచ్చునా ॥ఇవి॥**

**చేతులేల చాఁచేవు సిగ్గులేల తడవేవు**
**రాతిరిఁబగలు నీరసమాయనా**
**ఘూతలేల సేసేవు కన్నులనేల మొక్కేవు**
**జాతుల నీకాఁడువారు సదరములయిరా ॥ఇవి॥**

**గుబ్బలేల చెనకేవు గురులేల వ్రాసేవు**
**వుబ్బి మదనకళలు వొళ్లు నిండెనా**
**నిబ్బరాన శ్రీవేంకటనిలయ నన్నేలితివి**
**అబ్బురపుసతులమే యంత నీకుఁ బ్రియము ॥ఇవి॥ 474**

**మున్నుడి :**

అన్నమయ్య, స్వామి వలపుకత్తెగా మారి యెలా దెప్పిపొడుస్తున్నారో వినండి. ఎన్నడూ లేనిది ఇక్కడా అక్కడా తిరుగాడి కొన్ని నేర్చుకొన్నావు. అవన్నీ వొక్కటొక్కటే తగిలాక ఇప్పుడు అంత తేలికగా వదులుతాయా? నీకుకాంతలను చూడగానే ఎక్కడలేని అనురాగం కలుగుతుంది. ఆడవారు అంటే నీకు అంత వేళాకోళమా? అబ్బురము కలిగించే సతులంటే నీకు అంత ఇష్టమా? ఆమె అలుక కూడా తిరుమలేశ్వరునికి యెంత మురిపెమో కదా!

**భావ దీపిక :**

స్వామీ! ఇవిగొన్ని నేర్చితివి (ఇట్లాంటివి కొన్ని కొత్తవి నేర్చుకొన్నావు). మరి ఇక్కడా అక్కడా తెగ తిరుగుతావు కదా! తవిలి (తగిలిన) ఆ సంగతులన్నీ నీకు వొక్కటొక్కటే, తలపున బారునా (గుర్తుకురాకుంటాయా?). నాతో వంతులెందుకు నీకు? అంతవాసులు (తారతమ్యాలు) యెందుకు చూపిస్తావు? దగ్గర చేరితే నీకు అంతకన్నా పొద్దుపోదా? నీసరసకు యెందుకు పిలుస్తావు. లేనిపోని బాసలెందుకు చేస్తావు? కాంతలను నీవు చూడగానే యెంత నెమ్మి (అనురాగం) వస్తుందయ్యా!! నాకోసం చేతులెందుకు చాచేవయ్యా? నా సిగ్గులనెందుకు స్పృశిస్తావు? నాకు రాత్రీపగలూ నీయొక్క రపము (యజమాయిషీ) తప్పదా? అయినా నీవు ఘూతలేలసేసేవు (పోట్లాటకెందుకు వస్తావు?) మళ్ళీ కళ్ళతో అభ్యర్థిస్తావు. నీకు ఆడజాతి అంటే అంత సదరము (వేళాకోళము) అయ్యారా? ఓ శ్రీవేంకట నిలయా! నా చనుగవనేల తాకెదవు? గురులేల (వాటిభారమేల) వ్రాసేవు (నిమిరేవు?) ఏదియేమైనా నిబ్బరాన నన్నేలితివి. ఆశ్చర్యం యేమంటే నేనంటే నీకు అంతప్రియమా?

## మంగళా శాసనం

1 శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీవేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

2 లక్ష్మీసవిభ్రమాలోక సుభ్రూవిభ్రమ చక్షుషే
చక్షుషే సర్వలోకానం వేంకటేశాయ మంగళం.

3 సర్వావయవ సౌందర్య సంపదా సర్వచేతసామ్
సదా సమ్మోహనాయాస్తు వేంకటేశాయ మంగళమ్

4 నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే
సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్

5 వైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీతటే
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్

6 ఎమత్సుందర జామాతృమునిమానస వాసినే
సర్వలోక నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

7 మంగళాశాసనపరైః మదాచార్యపురోగమైః
సర్వైశ్చపూర్వైః సత్కృతాయాస్తు మంగళమ్

**శ్రీ పద్మావతీ సమేత శ్రీశ్రీనివాస పరబ్రహ్మణేనమః**



సంఖ్య : 453 సంపుటము : 23 పుట: 303 రాగం : ఆహిరి

**49** ఇంతితోటియేలాటా లెందాఁకాను
చింతదీర చెక్కునొక్కి సేదదేర్చవయ్యా ॥పల్లవి॥

చలము లేమిటికయ్య సతితోను
వలచినమేలు చూడవద్దా నీవు
జలజలఁ జమరించె చందపుమేను
కలసి కాఁగిటిలోనె కాఁకదేర్చవయ్యా ॥ఇంతి॥

పంతము లేమిటికయ్య పడఁతితోను
యింత(తి?) సేసినవూడిగా లెంచఁగవద్దా
మంతనాన నిట్టూర్పుల మలసీ నిదె
పొంతనే మరుతంత్రాల బుజ్జగించవయ్యా ॥ఇంతి॥

గుంపెన లేమిటికయ్య కోమలితోను
యింపులు దలఁచవద్దా యిప్పుడైనాను
పెంపున నలసె నీతో బెరయుచును
అంపక శ్రీవేంకటేశ ఆదరించవయ్యా ॥ఇంతి॥ **453**

**మున్నుడి :**

"ఏలాటము" అంటే పరిహాసము అని అర్థం. అన్నమయ్య ఈ శృంగార కీర్తనలో స్వామి చెలికత్తెయై ఆయనకు నచ్చచెబుతున్నారు. నీ ఇల్లాలితో పరాచికాలెందుకయ్యా? ఆమె చింత తొలిగేందుకు సరసముగా చెక్కిలి నొక్కి ఆమె శ్రమను తొలగించవయ్యా? పడతితో పంతము లేమిటయ్యా? భార్యతో పట్టుదలకు పోవచ్చునా? కోమలితో గుంపెన లేమిటికి వేంకటేశా! అంటున్నారు. అంటే...? భావదీపిక చదవక తప్పదు మరి.

**భావ దీపిక :**

ప్రభూ! ఇంతితో యేలాటాలు (పరిహాసాలు) యెందాకా ఆడెదవయ్యా? ఆమె చింతదీరుటకు, చెక్కిలినొక్కి సేదదీర్చవయ్యా (శ్రమపోగొట్టవయ్యా!). స్వామీ! నీవు ఆమె నిన్ను వలచినందుకు మేలు చూడవద్దా? సతితో యెవరన్నా చలము (పట్టుదల) చూపిస్తారా? చందన సువాసన విరజిమ్మే ఆమే మేను యెలా చెమరించెనో (చెమటలు కక్కుతున్నదో) చూడు. ఆమెతో కలిసి నీకౌగిటిలో కాకదేర్చవయ్యా (తాపమునుపశమింపజేయవయ్యా!). శ్రీనివాసా! పడతితో పంతాలు నీకు తగునా? ఆ ఇంతి నీకు చేసిన వూడిగాలు (సేవలు) యెంచవద్దా? ఇదిగో మంతనాన (ఒక్కతే కూర్చుని) యెలా నిట్టూరుస్తున్నదోచూడు. చెంతజేరి మరుతంత్రాల (మన్మథకళలతో) ఆమెను బుజ్జగించవయ్యా! ఇంకా జాగు చేయకు. దేవా! ఇప్పటికైనా ఆమెలోని ఇంపులు (సొబగులు) దలచవద్దా? కోమలితో, గుంపెన (దెబ్బలాట)లెందుకయ్యా? ఓ శ్రీవేంకటేశ్వరా! నీతో బెరయుచు (చేరుచూ) యెంతో అలసిపోయినదయ్యా! నీదేవి. అంపక (వెళ్ళగొట్టక) ఆమెను ఆదరించవయ్యా!

సంఖ్య : 454 సంపుటము : 23 పుట: 303 రాగం : శ్రీరాగం

**50** వినరమ్మ యీసుద్దులు వెలఁదులాల
కానబుకాఁడుగదమ్మ గోవిందరాజు ॥పల్లవి॥

వీడెము లందియ్యఁగాను వింజామరలు వీయఁగా
వోడక చెలులు పాదాలొత్తఁగాను
మేడలోనఁ బవళించి మెత్తనిపరపుమీఁద
కోడెసేఁతలు సేసీని గోవిందరాజు ॥విన॥

అట్టె నాట్యములాడఁగ అంకించిపాడఁగాను
ఇట్టునట్టు వీణలు వాఇంచఁగాను
వొట్టుక మలఁగుమీఁద నొడ్డోలగమై యున్నాఁడు
గుట్టుతోడివాఁడుగదె గోవిందరాజు ॥విన॥

పరిమళాలు పూయఁగ పలువిందులు వెట్టఁగ
సిరియు భూమియుఁ బెండ్లి సేస చల్లఁగా
తిరుపతిలోన నొద్దిక శ్రీవేంకటేశుఁడై
గౌరబై నవ్వీఁగదె గోవిందరాజు ॥విన॥ **454**

**మున్నుడి :**

కొనబుకాడు అంటే “విలాసపురుషుడు” అని అర్థం. తిరుపతిలో నెలకొన్న గోవిందరాజ స్వామిపై చక్కటి శృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఓ వెలదులారా! ఈ గోవిందరాజు గొప్ప విలాసపురుషుడమ్మా! ఈయనగారి కథలు శృంగారలీలలు చెబుతాను కాస్త వినండమ్మా! అంటున్నారు. మెత్తని పరుపుల మీద మేడలో పవళిస్తాడట. ఎంతో గుట్టుతో, వుంటాడట. శ్రీదేవిని భూదేవిని పెండ్లాడి అల్లరిగా నవ్వుతున్నాడట గోవిందరాజస్వామి.

**భావ దీపిక :**

ఓ వెలదులారా! (వనితలారా!) ఈ గోవిందరాజు కొనబుగాడు (విలాసపురుషుడు) కదమ్మా! ఈతని సుద్దులు (లీలలు) వినండమ్మా!. సుగంధపరిమళ తాంబూలమునందించి వనితలు వింజమరలు వీస్తుంటే, ఆయన సతులు విసుగులేక పాదాలు వొత్తుతుంటే, మేడమీద మెత్తని పరుపులపై పవ్వళించిన ఈ గోవిందరాజు యెన్నో కోడెసేతలు (కుఋచేష్టలు) సేసేని (చేస్తున్నాడమ్మా). ఆయనను మెప్పించడానికి నాట్యకత్తెలు నాట్యములాడుచున్నారు. దానికి తగ్గట్లు పాడేరమణులు పాడుతున్నారు. వీటికి సైదోడుగా వీణలు వాయించేవారు పట్టుదలతో వాయిస్తున్నారు. వీటిని వింటూ మెత్తని మలగుమీద (దిండు మీద) ఆయన ఒడ్డోలగమై (ఎగుడుదిగుడుగా) ఆనుకొని గుట్టుతోవున్నాడు. ఆ విలాసపురుషుడే గోవిందరాజు. పరిమళాలు వెదజల్లె విందుభోజనం పెట్టిన అనంతరం ఆయన శ్రీదేవిని భూదేవిని పెండ్లాడినాడు. తిరుపతిలో అలరారుతున్న ఈయనే తిరుమల శ్రీవేంకటేశ్వరుడు. అందుకనే ఈ గోవిందరాజు గౌరబై (వింత చేతలతో) నవ్వుతున్నాడు కదమ్మా!



సంఖ్య : 168 సంపుటము : 23 పుట: 113 రాగం : శ్రీరాగం

**51** వెనకటినేరములు వేయైనాఁ దడవను
మనసొక్కటిగా బుద్ధిమంతుఁడై తేఁ జాలును ॥పల్లవి॥

యేఁటికింకా మాటలు యేమని దూరేము నేము
గాఁటపుఁదనకరుణ కలంతే చాలు
కూటమికి రమ్మనవే గుట్టుతోనే వుండేను
మాఁటులేనితాను బుద్ధిమంతుఁడై తేఁ జాలును ॥వెన॥

కాఁతరించఁబనిలేదు గద్దించ నోపను
చేతికిలోనై మన్నించినదే చాలు
తే తెమ్మనవే విడెము తిరమైతి నన్నిటాను
మాతలఁపువలె బుద్ధిమంతుఁడై తేఁ జాలును ॥వెన॥

చెక్కు లెంతవడి నొక్కె సిగ్గు లెందాఁకా నెరపె
ఇక్కు వంటి ననుఁగూడె నిదె చాలు
దక్కె శ్రీవేంకటేశుఁడు తానే నాకిన్నిటాను
మక్కువ నింతట బుద్ధిమంతుఁడై తేఁ జాలును ॥వెన॥ **168**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ శృంగారకీర్తనలో అల్పసంతోషియైన అతివ. స్వామిని మనసారా వలచిన ఆ చిన్నది తన చెలియతో ఆయన “గత చరిత్ర”తో నాకు పనిలేదు. ఆయన పాత నేరాలు వేయైనా నేను ప్రశ్నించను. తన మనస్సు నామనస్సు వొక్కటైనాక తాను బుద్ధిమంతుడైతే చాలును. తనకు నాపై కరుణవుంటే చాలు. నన్ను గద్దించకూడదు. నా చెక్కులునొక్కి నన్ను కూడితే అదేచాలు. శ్రీవేంకటేశుడు నా సర్వస్వమే. కానీ మక్కువవున్న బుద్ధిమంతుడైతే చాలును అంటున్నారు.

**భావ దీపిక :**

చెలీ! అతగాని వెనకటి నేరములు (గతించిన ప్రణయాలు) వేయైనా దలవను (ఆలోచించను). కానీ నాతో మనసులు కలిసిన బుద్ధిమంతుడైతే చాలును. ఇంకా మాటలెందుకే? మేము ఆయననేమని దూరేము (నిందించెదము?) గాటపు కరుణ (పటిష్ఠమైన దయ) కలంతే (వున్నంతే) చాలును. చెలీ! గుట్టుతో వుంటూ నాతో కూటమికి రమ్మనవే. తాను నాతో యెక్కువగా మాట్లాడకపోయినా బుద్ధిమంతుడైతే చాలును. ఆయన నాతో కాతరించపనిలేదు (తడబడే పనిలేదు). గద్దించనేనోపను (నన్ను గదమాయిస్తే వూరక చూస్తుండను). నా చేతికి లోనై మన్నించిన చాలును. అన్నిటికీ తిరమైతిని (సిద్ధపడ్డాను). ఇక విడెము తెమ్మనవే (స్వీకారతాంబూలమునందించమనవే). మా తలపులెంత పవిత్రములో అతగాడూ అంత బుద్ధిమంతుడైతే చాలును. చెలీ! నా చెక్కిళ్ళెంతసేపు నొక్కుతాడే? ఎంతసేపు బిడియపడతాడు? నా ఇక్కువలు (కళాస్థనములు) తాకి ఇట్లు నన్ను గూడినాడు. నాకదే పదివేలు. శ్రీవేంకటేశుడే నాకు దక్కినాడు. తానే నాకు సర్వస్వమూ. ఇంతమక్కువ చూపే నాప్రియుడు బుద్ధిమంతుడైతే, నాకది చాలదా?

రచయిత:

# అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు




| | | |
|---|---|---|
| పిలవండి | : | **అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు** |
| పుట్టింది | : | **9-6-1945** |
| చదివింది | : | **ఎం.టెక్.** |
| ఉండేది | : | **ఫ్లాట్ నెం. 5., ప్లాటు నెం. 61,**<br>**సిద్దార్థ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్.** |
| రంధి | : | **భగవన్నామ సంకీర్తన** |
| నచ్చింది | : | **శాస్త్రీయ సంగీతం** |
| నచ్ఛంది | : | **నక్కజిత్తులు** |
| మెచ్చింది | : | **సజ్జన సాంగత్యం** |
| రింగండి | : | 00919393021360 |
| చదవండి | : | www.geetadeksha.com |
| ఇవ్వండి | : | e-mail : geetadeksha@gmail.com |